
జ్యోతి

1965 మే

75 పైసలు




22
నాటి పుణ్య కథా ప్రపంచంలో
అద్వితీయమైనది
సత్య హరిశ్చంద్రుని కథ
నేటి చిత్రప్రపంచంలో
అద్వితీయమైన అపూర్వ సృష్టి
విజయా వారి
సత్యహరిశ్చంద్ర
దర్శక నిర్మాత...కె.వి.రెడ్డి, B.Sc.(HONS)
రచన..పింగళి నాగేంద్రరావు · సంగీతం..పెండ్యాల · కళ..గోఖలే, కళాధర్
ఛాయాగ్రహణం..కమల్ ఘోష్ : నృత్యం..పసుమర్తి కృష్ణమూర్తి

ANNOUNCEMENT

B. Sc. GROUP TEXT BOOKS

Inorganic Chemistry	by Ch. I. Varadanam	8-50
Organic Chemistry	by Ch. I. Varadanam	8-50
Botany (Seed Plants) Morphology, Histology Gymnosperms, Taxonomy, Ecology	by C. Venkata Rao	8-00
Botany (Spore Plants) Algae, Fungi Bryophyta, Pteridophyta.	by C. Venkata Rao	8-00

B. Sc. Questions & Answers :

PROPERTIES OF MATTER	by C. V. Prasada Rao	3-00
HEAT	,,	3-50
SOUND	,,	2-50

B. A., B. Com., Questions & Answers :

MODERN EUROPE	by S. Sundaram	4-00
MONEY, BANKING, INTERNATIONAL TRADE & PUBLIC FINANCE	by J. Parabrahmam & A. Venkateswarlu	5-50
THEORY & PRACTICE OF BANKING	by J. Parabrahmam	4-50
RURAL & INDUSTRIAL ECONOMICS	by J. Parabrahmam & A. Venkateswarlu	5-50
ECONOMIC PROBLEMS OF INDIA	,,	5-50
POLITICS (Theory, Organisation, Modern Govts.)	by A. Pullaiah	5-00
PUBLIC ADMINISTRATION	,,	4-50
INDIAN HISTORY (1st year students)	by V.T. Veerama Raju	3-75
,, (2nd year students)	,,	3-00
,, (3rd year students)	,,	3-00
GENERAL ECONOMICS	by G. Subrahmanyam	5-00

PRE - PROFESSIONAL COURSES


Texts:

MANUAL OF PHYSICS Vol. I	by T.V.Venkata Chari	5-00
MANUAL OF PHYSICS Vol. II	by T.V.Venkata Chari	5-00
INORGANIC CHEMISTRY	by Ch. I. Varadanam	5-00
PHYSICAL CHEMISTRY	by Ch. I. Varadanam	4-00
ORGANIC CHEMISTRY	by Ch. I. Varadanam	2-25

RAO BROTHERS (REGD.)

Educational Publishers :: Main Road, GUNTUR-1.





తొలిమాట

కవి భావుక భావ్యమానమై ఎటు వంటివస్తువైనాసరే ఆస్వాదయోగ్యంగా తయారవుతుందని సంస్కృతాలంకారికుల మతం.

ఈ సూత్రం భానుమతీరామకృష్ణ గారికి పూర్తిగా వర్తిస్తుంది. ఆమె చేతిలో అత్తగారికి, అవకాయకికూడా సాహితీగౌరవం లభించింది. మామూలుగా కథల్లో, నాటకాల్లో, సినిమాల్లో ఏ అత్తగార్ని చూసినా కోడంటికం పెట్టడమే ఆవిడగారి హాబీ. శ్రీమతి భానుమతి కలం పుచ్చుకుని కలగజేసుకునేదాకా సక్కుబాయి అత్తగారి వరవడే కొనసాగింది. ఈ సాధారణ పాత్రనే బోర్లించి భానుమతిగారు ఒక కొత్తరకం అత్తగార్ని — చాలా లవబుల్ అత్తగార్ని - తయారు చేశారు. ఇందుకు ఆమెకు లోకంలోని అత్తగార్లందరూ కృతజ్ఞత తెలపాలి. తెలుగులో కలకాలం నిలవదగిన పాత్ర ఈ అత్తగారు.

ఐతే, మా మట్టుకు మాకు, పండుటాకు చాటున పువ్వులా, మబ్బుమాటున జాబిల్లిలా, అత్తగారిచాటున దృశ్యాదృశ్యంగా, దర్శనీయంగా మెరిసే కోడలే యిష్టం. (17 వ పేజీ)



జ్యోతి
సచిత్ర మాసపత్రిక
బకింగ్‌హామ్‌పేట, విజయవాడ-2.
విడిప్రతి వెల: 75 పైసలు — ఏడాది చందా: 9 రూపాయలు
సంపుటి 3 మే 1965 సంచిక 5

ఇదో వరస....

ముఖచిత్రం : జగపతివారి 'అంతస్తులు' లో
నాగేశ్వరరావు, కృష్ణకుమారి, భానుమతి, జగ్గయ్య

మేనేజింగ్ ఎడిటరు : వి. వి. రాఘవయ్య
ఆర్ట్ ఎడిటర్ : బాపు
సంపాదక వర్గం :
నండూరి రామమోహనరావు, ముళ్ళపూడి వెంకటరమణ,
వి. ఎ. కె. రంగారావు, రావి కొండలరావు.



ఉత్తరాయణం

తులసీ కృష్ణగారి "ఓర్వలేని ఆడది" కథ మగవాడినయిన నాక్కూడా నిజంగా నచ్చింది. రాజేశ్వరిచేత అనసూయకి రాయించిన ఉత్తరంలో తులసీ కృష్ణగారు మంచి మెలుకువ చూపారు. ఈ సంచికలో యిది చక్కని రచన అంటే అతిశయోక్తి కాదు. మరి "మనసు బ్రతకాలి" కథ ప్రారంభంలో ఆశించినంత చక్కగా చివరి వరకూ నడవలేదు. అయితే ఈ కథారచనలో గల టెక్నిక్ మాత్రం బావున్నది.

క్షమిస్తే, ఈ సంచికలో ఒక లోపం ఏమిటంటే "నవీన కవిత" ఒకటి కూడా లేకపోవడం- "చాంద్రాయణం" నాబోటి 'సైన్సుగతప్రాణాలకి' చల్లిన చల్లని నీళ్ళలా వుంది.

మానేపల్లి సత్యనారాయణ,
విజయనగరం.

'జ్యోతి' ఏప్రిల్ సంచికలో అట్ట మీది 'తేనె మనసుల' దృశ్యాలు ఎంతో ఆకర్షణీయంగా వున్నాయి. 'సెక్రటరీ' సీరియల్ అత్యద్భుతంగా వుంది. ఇటువంటి సీరియల్ ను ఇంతకు ముందెపుడూ చదువలేదంటే అతిశయోక్తి కాదు. రచయిత్రి యద్దనపూడి సులోచనారాణిగారికి నా హృదయపూర్వక అభివందనాలు.

సి. శ్యామల, కందుకూరు.

కొత్త సంవత్సరానికి సరికొత్త తారల ముఖ చిత్రం జ్యోతికి వన్నె తెచ్చింది. కథలలో కృష్ణమాచార్య గారి "మనసు బ్రతకాలి" చాలా బాగుంది. యద్దనపూడి సులోచనారాణిగారి సీరియల్ చాలా రసవత్తరంగా వుంది. శేఖరానికి జయంతికి పెండ్లి అవుతుందా లేదా యని ఒకే ఆత్రంగా వుంది. వేగంగా పూర్తి చెసెయ్యండి. నండూరి పార్థసారథి గారి "శిఖరాలూ – సరిహద్దులూ" చాలా బాగుంది. ఇంతటి చక్కటి సీరియల్ వ్రాసిన వారికి నా ధన్యవాదాలు. నా అభిమాన పత్రిక జ్యోతిని ఇంత చక్కగా తయారు చేస్తున్న మీకు నా ఉగాది అభినందనలు.

వావిలపల్లె కృష్ణమూర్తి,
పొరాపురం.

"సెక్రటరీ" సీరియల్ మమ్మల్ని మరీ సస్పెన్సులో ముంచుతున్నది. ఏమవుతుందో అన్న ఆత్రుతతో కళ్ళు ఆర్పాలన్న సంగతి గూడా మరచిపోయి చదువుతున్నాను. నా అభిమాన పాత్ర జయంతికి సుఖం కలగాలనే వాంఛిస్తున్నాను. ఏప్రిల్ నెల జ్యోతిలో జయంతికి సంభవించిన విషమ పరిస్థితికి నా హృదయం ఆవేదనా భరితమైనది.

"కరుణ ప్రియ",
విజయపురి-నార్తు.

ఏప్రిల్ "జ్యోతి" చూడ ముచ్చటగా వుంది. కృష్ణమాచార్య గారి "మనసు బ్రతకాలి," చంద్రమౌళిగారి "తిరిగి వచ్చిన నిన్న" చాలా అద్భుతంగా వున్నాయి. సులోచనారాణి గారి "సెక్రటరీ" మాంచి పట్టులో వుంది. వీరందరికి నా అభివందనలు.

వై. రాంబాబు, గుంటూరు.

"జ్యోతి" పుట్టిన మొట్టమొదటి నెల గుర్తుకొచ్చింది ఈ నెల జ్యోతి చదివిన తరువాత. ఒక్కొక్క కథ ఒక్కొక్క మణిపూస. పత్రికంతా చదివాక క్రొత్త సంవత్సరమంతా "జ్యోతి" ఇలాగే ప్రకాశించాలని మనసా వాచా కోరుతున్నాను. బీనాదేవి, సుకుమార్, బాబ్జీ రచనలు కూడా చాలా చక్కగా వున్నాయి.

అప్పాజీ, రాజమండ్రి.

ఉగాది జ్యోతి మాసపత్రిక కొరకు ఎంతగా ఎదురు చూచినామో, అంతగాను మా హృదయాలను పులకింప చేసింది. కథలు క్రొత్త సంవత్సరము కనువుగా, క్రొత్త క్రొత్త పోకడలలో సాగినాయి. సీరియల్ సెక్రటరీ నవల అలా మలుపు తిరుగుతుందని ఊహించలేకపోయినాము చదివేంత వరకూ. రచయిత్రికి మా హృదయ పూర్వక అభినందనలు. "శిఖరాలూ – సరిహద్దులూ" రచయిత శ్రీ నండూరి పార్థసారధిగారు చాలా రసవత్తరంగా వ్రాస్తున్నారు. వారికి మీ ద్వారా మా అభినందనలు తెలుపగోర్తున్నాము. ముచ్చటగా ముఖచిత్రంమీద విశ్వావసు క్రొత్త తారలను పరిచయం చేస్తూ ముద్రించిన వారి చిత్రాలు చాలా బాగున్నాయి.

కుంపట్లు, సత్య,

హైదరాబాదు

శ్రీ కృష్ణమాచార్యగారి "మనసు బ్రతకాలి" కథ చాల బాగుంది. ఇందులో శ్రీదేవి, అనంతు పాత్రలు అత్యుత్తమంగా సృష్టింపబడ్డాయి. అనంతులోని బలహీనతతోబాటు రాము ప్రోత్సాహంతో అనంతు మనసు చెదరి శ్రీదేవితో ఆమెపై తనకున్న ప్రేమను, జాలిని వ్యక్తం చేయటం చాల సహజంగా నున్నది. ఇటువంటి ఉత్తమ కథానికను అందజేసిన రచయితకు నా అభినందనలు.

యద్దనపూడి సులోచనారాణి గారి "సెక్రటరీ" సీరియల్ నవల పాఠకుల మనస్సులను ఉద్రూతలూగిస్తూంది. ఇందులో జయంతికి, శేఖర్‌కి పెండ్లి అవుతుందని లోగడ ఊహించాను. కాని ఏప్రిల్ సంచిక చదివిన తర్వాత ప్రసాద్‌కి, జయంతికి వివాహం జరుగుతుందని అనుమానంగా వున్నది. కథను మంచి సస్పెన్సుతో నడిపిస్తున్నారు. అద్వితీయమైన తన రచనా నైపుణ్యంతో పాఠకులమనస్సులను రంజింప చేస్తున్న ఇటువంటి సీరియల్‌ను రచించిన రచయిత్రికి, ప్రచురిస్తున్న మీకు నా హృదయ పూర్వక అభివందనములు.

అమరా రాజేంద్ర ప్రసాద్,

చీరాల



ప్రథమ వర్ధంతి

నెహ్రూ గతించి అప్పుడే ఏడాది అయిపోయింది. ఆయన లేనిలోటు మనకి అనుదినం జ్ఞాపకం వస్తూనే వుంది. కొన్ని దశాబ్దాలుగా ఆయన మనలో, మన జీవితాలలో ఒక అంతర్భాగమై పోయాడు. హఠాత్తుగా ఆయన అంతర్ధానమై పోవడంతో జాతిలోనే ఏదో తీరని వెలితి ఏర్పడిపోయింది.

ఈనాడు దేశాన్ని ఒకానొక అవ్యవస్థ పరిపాలిస్తోంది. జాతీయంగా సరే, అంతర్జాతీయంగా కూడా, స్వాతంత్ర్యం వచ్చిన పదిహేనేళ్ళదాకా మన దేశం చెలాయించిన పలుకుబడి, ప్రాభవం ఈనాడేమైపోయాయో తెలియదు. ఎటు చూసినా గర్వించదగింది తక్కువ.

నెహ్రూ వుండి వుంటే? అనేది అర్థంలేని ప్రశ్న. నెహ్రూ లేడనేది, మరొక నెహ్రూ మరి రాడనేది కఠోర సత్యం. ఈ సత్యానికి మనం అలవాటు పడాలి. ఆయన లేకుండా ముందుకు సాగిపోవడం మన జాతి నేర్చుకోవాలి.

అంటే ఏమిటి? నెహ్రూ రాజనీతి ఆయన వ్యక్తిత్వానికి భిన్నమైనది కాదు. ఆయన విధానాలు ఆయనలో ఒక భాగం. ఈ రోజున ఆయన లేకుండా ఆయన విధానాలను యథాతథంగా అమలు చేయగల మనుకోవడం భ్రమ. నెహ్రూను అనుకరించడానికి యత్నించిన దాని ఫలితాలు ప్రత్యక్షంగా కనిపిస్తూనే వున్నాయి.

ఇప్పటి నాయకులు సొంత విధానాలను వెదుక్కోవాలి. ఈనాటి దేశీయ, అంతర్దేశీయ పరిస్థితులకు అనుగుణమైన కొత్త పద్ధతులు అవలంబించాలి. గాంధీ విధానాలపై నెహ్రూ తన వ్యక్తిత్వ ముద్ర వేసినట్టు, నెహ్రూ విధానాలపై మనం ఈనాటికి తగిన ముద్ర వేయడానికి యత్నించాలి. ఇలా యత్నించాలని కోరినందునే నెహ్రూ తన వారసుడిని పేర్కొనడానికి నిరాకరించాడు. దీని అంతరార్థం గ్రహించ గలిగితేనే మన నాయకులు ఇప్పటి అవ్యవస్థనుంచి బయటు పడగలరు.

"సందేహానికి బందీలు"

"సుష్టుగా భోజనం చెయ్యలేదని విచార పడబోకు — అడుక్కు తినే వాడికంటె నువ్వెంతో మెరుగనుకో…"

• "గొడుగు చిరిగింది, తల తడుస్తోందని బాధపడద్దు — అదీ లేనివాళ్ళ గతేమిటో ఆలోచించి చూసుకో, మరి…"

—సూటిగా చెప్పాలంటే ఇలా వుంటోంది మన రాజకీయ నాయకుల సమాధానం. అంతా "శాడిస్టిక్ ప్లెజర్."

మరోవైపు చూడబోతే—

స్వతంత్రం రావటం, ప్రణాళికలు వెయ్యటం, యెన్నికలు గెలవటం— ఉద్యోగాలిప్పించుకోవటం, ఉద్యోగాలిప్పించుకోవటానికి యెన్నికలు గెలవటం, యెన్నికలు గెలవటానికి ఉద్యోగాలిప్పించుకోవటం… అంతా విషవలయం, అంతా ప్రణాళికా బద్ధంగా తిరిగే విషవలయం…

నెహ్రూ గారు ఖాళీచేసి వెళ్ళిపోయిన ఫూల్‌పూర్ నియోజకవర్గంలో గెలిచి, ఆ తరువాత పార్లమెంటులో మొదటిసారిగా ప్రసంగిస్తూ "ఈనాటి మంత్రులందరూ ఎటువంటి నిర్ణయాలు తీసుకోలేని శక్తిహీనులు" అని శ్రీమతి విజయలక్ష్మీ పండిట్ చేసిన విమర్శ… …అక్షరాలా నిజం అనిపిస్తుంది.

షేక్ అబ్దుల్లాకు ప్యాస్‌పోర్టు ఇచ్చి పంపటంలోగాని, పాకిస్తాన్-చైనాల ఎత్తుగడలను ఎదుర్కొనే విషయంలోగాని, వియత్‌నాం విషయంలోగాని, ఆఖరుకు సూచాసింగ్‌ను నేపాల్ నుంచి తీసుకువచ్చే విషయంలో కూడా—ప్రతి దాంట్లోనూ అయ్యవార్లింగంగారి అపరస్పృష్టే ప్రత్యక్షమవుతూవుంది మన నాయకుల నడత చూస్తుంటే.

వియత్‌నాం సమస్యతో తాను సతమతమై పోతున్నందున "అతిథులను ఆహ్వానించుకోవటానికి తనకు స్థిమితంలేనట్లు అమెరికా ప్రెసిడెంట్ జాన్సన్ తెలియజేశారు. అందుకుగాను ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి గారి అమెరికా పర్యటన వాయిదా పడింది.

రాజకీయ వాతావరణం

మన ప్రధాని పర్యటనే కాదు, అంతకు యెంతో ముందే ప్రారంభం కావల్సిన అయూబ్.ఖాన్‌గారి పర్యటనకూడా వాయిదా పడిన విషయం గమనించాలంటున్నారు మన నాయకులు, ఇదీ మనవారి సంతృప్తి.

ఏమైతేనేం వెనక ముందుగా అమెరికా పర్యటించి రావలసిన లాల్‌బహదూర్ శాస్త్రి, అయూబ్ ఖాన్‌ల ప్రయాణాలు వాయిదా పడ్డాయి.

అసలు కారణాలు లేకుండా వాయిదా పడ్డాయనికాదు. చెప్పిన కారణాలకంటె చెప్పని కారణాలు చాలా వుండి వుంటాయనేది అనుమానం వీరి ఇరువురి పర్యటన ఒక్కమాటుగా వాయిదా పడటం; యించుమించు ఆదే సమయంలో అమెరికా పర్యటించవలసిన కొరియా అధ్యక్షుని పర్యటన, ఇటలీ ప్రధాని పర్యటన వాయిదాలు పడకపోవడం— అమెరికాలోనూ ఇండియాలోనూ కూడా రాజకీయ పరిశీలకులను దిగ్భ్రాంతులను చేశాయి. వేచి చూడాల్సిన విషయం చాలావుంది.

దీనికితోడు – ఇండొనీసియాలో "బాండుంగ్ వార్షికోత్సవాల"కు విదేశాంగ మంత్రి శ్రీ స్వరణ్‌సింగ్ బదులు ఆహారమంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యం భారతదేశం తరపున హాజరయ్యారు. దీనికి కారణంలేదని కాదు. చెప్పిన కారణం మాత్రం సమంజసంగా తోచదు.

బాండుంగ్ సమావేశాల వార్షికోత్సవాలంటూ చైనా, ఇండొనీసియా, పాకిస్తాన్‌లు కలసి చైనాకు ఒక ప్రచార వేదికను కల్పిస్తున్నాయి. అలాంటి కుటిల యత్నాలను పట్టించుకోకుండా వుండటం అవసరం కాబట్టి భారతదేశం తరపున విదేశాంగ మంత్రిని కాకుండా, యేదో మొక్కు తీర్చుకున్నట్లు, ఆ సమయానికి ఆ దగ్గర దేశాలలో పర్యటిస్తున్న ఆహారమంత్రిని "అట్లాకూడా వెళ్ళి చూసిరమ్మనటం"—ఒక విధంగా బాగే అనిపించినా దూరదృష్టితో ఆలోచిస్తే మాత్రం, ఆలోచనలేని పనిగా అనిపిస్తుంది.

బాండుంగ్ సమావేశంలోనే ప్రధాని నెహ్రూ "అలీనవిధానం" అంటూ ఒక కొత్త ధ్యేయాన్ని ప్రపంచానికి చాటారు. అది ఆసియా, ఆఫ్రికా దేశాలను ఆకర్షించింది. భారత దేశానికి ఒక ఉన్నతమైన ప్రతిష్టను తెచ్చిపెట్టింది. "పంచశీల"కు వంచన తెచ్చి చైనా నయవంచన చెయ్యటం, బాండుంగ్ సూత్రాలను భ్రష్టుపట్టించటం — తరువాత జరిగిన విషయాలు.

అంత మాత్రం చేత నిస్పృహ పొంది ఆ "బాండుంగ్" ఉత్సవాలంటేనే అశ్రద్ధ చెయ్యటం ధీరత్వానికి లక్షణం కాదు. ఆ సమావేశాలకు తప్పకుండా విదేశాంగ మంత్రినే

పంపాలి, చాక చక్యంతో పనిచేసి చైనా కుటిల నీతిని ప్రపంచానికి వెల్లడి చెయ్యాలి, అప్పుడే యెత్తుకు పైయెత్తు అవుతుంది కాని, ఆ సమావేశాలంటేనే అశ్రద్ధ చెయ్యటం దూర దృష్టితో కూడిన పనికాదు.

ఆసియాలోని చిన్న దేశాలను నయానాభయానా బెదిరించి ఆసియా నాయకత్వాన్ని, తద్వారా ఆసియా-ఆఫ్రికా నాయకత్వాన్ని హస్తగతం చేసుకోటానికి చైనా పన్నాగాలు పన్నుతోంది. అలాంటి తరుణంలో భారత దేశం యేమరుపాటు వహిస్తే చైనాకు పరోక్షంగా బలం కలిగించటమే అవుతుంది.

ఆసియా-ఆఫ్రికా భూ భాగంలో చైనాకు దీటుగా, అంతకు యెంతో మిన్నగా భారత దేశం నిలబడాలి, అప్పుడే ఆ దేశానికి విలువ, గౌరవం, ఒక ప్రతిపత్తి, ఒక విశిష్టత లభిస్తాయి.

అంతేకాని, మన గొడవ మనం చూసుకుంటే చాలు, అవసరమైతే అమెరికా సహాయానికి వస్తుందిలే, "ఈ మాట రా, మా సంగతి చెబుతాం" అనటంవల్ల ఏమీ ప్రయోజనం లేదు.

నాయకత్వం అనేది ఎవరోయిస్తే వచ్చేదికాదు మనంతట మనం చొరవ చేసి అందిపుచ్చుకోవాలి. ప్రతి విషయాన్ని శ్రద్ధగా పరిశీలించాలి. నిండుగా లోతుగా తరచి మాట్లాడాలి. అప్పుడే దానికి విలువ.

షేక్ అబ్దుల్లా చౌ ఎన్ లైను అల్జీరియాలో కలుసుకుంటే, కలుసుకున్నట్లు పత్రికల్లో ప్రకటించిన తరువాత ఇరవై నాలుగు గంటలకుగాని ఆ విషయం అల్జీరియాలోని మన రాయబార కార్యాలయంవారు మన ప్రభుత్వానికి అందజెయ్యలేదు. ఇది మన రాయబార కార్యాలయాలవారు పని చేస్తున్న తీరు. ఇలా వ్యవహరిస్తే దేశ ప్రతిష్ఠ యెంత అపఖ్యాతి పాలవుతుందో యెవరైనా ఊహించుకోవచ్చు. చైనాకు పోటీగా గట్టిగా నిలబడి ఆసియాలో ప్రజాస్వామ్యానికి పరిరక్షణ కల్పించగల నేర్పు చొరవ మన కున్నప్పుడే అమెరికాగాని మరి యే ఇతర దేశంగాని హర్షిస్తుంది. సహాయం చేస్తుంది. లేకపోతే ప్రతి విషయంలోనూ ప్రతిచోటా మనకు చిన్నచూపే ప్రత్యక్షం అవుతుంది.

ప్రధాని అమెరికా పర్యటన రద్దు అయినందుకు బాధపడనక్కరలేదు.

షేక్ అబ్దుల్లా

షేక్ అబ్దుల్లాకు ప్యాస్‌పోర్టు ఇచ్చి బయటికి పంపించటంలో చూపినంత తొందరపాటు బయటి దేశాలకు ఆయన వెళ్ళిన తరువాత ఆయన చేస్తున్న కార్యకలాపాలను పసి కట్టటంలో మన ప్రభుత్వం చూపలేదేమో అనిపిస్తుంది.

అంతేకాదు, తుదకు ప్యాస్‌పోర్టు ఇవ్వటం, ప్రయాణానికి కావలసిన విదేశీమారకం అందజెయ్యటం— ప్రతి విషయంలోను మన ప్రభుత్వం అనవసరమైన, ఆలోచనారహితమైన

వేగిరపాటు చూపించారు. ప్యాస్‌పోర్టుకు పెట్టిన దరఖాస్తులో అక్కర్లేనిచోట 'కాశ్మీరీముస్లిం' అని ఆయన రాస్తే దానిని మనవారు గమనించనేలేదు. మక్కా వెళ్ళిరావటానికి సాధారణంగా నాలుగు వందలపౌండ్ల విదేశీ మారకం వుంటేచాలు. కాని ఆయనకు 2,600 పౌండ్ల మారకం 'గొప్పగా' అందజేశారు.

ఆయన బయటికి వెళ్ళితే యేం మాట్లాడతాడో, కాశ్మీరును గురించి ఆయన అభిప్రాయాలేమిటో అందరికీ తెలును. ప్రభుత్వానికీ తెలుసు. తెలిసి కూడా బయటికి వెళ్ళటానికి ఆయనకు యెందుకు అనుమతిచ్చారు? అంటే మనదేశంలో ప్రజాస్వామ్యం ఉంది కాబట్టి అనేది సమాధానం. బాగానేవుంది కాని ఆయన అల్జీరియాలో జరిపిన కార్యకలాపాలను విని ఒక్కమాటుగా ప్రతిపక్షాలతో పాటు ప్రభుత్వం కూడా ఆశ్చర్యపడటమే మనందర్నీ ఆశ్చర్య పరుస్తుంది.

రెండవ విషయం—షేక్ అబ్దుల్లా గారిని చైనా వెళ్ళకూడదని మనం బెదిరించాం. మంచిదే, కాని యేం లాభం? ఆయన స్వయంగా, గుట్టు చప్పుడు కాకుండా, అల్జీరియాలో చౌ-ఎన్-లైను కలుసుకుని దీర్ఘంగా మాట్లాడితే యేం చెయ్యగలిగాం? ఇక షేక్ అబ్దుల్లా చైనా వెడితేయేం వెళ్ళకపోతేయేం—వెళ్ళినంతపని అల్జీరియాలోనే జరిగిపోయిందిగా ... ...

పాకిస్తాన్ తో......

చైనాతో మనకు కలిసిన సిగపట్ల గోత్రాలలో చైనాకు పక్కగా పాకిస్తాన్‌కూడా చేరింది. చైనా ఆడిన దాగుడుమూతలాటలే అదీ యిప్పుడాడుతోంది. మనకేం భయంలేదు, ఇంతకుముందుమాదిరిగాకాదు, సైన్యబలం మనకు చాలా పెరిగిందని శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రి మొన్న అహ్మదాబాద్‌లో ధైర్యంచెప్పారు. వాస్తవమే అనుకుందాం... ...

ఐనా ... ...

మన ఉత్తరసరిహద్దులచుట్టూ ఒకవైపు పాకిస్తాన్ మరొకవైపు చైనా సైన్యాలు మోహరిల్లి వున్నాయి. ఏ క్షణంలో యేది జరిగినా జరగవచ్చు.

దీనికితోడు —

నాగా విద్రోహులకు గెరిల్లా యుద్ధంలో పూర్తిగా శిక్షణయిచ్చి ఆయుధాలిచ్చి చాటుమాటుగా పాకిస్తాన్ మనదేశంలోకి పంపిస్తోంది అనేది మరోవార్త. తడవకు పదిహేను వందలమంది చొప్పున ఇంతవరకు నాలుగు ఝట్లుగా ఆ విద్రోహులు మన దేశంలోకి చొచ్చుకొచ్చారట.

రాబోయే రోజులు మన నాయకత్వానికి ఎంతో గడ్డయిన రోజులు. సమస్యలు పరిష్కరించుకోవడంలో చొరవ చూపించాలి. సమర్థత, చతురత, చురుకుదనంకూడాచూపించాలి. అంతేగాని శ్రీమతి విజయలక్ష్మి పండిట్ అన్నట్లు 'ప్రిజనర్స్ ఆఫ్

ఇన్‌డెసిషన్'గా మన నాయకులైతే ఏమాత్రం లాభంలేదు.

'స్వారీ చెయ్యటం చేతకాని నాయకులను గుణ్ణం దింపటానికి వచ్చాను. నాకు పదవి కావలసి నేను రాలేదు. గుణ్ణాన్ని అదుపుచేసుకో గలిగినవాళ్ళకే నాయకత్వం అందజెయ్యటం నా కర్తవ్యం' అని అంటోంది శ్రీమతి విజయలక్ష్మి పండిట్.

ఏం జరుగుతుందో, యెలా జరుగుతుందో వేచిచూడాలి.

రాష్ట్ర రాజకీయం

రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ తిమ్మారెడ్డి, ఆహారమంత్రి శ్రీ బలరామిరెడ్డి "దూషణ భూషణ తిరస్కారాల' బేరీజులతో పత్రికా ముఖాన ప్రత్యక్ష మయారు. ఇద్దరిదీ చాలా కాలపు సంబంధంట. ఇద్దరిదీ ఒకే జిల్లా. వారిని గురించి వారిలోవారికి తెలిసినంతగాబయటివారికితెలియదు. అందుకే వారు అనుకుంటుంటే మనం వినాలి; చెబితే మనం ఆలకించాలి.

ముఖ్యంగా వ్యవసాయ శాఖలో జరిగే అవకతవకలు విమర్శించి, ఆ శాఖ మంత్రి వర్యులను పరోక్షంగానే, ఘాటుగా శ్రీ తిమ్మారెడ్డి విమర్శిస్తే, అంతకు రెట్టింపు స్థాయిలోనే వ్యవసాయమంత్రి శ్రీ బలరామిరెడ్డి సమాధానం చెప్పారు.

ఇంతకుముందు ఒకమారు బహిరంగంగానే శ్రీ తిమ్మారెడ్డి శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డితో 'పాలిసీ మేటర్స్'లో ఘర్షణ పడ్డారు.

చిత్రం యేమిటంటే శ్రీ తిమ్మారెడ్డి, శ్రీ సుబ్బారెడ్డి, శ్రీ బలరామిరెడ్డికూడా మూలవిరాట్ శ్రీ సంజీవరెడ్డివారి ముఖ్య శిష్యులు, అనుంగు శిష్యులుకూడా. అందుకే యెవరు యేమనుకుంటున్నా యెంత బహిరంగంగా అనుకున్నా ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి మాత్రం "దారు భూతోమరారి' అన్నట్లు కిమిన్నాస్తి దేముడులాంటి మనిషి.

"గుర్తింపు......"

ఇది వార్త—రాజస్తాన్‌లో ఒక ఉద్యోగిని ఒకచోటునుంచి మరొకచోటుకు బదిలీ చేశారు. కొత్తచోటుకు వెళ్ళి చేరాలంటే కొత్తవాళ్ళు ఆయన్ను గుర్తించలేదుట. ఏడుసంవత్సరాలు గడిచి మొన్న రాజస్తాన్ శాసనసభలో ఈవిషయం ప్రస్తావనకువస్తే"ఇప్పుడైనా ఆయన్ను గుర్తించి" ఉద్యోగంలో చేర్చుకోండని విద్యామంత్రి ఉత్తర్వు వేశారట.

—అనంతం.




అత్తగారూ—అష్టావధానం

భానుమతీ రామకృష్ణ

ప్రతిరోజూ ప్రొద్దుటే మెళకువ రాగానే మా అత్తగారు "కౌసల్యా సుప్రజారామా" అంటూ లేస్తారు - కండ్లు కూడా తెరవకుండానే దారి తడుముకుంటూ వంటింటివైపు వెళ్తారు.

భోజనాల గదికీ, వంటింటికీ మధ్య ప్లేట్లూ, కప్పులూ, సాసర్లూ పెట్టే షెల్ఫుంది... ఆ షెల్ఫుమీద ఒక మట్టిబొమ్మ వుంది ... కంసుడి గుండెలమీద కృష్ణుడు కూర్చుని పీక నొక్కి చంపుతూంటే, కంసుడు గుడ్లు తేలేసి బేర్‌మంటూ అసహాయ స్థితిలో మన వైపు చూస్తుంటాడు... ఆ బొమ్మ కొలువులో పెట్టే దశావతారాల్లో కృష్ణావతారం-చాలా పాతదైందని చేతులూ కాళ్లూ విరిగిన బొమ్మల్లో పడేశాను... అందువల్లే కంసుడికో కాలులేదు...కృష్ణుడికో వేలు లేదు ... అయినా మా అత్తగారికి ఆ బొమ్మంటే ప్రాణం... అందుకే ఆ పాత బొమ్మల్లోనుంచి తీసి 'షెల్ఫుమీద పెట్టారు... నేరుగా ఆ బొమ్మ ముందు కెళ్ళి కండ్లు తెరిచి నమస్కారం చేసేవారు.

నాకో సందేహం కలిగేది- ఆవిడ నమస్కరించేది చచ్చిపోతున్న కంసుడికా! చంపుతున్న కృష్ణుడికా! అని.





కండ్లు తెరుస్తూనే ముందు కనబడేది కంసుడే!—

ఎంత రాక్షసుడైనా కృష్ణుడికి మేనమామే గనక కంసుడుగూడా గొప్పవాడేనని మా అత్తగారు తేల్చి చెప్పిందాకా నా కర్థంగాలేదు.—

ఒకరోజు ఆమె కంసుడికి నమస్కారం చేస్తుండగా మా పెరటిగోడ వెనకనుంచి చక్కటి సన్నాయి మేళం వినిపించింది.— ప్రొద్దుటే మంగళ వాద్యం చెవుల పడగానే మా అత్తగారి ఒళ్ళు పులకరించి ఆనందంతో పరవశం చెందారు—

మా పెరటి వెనకాలవున్న పోరంబోకు స్థలంలో చాలా గుడిసెలు లేచాయి— వాటిలో మంగలివాళ్ళెవరో కొత్తగా చేరినట్లున్నారు.

మా అత్తగారు సంతోషపడిపోతూ చెప్పారు ... ... "నీకు చెప్పానో లేదో; నేను ? ... ... చిన్నప్పుడు నేను పుట్టిన పల్లెటూళ్ళో గూడా, మా పెరటివెనకనే కాపురం వుంటూండేవాళ్ళు చాకలివాండ్లూ, మంగలివాండ్లూనూ ... ... మా తాతగారూ, అవ్వగారూ, యింటికి మంగళకరంగా వుంటుందని, ప్రతి శుక్రవారంనాడూ ఆ మంగలివాళ్ళనొచ్చి వాకిటిముందు కాసేపు మంగళ వాద్యం వాయించి వెళ్ళమనే వారు... ... ఇంక వాళ్ళుఎంత బాగా మేళం వాయించేవాళ్ళంటే మా తాతగారూ, అవ్వగారూ ఆనంద బాష్పాలొదిలేవాళ్ళు — అదంతా జ్ఞాపకంవస్తోంది — అనుకోకుండా మన పెరటివేపుగూడా మంగలివాళ్ళెవరో కొత్తగా చేరారు—ఇక్కడ శుక్రవారమే గాకుండా ప్రతిరోజూ లక్షణంగా మంగళవాద్యం వింటూండొచ్చు—వాళ్ళు వచ్చినవేళా విశేషం మనింట్లోగూడా ఏదైనా శుభకార్యం అయితే"—అని మా అత్తగారు ముగించకముందే ఆ గుడిసెల్లోనుంచే గాడిదరిచింది — ఇక ఆమె ఆనందానికి అంతం లేకుండా పోయింది—



గాడిద అరిస్తే ఏదనుకుంటే అది వెంటనే ఫలిస్తుందంటారు ... ఆగాడిద మా పెరటి వెనకనే చేరింది. "ఒసేవ్! ఎవరో చాకలి వాళ్ళు గూడా మన పెరటి వేపు గుడిసెల్లో చేరినట్లున్నారేవ్! ... అన్నట్లు నా చిన్నప్పుడు మా యింట్లో పక్క లేసేదీ, బట్టలుతికియింటిపట్టునేవుండి అన్ని పన్లూ చేసేదీ చాకలివాడే ... మనం ఈ పనివాళ్ళతో బాధపడిపోతున్నాం. రాహుకాలం, వర్జ్యం లేకుండా చూసి ఆ చాకలివాళ్ళకు కబురుపెట్టాలి ఎవడైనా ఇంట్లో పనికి కుదుర్తాడేమో" అని మా అత్తగారు అంటుండగానే భోజనాల గదిలో గడియారం రెండు గంటలు కొట్టింది.

"ఇదేమిటే మళ్ళీ ఏమొచ్చింది దీనికి ! ... గంట ఏడవుతుంటే రెండు గొట్టి వూరుకుందేం? ..." అంటూ భోజనాల గదిలో కెళ్ళారు మా అత్తగారు ...

ఆ గడియారం మా అత్తగారి పుట్టింటి కానుక— అందుకే ఆ గడియారం అంటే ఆమెకు ప్రాణం — లోపల అంకెలు మాసిపోయి రెండు ముళ్ళూ సగందాకా విరిగిపోయి శిధిలావస్థలో నీరసంగా గోడకు వేళ్ళాడుతున్న ఆ గడియారం చూస్తుంటే సిలువకు కొట్టబడిన ఏసుక్రీస్తు జ్ఞాపకం వస్తాడు— ఆ గడియారానికి "కీ" యివ్వడం మా అత్తగారి అభిమాన పాత్రుడైన డ్రైవరు తాత ఒక్కడికే తెలుసు– అతను ఉబ్బసం వ్యాధితో నెలకు పదిహేను రోజులు పనికిరాడు. ఇక ఆ గడియారానికి "కీ" యిచ్చే నాధుడుండడు ... కరెక్టుగా "కీ" యిస్తుంటేనే ఒకటిన్నర గంటలు లేటుగా నడుస్తుంటుంది — "కీ" యివ్వడంఒక్కరోజు లేటయినా యిక దానికి మతిపోతుంది — కాని ఆగిపోదు— అదీ మా అత్తగారు మెచ్చుకొనే ఆ గడియారం యొక్క గొప్పతనం—

ఆ గడియారం గంటలు కొ[illegible] ముందు సంగీతం పాడు[illegible] దానికి 'కీ' అయిపోయిందని [illegible] కోడానికి [illegible] గుర్తు. దాని సంగీ[illegible]

తాగిన వాడి పాడినట్లుంటుంది ... గంటలు మత్తుగా కొడుతుంది ... రెండు ముళ్లూ అంకెల మీద తూలుతూ నడుస్తాయి ... అల్లాంటప్పుడు వున్నట్లుండి ఆ గడియారానికి 'ఫిట్స్' వొస్తుంటాయి ... టైమ్ ఒంటిగంట చూపుతుంటుంది. ఎక్కడలేని స్పీడుతో వరసన యిరవై గంటలు కొట్టేస్తుంది ... కాసేపుండి నీరసంగా ఆరు గొట్టి పూరుకుంటుంది. మామూలుగా గంటలుకొట్టే ముందు పాడే సంగీతం గంటలు కొడుతూ పాడుతుంది జాలీగా ... దాన్ని రిపేరు కివ్వబోతే ఏ గడియారం కంపెనీవాళ్ళూ తీసుకోలా ... అందరూ ఒక్క నమస్కారంపెట్టి దాన్ని మ్యూజియంలో పెట్టమన్నారు ... అక్కడెందుకులే నాఘటం వున్నన్నాళ్ళూ, యిక్కడే వుండనిమ్మన్నారు మా అత్తగారు ...

ఎక్కడానయంగాని కేసుల్ని చివరకు "హోమియోపతి" వైద్యానికి వదిలినట్టు, ఇక అంతకంటె చెడదు గదా అని మా డ్రైవరు తాతే కారు రిపేరుచేసే పనిముట్లతో ఆ గడియారం రిపేరు చేశాడు — అప్పట్నుంచీ మిగతా గడియారాలకంటే ఒకటిన్నరగంటలు లేటుగా నడవడం మొదలెట్టింది ... ...

దానిగంట నమ్ముకుని చాలాసార్లు మా అత్తగారు అర్ధరాత్రివేళ లేచి పడ్డుతోముకుని, పాలవాణ్ణి లేపి పాలు పిండమని నానా గొడవా చేశారు ... ... అప్పట్నుంచీ పనివాళ్ళందరికీ ఆ గడియారం అంటే ఒళ్ళుమంట ... ... దానివైపు కన్నెత్తికూడా చూడరు ... ... "అదేం గడియారం అమ్మా ? అస్తాయిస్తాన బడ్డది ... తీసి దిబ్బలో పారెయ్యాల్సిందే ... ..." అంటారు. ఎవరెన్నిజెప్పినా మా అత్తగారుమాత్రం ప్రొద్దుటే ఆ గడియారం ఒకసారి చూడకుండా వెళ్ళరు ... ... "దీని 'కీ' అయిపోయిందేవ్ ! ... ... ఆ ఉబ్బసం వెధవ రాలేదులావుంది ... ... అన్నట్లు ఏకాదశి ఎప్పుడే ! ..." అంటూ పంచాంగం ముందేసు క్కూర్చున్నారు—

ఆమెకు పంచాంగం చూట్టంఅంటే చాలా సరదా—పదేళ్ళనాటి పంచాంగాలుకూడా ఆమె దగ్గరుంటాయి ... తీరిక సమయాల్లో అన్ని పంచాంగాలూ ముందేసుకుని ఏ యే సంవత్సరంలో గ్రహణం ఎవరెవరికి పట్టింది, అధిక మాసాలు ఎప్పుడు వచ్చిందీ, కార్తె లెప్పుడు ప్రవేశించిందీ, తారాబలం, చంద్ర బలం మొదలయిన వాటితోబాటు బల్లి పలుకులూ, తుమ్ముల ఫలాల వరకూ విడవకుండా చూస్తుంటారు ... దగ్గరున్న పది పంచాంగాల్లో ఒక్కొక్కసారి కొత్త పంచాంగం అనుకుని పాత పంచాంగం చూస్తుంటారు ... ఆ చూట్టంలో ఎల్లుండి ఏకాదశి అనుకొని ఏకాశిరోజు



భోంచేస్తుంటారు ... అలాగే పక్కింటావిడొచ్చి పంచాగం చూసి బిడ్డకి అన్నప్రాశనకి మంచి రోజు చెప్పమంటే హడావిడిలో పాత పంచాంగం చూసి పంచమి భేషుగ్గా వుందని చెప్పి అష్టమినాడు అన్నప్రాశన చేయించారు.

"అమ్మా ! ..." అంటూ బయట వాకిట్లోనుంచి ఎవరో కేకేశారు.

"ఎవర్రా అదీ" అంటూ మా అత్తగారు హాల్లోకొచ్చారు ...

"నేనమ్మా సాకలోణ్ణి ... మనింటెనక గుడిసెల్లో వుంటుండా ..."

"ఓహో ! ప్రొద్దున్నే అరిచిన గాడిద నీదేనన్నమాట ... ... ఊ— ఏవూరు నీది !—" అన్నారు ఆడపోయిన తీర్థం ఎదురైందని సంతోష పడుతున్న మా అత్తగారు.

"మునపక్కే నమ్మా ..."


"అయితే ఏం యింతదూరం వచ్చావ్ ! ..."

చాకలివాడు కాస్త సిగ్గుపడి తలొంచుకుని చెప్పాడు ...

"ఎంతయినా పట్నంలో పనిజేసేదారి వేరు ... అడ ఎంత రెక్కలిరునుకున్నా రాబడి గొర్రెతోకే గదమ్మా. మా సుట్టం ఒకడు యీ వూరొచ్చి ఏడాదికూడా కాలా ... సినీమా కంపెనీల్లో పని చేసి తెల్లారేసరికి యిల్లు గొన్నాడు" ... అని చాకలి చెప్తూంటే మా అత్తగారు నావైపు చూశారు ...

"ఓహో! అట్లాగా! సరే అయితే నువ్వుగూడా ఏ కంపెనీలోనో పని జేసి సాయంకాలానికో యిల్లు గొను ... వెళ్ళిరా ..." అంటూ మా అత్తగారు వెనక్కి తిరిగారు ...

"అయ్యొయ్యో! అమ్మా! నే మాట సామెతకి జెప్పా ... గిసుకాద పని



జేయడానికనే నేనొచ్చింది... కోప్పడకండి .. ఏదైనాపనిప్పించండి' అంటూ ప్రాధేయపడ్డాడు చాకలి...

'అయితే యింటి పట్టునే వుండి యింటిపనన్నీ చేయాలి'... అని మా అత్తగారనే సరికి చాకలివాడి గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డది. అయినా వేరే గత్యంతరం లేక ఒప్పుకున్నాడు...

మర్నాడే వచ్చి పనిలో చేరమన్నారు.

గాడిద అరిచింది...

మా అత్తగారు తృప్తిగా నిట్టూర్చారు...

మర్నాడుమామూలుగాకంససంహారంముందు నిలబడి నమస్కరిస్తూన్న మా అత్తగారికి మంగళవాద్యం వినిపించింద...... కాని మొదటిరోజులాగా కాకుండా ఇంకెవరోకొత్తగా నేర్చుకునేవాడు కూడా సన్నాయి వాయించడం మొదలెట్టాడు — ఆ నేర్చుకునేవాడెవడోకాని ప్పిప్పిప్పి అంటూ శ్రుతిలో జేరకుండా అపశ్రుతులతో మా అత్తగారికి మతిపోగొట్టేశాడు... ...

'ఛీ ఛీ ఛీ ... ప్రొద్దుటే వీడెక్కడ దాపరించాడే వెధవ భ్రాష్టం !...

అసలు శ్రుతి తెలీని ఈ సన్యాసికి సన్నాయిమేళం ఎందుకూ అడుక్కుతిన్నా !... అయినా నేర్చుకునే వెధవ వూరుబయటికెళ్ళి నేర్చుకోకూడదూ !... చుట్టుప్రక్కల కాపరాలుండేవాళ్ళ ప్రాణాలిట్లా తియ్యక పోతే !... లక్షణంగా మంగళవాద్యం వినవచ్చుగదా రోజూ అనుకుంటే ... బాగానేవుంది మేళం ...' అంటూ చిర్రుబుర్రులాట్టం మొదలెట్టారు.

బయటు వాకిట్లో గాడిద అరిచింది... ...'చాకలివాడు వచ్చినట్టున్నాడు' ... అన్నాను ... ...

మా అత్తగారు బయటువాకిట్లోకెళ్ళారు... చాకలివాడికి పనులన్నీ పురమాయిస్తూండగా ఏదోటాక్సీవచ్చి ఆగింది...

పద్దెనిమిదేండ్ల పిల్ల, ఆ పిల్లతల్లి, పదేళ్ళ కుర్రాడూ దిగారు ...

వాళ్ళను చూస్తూనే మా అత్తగారు ఎక్కడలేని సంతోషంతో 'నువ్వంటే అలమేలూ! ... నేనింకా ఎవరో అనుకున్నా-యిట్లా చిక్కిపోయావేమిటే! నీ కూతుర్నిగూడా తీసుకొచ్చావా! వీడు నీ చెల్లెలు కొడుగ్గదూ' అంటూ వచ్చిన వాళ్ళను కుశల ప్రశ్నలడిగారు ...

వాళ్ళను అంతకుముందు నేనెప్పుడూ చూడనందువల్ల నాకు పరిచయం చేశారు దూరపు బంధువులంటూ ...

శ్రీకాకుళం నుంచి వచ్చారు ... ఆ అమ్మాయికి సమ్బంధం, ఏదో కుదిరిందట. పెళ్ళిచూపులు మద్రాసులోనే ఏర్పాటు చేసుకున్నారు... పిల్లవాడు శ్రీకాకుళం వెళ్ళేందుకు 'లీవు' దొరకనందువల్ల పిల్లనే తీసుకొచ్చారు... మా యింట్లోనే పెళ్ళి చూపులు జరిగే ఏర్పాటు చేసేశారు మా అత్తగారు..

ఆ పిల్లను చూస్తుంటే నాకు చాలా విచిత్రంగా కనుపించింది... నోరు మూసుకున్నప్పుడుగూడా కోరల్లా బయటికొచ్చి వంకర్లుతిరిగి భయంకరంగా కనుపించే రెండు పళ్ళతో ఆ అమ్మాయి ఎలామాట్లాడుతుందో, ఎలా నవ్వుతుందో నాకేం బోధ పడలేదు.

ఉండబట్టలేక మా అత్తగారికి చెప్పాను పెళ్ళిచూపులకు ముందే ఆ పిల్లని ఏ పళ్ళ డాక్టరు దగ్గిరికో తీసుకెళ్ళి ఆ రెండు పళ్ళూ 'ఫైల్' చేయించేస్తే బాగుంటుందని...

'అయ్యొయ్యో ! అపచారమే అపచారం. అట్లా అనకూడదు' ... ఆ పిల్ల ఎవరనుకున్నావ్ !... సాక్షాత్తూ ఆ నరసింహస్వామి వరప్రసాదం... వాళ్ళబ్బపళ్ళూ, వాళ్ళ తాతపళ్ళూ యిట్లాగే వుంటాయి... వాళ్ళ కులదైవం నరసింహస్వామి వాళ్ళకు ప్రత్యక్షం ! ఆయనపోలికలు వాళ్లకు తరతరాలుగా వస్తున్నాయి. వాళ్ళ తాత సాక్షాత్తూ ఆ నరసింహావతారలావుండేవాడని అంతాఅంటూరు. యింకెప్పుడూ అట్లాఅనకు... అంటూ తను లెంప లేసుకుని నన్నుకూడా వేసుకోమన్నారు... వేసుకున్నాను ...

మర్నాడు సాయంకాలం పెళ్ళిచూపుల కొస్తారని యిల్లు శుభ్రం చేయించడానికి కాస్త త్వరగానే లేచారు మా అత్తగారు- లేస్తూనే మామూలు ప్రకారం పెళ్ళి కంస సంహారముందు నిలబడ్డారు... పెరటి



వైపు నుంచి ఆరంభం అయింది మంగళవాద్యం ... మళ్ళీ ఆ కొత్తగా నేర్చుకోనేవాడే సరిగమల దగ్గిర్నుంచి రాగ ప్రస్తారం వరకూ వాడిష్టం వచ్చినట్లు ఏ పనీ తోచ నివ్వకుండా చెడామడా అపశ్రుతులు వాయించి మా అత్తగారి నరాలు కొరకడం మొదలెట్టాడు. దానికి తగ్గట్టు ప్రొద్దుటే రావలసిన పని వాడూ, చాకలి వాడూ యిద్దరూ రాలేదు పనికి ...

'వెధవ మేళం పెరటి వెనక జేరింది. రోజా వీడిట్లాగే వాయిస్తూంటే పిచ్చెత్తి యిల్లు విడిచిపారి పోవలసిందే' అని మా అత్తగారంటూంటే గాడిద అరిచింది... దాని వెనకాలే వరస నాలుగు గాడిదలు అరిచాయి. మా అత్తగారిముఖం అదోలా అయిపోయింది...

వెధవ గాడిదలు... మంచిమాట అనుకున్నప్పుడు అరిచి చావ్వు... అందుకే వీటిని గాడిదలన్నారు... అయినా ఒకటికి నాలుగు గాడిదలయినాయి... చాకలి గుంపు గూడా ఎక్కువైనట్టుంది యింటి వెనకాల' అని చిరాకు పడుతూ చాకలివాణ్ణి వెంటనే రమ్మనమని కబురుపెట్టారు. వాడింట్లో లేడన్నారు...

'దొంగవెధవలు ... ఎప్పుడు అవసరమో అప్పుడే రారు. అని ఆమె తిడుతూవుండగానే పనివాడు పట్టాభి వచ్చి వాకిట్లో నిలబడ్డాడు కండ్లు తుడుచుకుంటూ.

'ఏంరా! నీకేం రోగం వచ్చింది. ఇంట్లో పనివున్నప్పుడూ, బంధువులొచ్చినప్పుడూనా మీరిట్లా చేయాల్సింది!—' అంటూ కేక లేశారు.

పట్టాభి వెక్కి వెక్కి ఏడవడం మొదలెట్టాడు...

'ఛీ ఛీ ప్రొద్దుటే వాకిట్లో శుభమా అంటూ ఏమిట్రానీఏడుపూ!'

'అమ్మా... మరే! మరే' అంటూ మళ్ళీ బావురుమన్నాడు పట్టాభి.

'ఛీ ఛీ! ఒరేయ్ సిగ్గదూ చెప్పేదీ! అవిడ్చే దేదో ఏడవకుండా ఏడువు.'

'అమ్మా మరే మా చిన్నాన్న పోయాడు. ... ...'

'ఓరి దొంగ భడవా! వుండూ' అంటూ గబగబ లోపలికెళ్ళి పద్దు పుస్తకం పట్టుకొచ్చారు... ...

'ఒరేయ్! నువ్వొట్టి దొంగ వెధవ్వని నాకు తెలుసురా! అందుకే యీ పుస్తకంలో రాశానుగుర్తుగా... పోయిన నెలగాక ముందునెల్లో నేగదరా మీ చిన్నాన్న పోయాడని గోడుగోడున ఏడుస్తూ మూడు రోజులు పత్తా లేకుండా పోయినావ్!'... అని మా అత్తగారడుగుతూంటే పట్టాభి వెలవెల బోయాడు... వెంటనే తెప్పరిల్లి 'అయన మా యింకో చిన్నాయన... యీన యింకో చిన్నాయన'. అన్నాడు నేలచూపులుచూస్తూ. వాడు చెప్పేవాలకం చూస్తే అసలు వాడికి చిన్నాన్నే లేడనీ, ఒకవేళ వుండినా ఎప్పుడో చచ్చిపోయి వుంటాడనీ, ఆ చచ్చినవాణ్ణే వీడి కవసరం వచ్చినప్పుడల్లా చంపుతున్నాడనీ నాకు తోచింది...

మా అత్తగారు పద్దు పుస్తకం మూసేసి ...

'ఒరేయ్ నువ్వేసే దొంగ వేషాలకి నేను 'ఛీ' విద్వను ... ఈ రోజు యింట్లో శుభకార్యంగూడా వుంది.' అన్నారు.

శుభకార్యం అనేసరికి మళ్ళీ వాడు ఏడుపు మొదలెట్టాడు...

'ఛీ ఛీ ఛీ ఏమిట్రా యిదీ అపశకునంలాగా!...'

వెంటనే గోలగోలగా అరిచాయి మాయింటి ముందే పూలచెట్లల్లో ఆనందంగా విహరిస్తున్న నాలుగు గాడిదలు ...

వాటిని చూసి మా అత్తగారిఒళ్ళు భగ్గుమంది ...

'ఆ వెధవ రాకుండా కాంపౌండు లోకి గాడిదల్ని తోలాడు... ఇందుకే యిరుగూ పొరుగూ అన్నారు... చాకలీ మంగలీ యింటి వెనకాల జేర్తే యిట్లాగే వుంటుంది లక్షణం!...' అని చాకలివాడిమీాద మండిపడుతూ గాడిదల్ని తరిమేశారు... ...

ఆ కోపంతోనే యింకా ఏడుస్తున్న పట్టాభిని పనిమానేసి పొమ్మని జీతం యిచ్చేసి పంపించేశారు

సాయంకాలం పిల్లను [illegible] పిల్లవాడూ, అతని [illegible] వచ్చారు. [illegible] అంగదన్ని సామెత ననుసరించి [illegible]


వాళ్ళకు మా అత్తగారు పచ్చిమంచి నీళ్ళుగూడా యివ్వలా... లక్ష్మీనరసింహమ్మను తీసుకొచ్చి పిల్లవాడి కెదురుగావున్న సోఫాలో కూర్చోబెట్టారు మా అత్తగారు స్వయంగా ... అంతే ... పిల్లవాడులేచి నిలబడ్డాడు ... హాల్లో తగిలించిన ఫోటోలూ, పెయింటింగ్సూ చూట్టం మొదలెట్టాడు... మా అత్తగారు అయోమయంగా నా వైపుచూశారు. పిల్లవాడి తల్లీ చెల్లెలూ గూడా లేచి నిలబడి "వెళ్ళొస్తాం"... అన్నారు...


"పిల్ల నచ్చినట్టేనా"? అని అడిగారు మా అత్తగారు...

పాపం ఆవిడకి ఏంజెప్పాలో తెలీక కాసేపు అవస్థ పడ్డది...

'ఆ నచ్చడాని కేముందిగానీ... ఏ సంగతీ పిల్లవాణ్ణి కనుక్కొని మీకు చెప్తాను' అంటూ ఒక్కక్షణం గూడా ఆలస్యం జేయకుండా పిల్లవాడితోసహా వెళ్ళి కార్లో కూర్చున్నారు... మా అత్తగారూ నరసింహమ్మ తల్లీ ఒకర్నొకరు చూస్తూ నిలబడి పోయారు...

కాసేపటికి నరసింహమ్మ కొక కోరిక కలిగింది. పక్కనే వున్న స్టుడియో కెళ్ళి షూటింగెట్లావుంటుందో చూడాలని... ఆ పిల్లకోసం మా అత్త





గారు నన్నుకూడా రావాలన్నారు షూటింగ్ చూట్టానికి... నలుగురం బయల్దేరాం... స్టుడియో కెళ్ళాం...

ఏదో పెద్ద భవనంలాంటి దాని ముందు జనం గుంపులుగా నిలబడి జమీందారుగారికీ జై' అంటూ చేతు లెత్తి అరుస్తున్నారు... చాలాసేపు వాళ్ళనే చూస్తూ కూర్చున్నాం...

"పెద్ద యాక్టర్లెవరూ లేనట్టుందే! ఏం ఫిలుంయిదీ! యీ గుంపుతో యింతసేపు తీస్తున్నారూ" అంటూ విసుక్కున్నారు మా అత్తగారు...

ఉన్నట్లుండి గుంపులో ఎవర్నో పసిగట్టారు మా అత్తగారు... పట్టున నా చేతిమీదకొట్టి చెవిదగ్గరకొచ్చి చెప్పారు...

'ఒసేవ్ అటుజూడు! ఆగుంపులో మన చాకలాడు వేషంగట్టాడే! అడుగో! వాడిపక్కనే మన పనివెధవ పట్టాభిగూడా వున్నాడు చూడు!... అని ఆమె చెపుతూంటే పరకాయించి చూశాను... నిజమే! చాకలివాడూ పట్టాభీ యిద్దరూ మొగానికింత పౌడరు పూసుకుని వాళ్ళ బట్టల్తోనే జాలీగా సిగరెట్లు తాగుతూ ఏవో కబుర్లు చెప్పకుంటూ నవ్వుకుంటు న్నారు యీ ప్రపంచాన్ని మర్చిపోయి...

"హారి దొంగ వెధవల్లారా!... చూశావటే! అందుకే యీ వెధవలు పని ఎగ్గొట్టారు... సినిమాల్లో వేషాల కోసంవచ్చి పొట్టు బకక్క ఏవో

వన్లో జేర్తుంటారు... యిట్లా అయితే మనకింక పనివాళ్ళేం దొరుకుతారు! మన యింటి పాచిపని మనం చేసుకో వాల్సిందే!' అని మా అత్తగారం టూంటే గుంపులోంచి గాడిద అరిచింది... మా అత్తగారు ఆశ్చర్యపడి పోతూ 'వాడేకాదేవ్! వాడిగాడిద కూడా వేషం గట్టింది... బాగానే వుంది షూటింగు... యీ గాడిదల్ని చూట్టానికా మనం వచ్చింది!... పదండి పోదాం' అంటూ బయల్దేరారు మా అత్తగారు...

నరసింహమ్మ మద్రాసు బీచీ చూడాలని ఉబలాట పడ్డది. కారు బీచీవైపుకు పోనిమ్మన్నారు డ్రైవర్ని మా అత్తగారు.

కారు బీచీరోడ్డులో పోతూంది...

సడన్‌గా మా అత్తగారు వెనక్కి తిరిగిచూసి కారు ఆపమన్నారు.

మేమంతా తిరిగి చూశాం... నరసింహమ్మను చూట్టానికి వచ్చిన పెళ్ళికొడుకు ఎవరో అందమైన అమ్మాయితో ఖులాసాగా కబుర్లాడుతూ నడుంచుట్టూ చెయ్యివేసి నడిపించుకుంటూ పోతున్నాడు ... చూడ ముచ్చటగా వున్నారు వాళ్ళిద్దరూ నడుస్తూంటే. నరసింహమ్మ తల్లి కోపంతో ముఖం యింకోవైపుకు తిప్పుకుంది... మా అత్తగారు తన ముఖం నావైపుకు తిప్పారు...తక్షణం నా ఎక్స్‌ప్రెషన్ మారింది.

□□□

- కాలేజి యూనియన్ అధ్యక్షుడు, కార్యదర్శి రాబోయే వార్షికోత్సవం గురించి మాట్లాడుకుంటున్నారు :

  'ఇంకెవర్ని పిలిచినా ఫస్టుక్లాసు చార్జీలు పెట్టుకోవాలిగనుక యీసారి మన సభలకి వినోబాభావేగార్ని పిలుద్దాం' అన్నాడు అధ్యక్షుడు.

  'ఐతే మన వార్షికోత్సవం వచ్చేయేటికి వాయిదా వేద్దాం.'

- ఇద్దరు స్నేహితులు ఒక డిటెక్టివ్ రచయితనిగురించి మాట్లాడుకుంటున్నారు :

  'అతను తను రాయబోయే కథ చెప్పనన్నాడు. చెబితే సస్పెన్స్ పోతుందట.'

  'ఔనే. కథ అతనికే తెలియదు. తెలిస్తే, రాస్తుంటేనే సస్పెన్స్ పోతుందిగా.'

—నరసింహబాబు, సి. ఏ. వి., అనంతపురం.

మరో ప్రపంచం

"మరో ప్రపంచం మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది"

అని 1934 లో శ్రీశ్రీ మహాప్రస్థాన గేయం రాసినప్పుడు ఈ స్వప్నం మరో అర్థంలో రుజువవుతుందని ఆయన ఊహించి వుండడు.

ఈ మధ్య ఇద్దరు సోవియట్ శాస్త్రజ్ఞులు కనిపెట్టిన విషయం మహాశ్చర్యకరమైంది. విశ్వాంతరాళంలో ఎక్కడో కొన్నివేల కోట్ల మైళ్ళ దూరంలో మరో ప్రపంచం వుందని, అందులో మానవ నాగరికతకంటె విశిష్టమైన మరో నాగరికత వర్ధిల్లుతోందని వారు కనిపెట్టారు. ఆ దూర ప్రపంచం నుంచి 'సిటిఎ — 102' అనే సాంకేతిక నామం కలిగిన రేడియో తరంగాలు భూమిమీదికి వస్తున్నాయట. వాటిలో హెచ్చుతగ్గులు ప్రతి వందరోజులకీ ఒకసారి ఒక నిర్ణీతపద్ధతిలో పునరావృత్తం కావడంచేత వాటి నెవరో కావాలనే పంపిస్తూ వుండివుండాలి. కొన్నికోట్ల కాంతిసంవత్సరాలదూరం నుంచి ఆ రేడియో తరంగాలను పంపించగలిగిన ఆ జాతి ఏదో మానవులకంటె మహత్తరమైనదే అయి వుండాలి. ఇదీ సోవియట్ శాస్త్రజ్ఞుల ఊహాగానం. కేవలం ఊహాగానమే కాదు. ఖచ్చితంగా అలాంటి ప్రపంచం వుండివుంటుందని వారు నమ్మకంగా చెబుతున్నారు.

ఐతే, సోవియట్ శాస్త్రజ్ఞులు కనిపెట్టిన రేడియో తరంగాలు, వాటి స్వభావం మొదలైన వేవీ సరిగ్గా పరిశోధించకుండా, వారు చెప్పేది నిజమో కాదో చెప్పలేమని పాశ్చాత్యశాస్త్రజ్ఞులు అంటున్నారు.

కొంతమంది 'ఆ, ఇవన్నీ కాకమ్మ కథలు' అని తోసేస్తున్నారు.

ఒకప్పటి కాకమ్మకథలే యీనాడు నిజాలవుతున్నాయి కనుక సోవియట్ శాస్త్రజ్ఞులు కనిపెట్టింది ఎప్పటికో రుజువు కాకూడదని ఏముంది? మన ప్రపంచానికి, మరో ప్రపంచానికి మధ్యఏనాటికో రాకపోకలు కాకపోయినా, కనీసం రేడియో సంబంధాలైనా ఏర్పడతాయేమో. అక్కడి వారిని మనం టెలివిజన్ తెరపైనైనా చూడగలుగుతామేమో.

రోదసీ నౌకలో కూర్చుని భూమి చుట్టూ ప్రదక్షిణం చేస్తున్న మనిషిని

నిరపాయకరంగా శూన్యంలోకి తిరిగి భూమికి రావడాన్ని ఈమధ్య రష్యా సాధించింది. భూమి నుంచి ఇతర గ్రహాలకు ప్రయాణాలు చేయడానికి చేస్తున్న ప్రయత్నాలలో ఇది అతిముఖ్యమైన ఘట్టం. దీనివల్ల భూమిచుట్టూ తిరుగుతూనే అంతరిక్షంలో వేదికలను నిర్మించడం సాధ్యమవుతుంది. ఆ వేదికలమీద రాకెట్లను చేర్చుకుని — అక్కడ భూమ్యాకర్షణ శక్తి అట్టే వుండదు కనుక- తేలిగ్గా చంద్రుడిలోకిగాని, ఇతర గ్రహాలలోకిగాని వాటిని పంపవచ్చు. ఈ మాదిరిగా భూమిచుట్టూ ఎన్ని వేదికలైనా నిర్మించవచ్చు. అవన్నీ అలా ప్రదక్షిణాలు చేస్తూనే వుంటాయి. మనకి రైల్వే ప్లాటుఫారాల్లాగా అవి ఉపయోగ పడతాయి.

అంతవరకు కథనడిచాక చంద్రుడిలోకి ప్రయాణాలు ప్రారంభమవుతాయి. చంద్రుడిలోకి వెళ్ళి రావడం మహా అయితే అయిదారు రోజులపని. అంతకంటె కష్టమైంది గ్రహాలలోకి వెళ్ళి రావడం. మెర్క్యురీ (బుధుడు) లోకి వెళ్ళి రావడానికి 210రోజులు పడుతుందట. వీనస్ (శుక్రుడు) లోకి పోయిరావడానికి 292 రోజులు,మార్స్(కుజుడు) మహాశయుణ్ణి చూసిరావడానికి 518 రోజులు పడుతుందట. ఇవన్నీకూడా ఫరవాలేదనే అనుకోవచ్చు. కానీ యింకా దూరంగావున్న గ్రహాలున్నాయి. ఉదాహరణకు జూపిటర్ (బృహస్పతి) లోకి వెళ్ళి అయన్ని పలకరించి రావడానికి 2,724 రోజులు (దాదాపు ఎనిమిదేళ్ళు), శాటర్న్ (శని) లోకి వెళ్ళి మళ్ళీ రావడానికి (ఈలోగా శని పట్టుకోకుండావుంటే) 4,416 రోజులు (పన్నెండేళ్ళ పైమాట) పడుతుంది. ఇలాగే యురేనస్—32 ఏళ్ళు; నెప్ట్యూన్ 61 ఏళ్ళు; ప్లూటో—92 ఏళ్ళు పడుతుంది. అంటే యీ దూరగ్రహాలలోకి మనం పంపించిన మనుషులు తిరిగివచ్చే లోపున మనమే 'ఎగిరి' పోవచ్చునన్నమాట. అయితే వాళ్ళుమాత్రం అన్నేళ్ళు బతుకుతారా అని సందేహం కలగవచ్చు. శుభ్రంగా బతుకుతారు. అలా బతికేట్టు చేయడానికి మార్గా లున్నాయి.

ప్లూటో గ్రహానికి వెళ్ళి రావడానికి 92 సంవత్సరాలు పడుతుందని పైన చెప్పాను. అంటే మనం 30 ఏళ్ళవాడిని అక్కడికి యివాళ పంపిస్తే వాడు తిరిగి వచ్చేసరికి వాడివయస్సు 122 ఏళ్ళు వుండాలి. ఇలా అయితే లాభంలేదుకనక, వాణ్ణి 30 ఏళ్ళ వయస్సులోనే వుంచడానికి శాస్త్రజ్ఞులు ఒక ఉపాయం ఆలోచిస్తున్నారు. ప్లూటో యాత్రికుడిని తిండిగాని,

ప్రాణవాయువుగాని అక్కరలేని స్థితిలో వుంచాలి. వాడి శరీర మనోధర్మాలన్నిటిని స్తంభింప జెయ్యాలి. అంటే చైతన్య రహిత స్థితిలో నిద్రబుచ్చాలి. ఆ స్థితిలో ఇక్కడనుంచి పంపించి తిరిగివచ్చాక వాణ్ణి మేల్కొలపాలి. అంటే ఎన్నేళ్ళయినా మృత ప్రాయుడుగా వుంచి తిరిగి బతికించాలన్నమాట. అలాచేస్తే వాడి శరీరంలో మనస్సులో ఏ మార్పులు రావు; వయస్సు పెరగదు. 30 ఏళ్ళ వాడుగానే వుంటాడు. ఇది సాధ్యమేనని సోవియట్ శాస్త్రజ్ఞులు కొన్ని పరిశోధనలు చేసి కనుక్కున్నారు. ఉదాహరణకు ౭౫ వేల ఏళ్ళకిందట మంచులో కూరుకుపోయి ఈమధ్య బయట పడిన ఒక నీటి ఈగని వారు తిరిగి బతికించారట. ఇలాగే కొన్ని పరిస్థితులలో ప్రాణులెంత కాలమైనా బతికే వుంటాయని కనుక్కున్నారు.

ఇలాంటి పద్ధతిలోనే మనుషుల్ని కూడా బ్రతికించి వుంచితే ప్లూటో ఏం ఖర్మ, ఇంకా దూర ప్రదేశాలకే ప్రయాణాలు చేసిరావచ్చు.

అయితే ఒకచిక్కుంది. దగ్గరిగ్రహాలకి ఫరవాలేదేమోగాని, మరీ దూరంగా వున్న నక్షత్ర మండలాలకి ప్రయాణంకట్టిన మనిషి తిరిగి వచ్చేసరికి కొన్నికోట్ల సంవత్సరాలు పడుతుంది.

వాడు తీరా వచ్చేసరికి భూగోళం మీద మనుషులేకాదు, అసలు భూగోళమే వుండకపోవచ్చు. ఎంత వేగంగా —దాదాపు కాంతి వేగంతో— ప్రయాణంచేసే రోదసీనౌకను తయారుచేసినా, మొదట్లో చెప్పుకున్న మరో ప్రపంచానికి వెళ్ళిరావడానికి కొన్ని వేలకోట్ల కాంతిసంవత్సరాలు పడుతుంది. ఈ లోగా భూమి నశించిపోవచ్చు. గ్రహాలతో సహా సూర్యుడే నశించి పోవచ్చు. అంతే కాదు; రోదసీయాత్రికుడు ఏ మరో ప్రపంచం చూడ్డానికి వెడుతున్నాడో ఆ మరో ప్రపంచం అతడు తీరా వెళ్ళేసరికి అక్కడ లేకపోవచ్చు. ఇప్పుడు సోవియట్ శాస్త్రజ్ఞులు కనిపెట్టిన రేడియో తరంగాలు కొన్నివేల కోట్ల కాంతి సంవత్సరాలు ప్రయాణంచేసి వచ్చాయి. ఈలోగా వాటిని పంపించిన జాతి, వారి ప్రపంచం కూడా నశించిపోలేదని హామీ ఏముంది? అందుచేత మరో ప్రపంచం పిలుపులు మాత్రమే మనం వినగలమేమోగాని, దాన్ని చూడ్డం అసంభవం కావచ్చు. (శ్రీశ్రీ కొంచెం తొందర మనిషిలెండి. ఆయనల్లాగే చెబుతాడు "పోదాం పోదాం పైపైకి" అని. నన్నడిగితే మరీ అంత దూరాభారం ప్రయాణాలు పెట్టుకోవద్దు: దగ్గిరిగా వున్నాయి గనక చంద్రుడిలోకి, కుజగ్రహంలోకి వెడితే చాలంటాను.)

— బాజ్జి —

□□□

సెక్రటరీ



యద్దనపూడి సులోచనారాణి

(గతసంచిక తరువాయి)

ఆరోజు లేచి నప్పటినుంచి ఒకటే వర్షం. పిల్లలకి కారులో భోజనం పంపేసిన జయంతి యేం చెయ్యడానికి తోచక కూర్చుని రమ పుస్తకాలుతీసి వాటికి అట్టలు వేయసాగింది. పిల్లలుంటే బోలెడంత కాలక్షేపం. వాళ్ళకెన్ని పనులు చేసినా, యేవో చెయ్యనివి, అర్జెంటుగా చెయ్యాల్సినవి బెదిరిస్తూ కన్పిస్తూనే వుంటాయి. పరాయి పిల్లల మీద యేర్పడిన మమకారంతోనే తనకింత వూపిరి ఆడడంలేదే! ఇక స్వంత పిల్లలయితే! అందుకే కాబోలు ఆడవాళ్ళు పిల్లలుపుట్టగానే భర్తల విషయాల్లో యెక్కువ పట్టించుకోవటం మానేస్తారు. ఇది అర్థం చేసుకోలేని మగవాళ్ళు తమ మీద ఆసక్తిపోయిందోనని గోల పెట్తారు.

ఇల్లంతా నిశ్శబ్దంగావుంది. ముసలాయనకూడా "నిద్రవస్తోంది. పుస్తకం రేపు చదువుదుగానిలే" అన్నాడు. బైటపడుతున్న వర్షం చప్పుడు తప్పయింకేం విన్పించటంలేదు. పరధ్యానంగా ఆలోచిస్తూ అట్టలు వేస్తున్న జయంతికి గేటు లోపలికి కారు హారన్ విన్పించటంతో "ఎవరై వుంటారు!" అనుకుంటూ వరండాలోకి వచ్చి చూసింది. ఒకే ఒక గ్లాస్ డోర్ తెరచివుంది. అందులోంచి వంగి తొంగిచూస్తే క్రింద టాక్సీలోంచి రెయిన్‌కోటులో దిగిన ఒక పొడుగాటి అతను కన్పించాడు. అతని మొహం సరిగ్గా కన్పించటం లేదు. చెట్లతీగెలు అడ్డొచ్చాయి. టాక్సీ అతనికి యేదోచెప్పి తలవంచుకుని గబగబా వరండాలోకివచ్చాడు.

"ఎవరో ఆవిడని కలవడానికి వచ్చి వుంటారు" అనుకుంటూ జయంతి మళ్ళీ వచ్చి పుస్తకాలదగ్గరకూర్చుంది. అట్టలు వేయడంకూడ ఐపోవచ్చింది. ఇంకో రెండు పుస్తకాలున్నాయి. ఏపనైనాసరే మనం కావాలని కాలక్షేపానికి కూర్చుంటే అది యిట్టే అయిపోతుంది. ఇది పూర్తిచేసిం తర్వాత పిల్లలు వచ్చేదాకా టైం

చేయాలి? జయంతి ఆలోచిస్తూ వుండగా యింతలో నౌకరు వచ్చి 'ఎవరో వచ్చారు' అన్నాడు.


'డాక్టరుగారు లేరు. ఇప్పుడు రారని చెప్పు—'

'ఆయన మిమ్మల్నే కావాలంటున్నారు—'

'నన్నా—' తెల్లబోతూ అడిగింది.

'అవును. లక్ష్మి వుందా? — అని అడిగారు!'

'నీకు బుద్ధిలేదు! సరిగ్గా విని వుండవు. నాకోసం ఎవరొస్తారు?' జయంతి పుస్తకాలు చేత్తో అలాగే పట్టుకుని క్రిందకి వచ్చింది. అక్కడ మెట్లు దిగుతుంటే సగంలోనుంచే క్రింద హాలు కన్పిస్తుంది. వచ్చినవ్యక్తి రెయిన్‌కోటువిప్పేసి పాంట్ జేబులో చేతులు పెట్టుకుని నిలబడి బైట వాన వైపుపరిశీలనగా చూస్తున్నాడు. అతను కొద్దిగా అటు తిరిగి వుండటంవల్ల



వెనకనుంచి వస్తున్న జయంతిని చూడలేదు.

జయంతికి క్షణంసేపు తన కళ్ళు తనని మోసం చేస్తున్నాయేమోనన్న భ్రమ కలిగింది. అదే జుట్టు. అలా చేతులు పాంటుజేబులో పెట్టుకుని అదే పోజులో నిలబడటం—ఎవరు—ఎవరు! మతిపోయినట్టు అన్పించి జయంతికి గది—అందులో సామాను అంతా గిర గిరా తిరుగుతున్నట్టు అన్పించింది. అనుకోకుండా చేతులో పుస్తకం జారి క్రిందపడి మెట్లమీద నుంచి దొర్లిపోయింది. అతను హఠాత్తుగా శబ్దం విన్పించటంతో గిరుక్కున వెనక్కు తిరిగాడు. అప్పటికే జయంతి వెనక్కుతిరిగి పైకి పారిపోయింది. పారిపోతున్న జయంతి చీరకొంగు, పాదాలచివర్లు తప్ప అతనికి ఆ మనిషి ఎవరో కన్పించలేదు.

గదిలోకి వచ్చి తలుపులు మూసుకున్న జయంతికి అంత వానలోనూ మొహంనిండా చెమటలు పట్టాయి. శేఖరం ఇక్కడికెలా వచ్చాడు? తన పేరు లక్ష్మి అని ఎలా తెలిసింది? భగవాన్! ఇప్పుడేమి చేయాలి—ఏం చేయాలి తను—అప్పుడు ఉత్తరం వ్రాస్తే కనీసం సమాధానం అయినా ఇవ్వని మనిషి ఇప్పుడెందుకిలా హఠాత్తుగా కన్పించటం! తనకి కలిగిన యీ మనశ్శాంతిని నాశనం చెయ్యాలనికాబోతే—

చాలాసేపైంతర్వాత వంటమనిషి వచ్చి తలుపు తట్టాడు.

"ఏమిటి?—" భయం భయంగా తలుపు తెరవకుండానే అడిగింది.

"డాక్టరమ్మగారికోసం యెవరో వచ్చారట! పెద్దయ్యగారు వెంటనే కాఫీ, టిఫిన్ చెయ్యమంటున్నారు. యేం టిఫిన్ చెయ్యాలి?—"

జయంతి మెల్లగాలేచి తలుపుతీసి "యేదో ఒకటిచెయ్యి—నాకు ఒంట్లో బాగాలేదు." అని మళ్ళీ టపీమని తలుపులు మూసింది. మళ్ళీ క్షణం ఆలోచించుకుని వెంటనే తలుపులు తెరిచి "ఇదుగో—నిన్నే" అని పిలిచింది. వంటవాడు వెనక్కు తిరిగాడు.

"ఆ వచ్చిన పెద్దమనిషి వెళ్ళగానే నాకు వచ్చి చెప్పు" అంది. వాడు సరేనన్నట్టు తలూపాడు.

ఆయన దగ్గర కూర్చుని జరిగిందంతా చెప్తున్నాడు కాబోలు. చెప్పనీ! తనెందుకు భయపడాలి! తనకిష్టంలేకుండా వేయిమంది శేఖరాలొచ్చినా యిక్కడినుంచి తీసుకెళ్ళలేరు. తొందరపాటులో చేసిన ఒక చిన్న తప్పు క్షమించలేక పోయాడే! అయినా యిదేమిటి? యిన్నాళ్ళూ అతనికోసం విలవిలలాడిన మనసు అతను కన్పించగానేయిలారోషంతో యెదురు తిరుగుతుంది యెందువల్ల? ఎందుకు తిరగదు! తనకేం అభిమానం లేదా! అప్పుడే ప్రకాశం చచ్చిపోగానే వుత్తరం వ్రాసినప్పుడు వెంటనే వస్తాడని యెంత యెదురు చూసింది! అప్పుడు అసహ్యం అనుకున్నాడు కాబట్టి రాలేదు. పాపం! యిప్పుడు తేరుకున్నాడు కాబోలు.

చాలా సేపయిం తర్వాత వంటవాడు వచ్చి తలుపు తట్టాడు. జయంతి తలుపును తెరిచి ఆత్రంగా "వెళ్ళిపోయాడా?" అని అడిగింది.

"లేదు. అమ్మగారు వచ్చేవరకూ వుంటారుట! బహుశా రాత్రికి యిక్కడే భోజనానికి వుండొచ్చు. ఇదుగో పెద్దయ్యగారు మిమ్మల్ని ఈగోలీ వేసుకుని కాఫీత్రాగి పడుకోమన్నారు." సారిడాన్‌బిళ్ళ చూపిస్తూ అన్నాడు.

జయంతి వెంటనే సారిడాన్ మింగేసి కాఫీ త్రాగింది.

"భోజనానికి వుంటే మరి రాత్రికి యేం చెయ్యాలో—"

"నే వస్తున్నా పద—" జయంతి వంటయింట్లోకి వెళ్ళి యేవేమి చెయ్యాలో చెప్పివచ్చి మళ్ళీ గదిలో

"సెక్రటరీ" సీరియల్ - జరిగిన కథ

అనగనగా ఒక జయంతి. ఆమెకొక బొమ్మ. జయంతికి వనితా విహార్‌లో సెక్రటరీ ఉద్యోగం దొరికింది. కాని అక్కడి సభ్యురాండ్ర ప్రవర్తన గిట్టక రాజీనామా యిస్తుంది. ఆమెకు రాజశేఖరం అనే ధనిక యువకుడు తన వద్ద ఉద్యోగమిస్తాడు. అతడు అవివాహితుడు, మంచివాడు. అతని వద్ద ఉద్యోగం మొదట బాగానే వుంటుందిగాని, కొన్ని విచిత్రసంఘటనలుజరిగి ఆమె అతన్ని ఏవగించుకోనడం ప్రారంభిస్తుంది. రాజీనామా ఇస్తుందిగాని ఆనాడే ఆమెకు పెద్దజబ్బుచేస్తుంది. ఆ జబ్బులో రాజశేఖరమే జయంతిని, ఆమె బొమ్మను తన ఇంటికి తీసుకువెళ్ళి ఆదరిస్తాడు. జబ్బు తగ్గాక అతని ఇంటినుంచి వెళ్ళిపోవా లనుకుంటుంది. ఇంతలో ఆమె బొమ్మ హఠాత్తుగా గుండెజబ్బు వచ్చి చనిపోతుంది. ఇక చేసేదిలేక ఆమె రాజశేఖరం ఇంట్లోనే వుండిపోతుంది.

కాని ఎన్నాళ్ళని అతని దగ్గర వుంటుంది. లోకు లేమనుకుంటారు. ఏమైనా మానసిక సంఘర్షణ భరించలేక అతనినుంచి దూరంగా పోవాలనుకుంది. ఆమెను తీసుకుపోవడానికి ప్రకాశం అనే పరిచితుడొకడు తటస్థపడ్డాడు.

అతనితో కలిసి ఆమె బెంగుళూరు వెడుతుంది. అతనికి హఠాత్తుగా కలరా సోకి చనిపోతాడు. ఆమెను ప్రసాద్ అనే డాక్టరు ఆదుకుంటాడు. అతడు జయంతి నిస్సహాయతకు జాలిపడి మద్రాసులో వున్న తన అక్కగారింటికి ఆమెను పంపించి వేస్తాడు. ఆమె అక్కడ తాత్కాలికంగా స్థిరపడుతుంది.

కూలబడింది. తనకెందుకీ భయం! ధైర్యంగా యెదురుగ్గా యెందుకు వెళ్ళలేదు! అర్థంగాని యీ పిరికితనం యేమిటి అసహ్యంగా! భోజనాల దగ్గర యెదురు పడ్తుంది. అన్నీ మనసులో అనుకోవడమే తప్పు. పైకి చెయ్యలేక పోతుంది యెందుకని!

●

వంట పూర్తవుతుండగా విజయలక్ష్మి వచ్చింది. క్రింద కొద్దిసేపు మాట్లాడిం తర్వాత పైకివచ్చి గబగబా జయంతి వళ్ళు పట్టి చూస్తూ "యేమిటీ నీకు ఒంట్లో బాగాలేదుట కదా! నాన్న చెప్పారు. ఉత్త తలనొప్పేనా? ఒళ్ళు నొప్పులుకూడా వుందా?" అని అడిగింది ఆదుర్దాగా.

"తలంతా యెలాగోవుంది—"

"ఉంటుంది వుండదుమరీ– క్షణంసేపు కూర్చోమంటే కూర్చోవు. గిలకలా తిరుగుతూనే వుంటావు—అసలే వూళ్ళో బాగాలేదు. కదలకుండా పడుకో." అని చెప్పి దుప్పటి తీసి కప్పి వెళ్ళిపోయింది.

జయంతి లేవలేదు. పోనీ అలాగే కానీ! అతన్నే చెప్పనీ! ఆశ్చర్యంగా నిజమా అంటూ ఆవిడనే తిరగిరానీ! ఆక్షణంకోసం యెదురుచూస్తూ పడుకుంది. తను చెప్పవలసిన సమాధానం క్షుణ్ణంగా గుర్తుచుకుంది.

కాని జయంతి వూహించినట్టు అలాటిదేం జరగలేదు. పిల్లలు స్కూలు నుంచి వచ్చిం తర్వాత 'శేఖరం మామయ్య వచ్చాడు! మామయ్య వచ్చాడు' అని గోలతప్ప యింకేం విన్పించలేదు.

భోజనాలు అయింతర్వాత విజయలక్ష్మి పైకివచ్చి జయంతిని పరీక్ష చేసి 'జ్వరంలేదు ఫర్వాలేదులే; అయినా సరే యీపూట భోజనం వద్దు' అంటూ రొట్టె పాలు తినిపించింది, అది పూర్తయిం తర్వాత 'లక్ష్మీ! ఈ పూటకి నువ్వు రమా వాళ్ళతో పడుకుంటావా! నాకు తెలిసిన ఒకతను వచ్చాడు, ఈ పూట యిక్కడే వుంటాడు" అంది.

ఐతే శేఖరం తన కోసం రాలేదన్నమాట. విజయలక్ష్మికి శేఖరం తెలుసా? ఎప్పుడూ యీ విషయమే రాలేదే! జయంతి ఆశ్చర్యపోతూ లేచి వెళ్ళి పిల్లలగదిలో పడుకుంది.

జయంతి పడుకున్న కొద్దిసేపటికి అతను పైకి వచ్చాడు. పిల్లలిద్దరూ అతన్ని ఒక్క క్షణంగూడా వదలటం లేదు.

"లక్ష్మీ! విన్నావా? నీ కూతురేమంటోందో!" శేఖరం పకపక నవ్వుతూ అన్నాడు.

"ఏమంటోందేం?—"

"నన్ను పెళ్ళి చేసుకుంటుందిట."

"మంచిదేగా! నా కత్తగారయ్యే భాగ్యం దొరకాలంటే ఎంతదృష్టం వుండాలి—" లక్ష్మిగూడా నవ్వుతూ అంది.

శేఖరం లక్ష్మీ అని పిలుస్తున్నాడేమిటి! అందరూ విజ్జీ అని పిలిస్తే ఇతను లక్ష్మీ అని పిలవడంలోగల ప్రత్యేకత ఏమిటి? ఐతే ఇంతక్రితం లక్ష్మి కావాలని శేఖరం అడిగింది తనని కాదన్నమాట. తనసలు ఇక్కడుందనికూడా అతనికితెలియదేమో! ఆ మాటలధోరణి చూస్తే తెలిసినట్టు లేదు. జయంతి మనసు అవ్యక్తమైన బాధతో కృంగిపోసాగింది.

● ప్రక్కగదిలో పడుకున్నాడు శేఖరం.

చాలాసేపు అతనితో కబుర్లు చెప్పింతర్వాత పిల్లలువచ్చి జయంతి గదిలో పడుకున్నారు. లక్ష్మిగూడా వెళ్ళటానికి లేచింది.

"ఏదీ! మీరంతా అంత బాగా పొగుడుతున్న ఆకొత్త సెక్రటరీ దర్శనం కాలేదే నాకు—" మెల్లగా అన్నాడు శేఖరం.

"ఒంట్లో బాగాలేదు. రేపు వుదయం చూద్దువుగాని—నిజంగా లక్ష్మి నా సెక్రటరీ అని చెప్పటానికి గర్విస్తాను. అందం—మంచితనం పోటీ పడ్తూ వుంటాయి లక్ష్మిలో—"

"అలాగా! అయితే తప్పకుండా చూడాల్సిందే—" పరధ్యాసగా విన్పించింది శేఖరం కంఠం.

"రేపు వుదయం చూద్దువుగాని—"

"బైదిబై—లక్ష్మీ! రేపువుదయమే నే వెళ్ళిపోతాను. నువ్వు మళ్ళీ కన్పించవనుకుంటాను."

"హాస్పిటల్లో ఓ కేస్ వుంది. దానికేమీ కాంప్లికేషన్ రాకుండావుండి అర్ధరాత్రివేళ నన్ను వాళ్ళు లేపకపోతే—"

"ఆల్ రైట్. అయితే యిప్పుడే గుడ్ బై చెప్తాను." అన్నాడు శేఖరం.

"ఓ.కె. మళ్ళీ యెప్పుడొస్తావు?—"

"చెప్పలేను. యిలాగే–ఏదయినా పని తగిలితే–సరి– నిద్రవస్తోందినాకు" శేఖరం తలుపులు వేసుకున్న చప్పుడు విన్పించింది.

లక్ష్మి కిందకి వెళ్ళబోయేముందు జయంతి గదిలోకి ఒకసారి వచ్చింది. గోడవైపు తిరిగివున్న జయంతి నిద్రపోతోందనుకుని నిశ్శబ్దంగా తలుపులు దగ్గరేసి వెళ్ళిపోయింది.

అంతసేపు జరిగిన వాళ్ళ సంభాషణలో తన ప్రసంగం చూచాయగా కూడా రాకపోవడంచూసి జయంతికి నిరాశతో, కోపంతో మనసు విలవిలలాడసాగింది. అతనెంతమామూలుగా వున్నాడు. ఇలాటి వ్యక్తికోసమేనా తనెంత గొప్పగా వూహించుకుని ఆలోచించేది. ఇన్నిరాత్రుళ్ళూ తను పడుకునే ప్రక్కమీద పడుకున్నాడు. ఇప్పుడు అతను తలఆన్చుకున్న దిండులోకే మొహందించుకుని అతనికోసం యెన్నిసార్లు ఆలోచించిందో–కళ్ళంబడి నీళ్ళు పెట్టుకుందో అతనికెలా తెలుస్తుంది!

జయంతి కెప్పటికో తెల్లవారుఝాముకి నిద్రపట్టింది. మళ్ళీ మెలకువ వచ్చేసరికి 8-30 దాటిపోయింది. పిల్లలు స్కూలుకు తయారవుతున్నారు. విజయలక్ష్మి రాత్రి హాస్పటల్ కి వెళ్ళిపోయింది.

జయంతి లేచి ఇవతలకి వచ్చేసరికి రాత్రి శేఖరం పడుకున్న గది

తలుపులు ఎప్పటిలా తెరిచేవున్నాయి. అతను వెళ్ళి అప్పటికే గంటఅయింది. జయంతి నీరసంతో మంచంమీద కూలబడింది.

● ● ●

పై సంఘటన జరిగిపోయిన తర్వాత—దాదాపు నెలరోజులకి—ఓ రోజు రాత్రి—చాలా ఆలస్యంగా ఇంటికివచ్చిన విజయలక్ష్మి జయంతి యిచ్చిన పాలగ్లాసు అందుకుంటూ

"లక్ష్మీ! మా క్లబ్‌కి సెక్రటరీ దొరక్క తన్నుకు ఛస్తున్నారు. నే నీ రోజు నీ పేరు యిచ్చివచ్చాను" అంది.

"నన్నా ?—" జయంతి వింతగా చూసింది.

"అవును. అసలు నేను చాలా రోజులనుంచి అనుకుంటున్నాను. నువ్వుండటంవల్ల మా కింట్లో అంత సౌకర్యంగా హాయిగా గడిచిపోతున్న మాట నిజమే! కాని—అలాగని చెప్పి నీ జీవితం వ్యర్థంచేసే స్వార్థపరురాలినికాదు లక్ష్మీ. నువ్వు దీనికి సెక్రటరీ అయితే—అనేకరకాల వ్యక్తులు పరిచయం అవుతారు. వాళ్ళలో ఎవరైనా నీ మనసుకునచ్చిన వాళ్ళు—" ఆవిడ వాక్యం పూర్తి చేయనేలేదు.

"ఒక్కమాట చెప్పండి. నే నేమైనా మీకు బరువుగా అన్పిస్తున్నానా ?—"

"లక్ష్మీ!—" విజయలక్ష్మి తెల్లబోయినట్టు చూసింది.

"నా కిక్కడ పిల్లల్తో చాలా హాయిగా ఉంది. మీ రంతా నన్ను ఆప్యాయంగా చూస్తున్నారు. నాకింత కంటే ఇంకేంకావాలి!"

"కాని—ఇప్పుడు బాగానేవుంటే వుండొచ్చు. ఎల్లకాలం నీ కిలా గడిచిపోతే తృప్తిగా అన్పిస్తుందా ?—"

"ఎందు కనిపించదు. నా కింకేం వద్దు. మీరు నన్ను స్వంత చెల్లెలికి మించిన మమకారంతో చూస్తున్నారు—" జయంతి కళ్ళలో హఠాత్తుగా నీళ్ళు తిరిగాయి.

"అరె! అదేమిటి. యెక్కడో పిచ్చిపిల్లలా వున్నావే!" చప్పున చెయిపట్టి దగ్గరకు లాక్కుంటూ ఖంగారుగా అంది.


"మీ కిష్టంలేకపోతే వెళ్ళిపోమని చెప్పండి. అంతేకాని—"

"నీ మొహం. నిన్ను వెళ్ళమంటున్నా నేను! జన్మలో నిన్ను వదలకూడదని నాకుంది."

"మరింకెందుకు యివన్ని—"

"నీ జీవితం అంతా యిలా వృథా చేసుకుంటావా ? ఒకవేళ నువ్వుండిపోతానన్నా—లోకం యేమను కుంటుంది చెప్పు. లోకం సంగతి కూడా వదిలేయి. నాకూ బాధగా వుంది."

"వద్దు వద్దు. మీరలా ఆలోచించ వద్దు. ఇక్కడ ఈ యింట్లో నా స్వంతంగా వుండిపోతా ననడంలో నాకేస్వార్థంవుంది. దయవుంచి నన్ను పంపించాలని చూడకండి—"



చప్పున ఆవిడ గుండెల్లో తలదాచుకుంటూ బొంగురుపోయిన కంఠంతో అంది.

"సరె సరె! ఇంకెప్పుడూ అనను. మర్చిపోయా! ప్రసాద్ వస్తానని ఉత్తరం వ్రాశాడు చూశావా?" అంది. జయంతి చూశానన్నట్టు తలూపింది. విజయలక్ష్మికి హఠాత్తుగా తను చేసిన పొరపాటు తెలిసి వచ్చింది. ప్రసాద్ ఈ అమ్మాయిని పంపించాడన్న సంగతి తనెలా మర్చిపోయింది. వాళ్ళిద్దరి మధ్యా యే ఆకర్షణా లేకుండా వుంటుందా! జయంతి తన మరదలుగా యీ యింట్లో శాశ్వతంగా వుండిపోతుంది అన్న ఆలోచన రావడంతో విజయలక్ష్మి మొహం సంతోషంతో విప్పారింది.

● ● ●

ప్రసాద్ శెలవుపెట్టి వచ్చాడు. పిల్లలు మామయ్య మామయ్యఅంటూ ఒకటే గోల.

"ఇదుగో! మీరంతా కలిసి మీ యిష్టంవచ్చిన చోట్లకి తిరగండి. నాకు టైమ్ లేదు. ముందే చె[illegible] న్నాను," అంది విజయలక్ష్మి. [illegible] మనసులో అసలు ఉద్దే[illegible] [illegible] ద్దర్నీ హాయిగా ఒంటరిగా వది[illegible] లని. తల్లి మనసు[illegible]

కనిపెట్టలేని పిల్లలిద్దరూ మేమూ వెడ్తాం అని మారాం చేశారు.

"వద్దు. చదువుపోతుంది. ఇంట్లో కూర్చొని చదువుకోండి" అని కసిరింది. రమా, రవి బిక్కమొహంతో జయంతివైపు చూశారు.

"వాళ్ళ చదువు పాడవకుండా చూసే బాధ్యతనాది." అంది జయంతి రమ జుట్టు సరిచేస్తూ.

పిల్లలతోకలిసి ప్రసాద్, జయంతి బీచ్‌కి-పార్కులకి, మ్యూజియంకి తిరుగుతున్నారు.

ఓరోజు సాయంత్రం బీచ్‌లో—

రమా-రవీ దూరంగా యిసకలో పిచ్చికగూళ్ళు కడ్తున్నారు. జయంతి, ప్రసాద్ వెన్నెల్లో తళతళ మెరుస్తున్న నీళ్ళవంక చూస్తూ కూర్చున్నారు. తెల్లటి నురగలతో కెరటాలు పరుగెత్తుకుంటూ ఒడ్డుకివచ్చి వెంటనే చెల్లాచెదరై కిలకిల నవ్వుతున్నాయి.

నీళ్ళకేసి తదేకంగా చూస్తుండిపోయిన జయంతిని చూస్తూ "మీరు చాలా చిక్కిపోయారు" అన్నాడు ప్రసాద్. జయంతి నవ్వి వూరుకుంది.

"మనుష్యులు చిక్కిపోతే మనసులో యేదో దిగులుందంటారు."

"నాకేం దిగులుంది! హాయిగా ఉన్నాను."

"మరి మీ కళ్ళక్రింద అలా నలుపు తిరిగిందెందుకు!"

జయంతి మొహం క్రిందకి వాలిపోయింది. ఆరోజు హఠాత్తుగా శేఖరం వచ్చి వెళ్ళినప్పటినుంచి మనసుమనసులోలేదు. తనలో శక్తి, వుత్సాహం అంతా అతనితోపాటు అదృశ్యమైపోయినట్టుంది.

"చెప్పండి. ఈ ఉంటికి పంపించినవాడినినేను. అంతా సవ్యంగా జరుగుతోందా!—"

"స్వర్గంలావుంది."

"అది కేవలం నాముఖప్రీతికోసం అంటున్న మాటకాదుగా!"

"లేదు. నిజంగా! మనఃపూర్వకంగా చెబుతున్నాను."

ప్రసాద్ చాలాసేపు అలలవైపు చూస్తుండిపోయాడు. జయంతి గుప్పిళ్ళతో ఇసకతీసి మెల్లగా వెదజల్లుతోంది.

జయంతికి అంతా బాగానేవుంది. కాని మనసులో ఎక్కడో చీకటి వుంది. ఆ చీకటి ప్రకాశం మరణం తాలూకుదా! ఏమో! తనిచ్చిన వెలుగు అంతదూరం వెళ్ళటంలేదు. చీకట్లో దాక్కున్న జయంతి బైట పడటంలేదు. ఇది ప్రసాద్‌ని వేధిస్తున్న సమస్య. జయంతిని పంపింతర్వాత రాసే ప్రతి ఉత్తరంలో జయంతిని గురించి తప్పకుండా ఓ పేరా వ్రాసేవాడు. మొదటమొదట కాకపోయినా మెల్లగా జయంతిని ఉత్తరాలు వ్రాయమన్న కోర్కె సూటిగానే బైటపెట్టాడు. కాని జయంతి నాటిని పట్టించుకున్నట్టులేదు. అది సిగ్గో—ఇష్టంలేకపోవటమో యేదీ తేలటంలేదు.

"జయంతీ!..." చాలాసేపయింతర్వాత పిల్చాడు.

"ఊఁ!"

"నన్ను చూస్తే నీకేమనిపిస్తుంది?—"

"చాలా మంచివారని—"

"అంతేనా?—"

"మీ పరిచయం అవడం కేవలం నా అదృష్టం అని—"

"ఇంకేం అన్పించదా?—"

జయంతి మాట్లాడలేదు.

"నాకేమనిపిస్తోందో చెప్పనా?—"

"చెప్పండి—"

"నత్తగుల్ల ఏరుకోటానికి వెళ్ళిన మనిషికి ముత్యపుచిప్ప దొరికిందని—"

"... ... ..."

"జయంతీ! భగవంతుడు అనుకోకుండా ప్రసాదించిన యీ ముత్యాన్ని నా హృదయంలో భద్రంగా దాచుకోవాలని ఉంది—" ఇంతలో పిల్లలు పరుగెత్తుకు రావటంతో సంభాషణ ఆగిపోయింది.

"ఇక వెళ్ళిపోదాం. ఆకలేస్తోంది" అన్నాడు బాబు.

"నేను చదువుకోవాలి—" అంది రమ.

"సంభాషణ సశేషం—" జయంతితో అంటూ ప్రసాద్ నవ్వుతూ లేచాడు.

● ● ●

ప్రసాద్ మాటల ధోరణి చూచాయగా అర్థంచేసుకున్న జయంతి మనసు దిగులుతో కృంగిపోసాగింది. లక్ష్మి, బాబు, రమ వీళ్ళందరిలా అతను కూడా నిష్కల్మషంగా అభిమానించ లేడా! స్వంతం చేసుకోవాలన్న తాపత్రయం దేనికి! అతని అభిప్రాయాన్ని కాదని చెప్తే దెబ్బతిన్నట్టు చూస్తాడేమో! ఇంత సహాయం చేసిన మనిషిని బాధపెట్టటమటుకు యేం మంచిది! ప్రసాద్ అంటే కృతజ్ఞత వున్నమాట నిజమే! కాని ఆ కృతజ్ఞత అతన్ని భర్తగా పొందటానికి అంగీకరించటం లేదు. ఈ జన్మలో [illegible] కన్పించడు. ఆ మాట వా[illegible]వమే.

కాని—అతనంటే యెంత కోపం వుండనీ — యెంత అసహ్యం వుండనీ—తనలో స్త్రీ సహజమైన అనుభూతులు రేకెత్తించింది అతను. అతని కొక్కడికే ఆ అధికారంవుంది. ఒక్క ప్రసాదేకాదు. ఇంకేమగ వాడీ ఆత్మీయతని ఆ రూపంలో తను భరించ లేదు. శరీరం-మనసు రెండూ యెదురు తిరుగుతాయి. ఇది ప్రసాద్‌కి చెప్పటం యెలా? ఈరూపంగా యింట్లో అనవసరమైన అశాంతి రేకెత్తదుకదా!

కారు యింటిముందుకువచ్చి ఆగటంతో జయంతి ఆలోచనలుకూడా ఆగిపోయినాయి. పిల్లలిద్దరూ దిగి ముందుగా లోపలికి పరుగెత్తారు.

లోపల విజయలక్ష్మి యెవరితోనో మాట్లాడింది. పిల్లలని చూడగానే "అరుగో వీళ్ళు వచ్చేశారు. రమా! మామయ్యేడి?—"అంది.

"అడుగో వస్తున్నాడు" అంది రమ.

"ప్రసాద్! చూడు నీ కోసం యెవరువచ్చారో—" "ఎవరూ?" అంటూ గబగబా లోపల అడుగు పెట్టిన ప్రసాద్. "హల్లో శేఖరం! వాట్ ఎ సర్ప్రైజ్!" అన్నాడు హుషారుగా.

అప్పటికే గుమ్మంవరకూ వచ్చేసిన జయంతి చటుక్కున ఆగిపోయింది.

"ఎప్పుడు రావటం?—" ప్రసాద్ కంఠం విన్పించింది.

"ఇంతక్రితమే వచ్చాను." సందేహంలేదు. శేఖరమే. జయంతి లోపలికి వెళ్ళడమా మానటమా ఏదీ నిర్ణయించుకోలేకపోతోంది. ఇంతలో విజయలక్ష్మి "లక్ష్మి ఏదిరా?" అని అడిగింది తమ్ముణ్ణి.

"వస్తోంది. అదుగో గుమ్మందగ్గిర" అన్నాడు ప్రసాద్.

"శేఖరం! నా సెక్రటరీని నువ్వు క్రిందటి సారికూడా చూడ లేదుకదూ"

"ఉహు" కుతూహలంగా లేచి యిటువైపు తిరిగి నవ్వబోయిన శేఖరం పెదవులు ఆగి పోయినాయి. కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవైనాయి. కనుబొమలు ప్రశ్నార్థకంగా వంగాయి.


అప్పటికే గుమ్మాన్ని ఆధారం చేసుకుని నిలబడిన జయంతి నవ్వబోయింది. కాని నవ్వు రాలేదు.

"జయంతి!" శేఖరం పెదవులు అస్పష్టంగా కదలడం వెనక నుండటం వల్ల అక్కా తమ్ముళ్ళిద్దరూ గమనించలేక పోయారు.

జయంతి యేదో చెప్పాలని ప్రయత్నం చేసింది. కానీ అదికూడా పూర్తిగా విఫలమైంది. శేఖరం ఒకడుగు ముందుకు వేశాడు.

"అరె! అదేమిటి. అలావున్నావు. ఒంట్లో బాగాలేదా? కళ్లు తిరుగుతున్నాయా?" ప్రసాద్ పరుగెత్తుకుంటూ వచ్చి రెండు చేతుల్తో పట్టుకుంటూ ఆదుర్దాగా అన్నాడు.

"ఏమిటి? యేమైంది" విజయలక్ష్మికూడా పరుగెత్తు కొచ్చింది



అప్పటికే జయంతి ప్రసాద్ చేతుల్లో మూర్ఛ పోయింది.

"నీకు బుద్ధిలేదురా! అసలే ఆ అమ్మాయికి ఒంట్లో బాగా లేదని తెలిసికూడా వచ్చినప్పటినుంచి ఒకటే విధంగా తిప్పటం! బాగా అలసట కలిగి వుంటుంది. పైకి తీసుకెళ్దాం పద."

"నువ్వులే!" అక్కగారిని తప్పించుకుని ప్రసాద్ శేఖరం చూస్తుండగానే జయంతిని రెండు చేతులమధ్యా లేవనెత్తి పైకి తీసుకెళ్ళి పోయాడు.

"శేఖరం! ఒక్క నిమిషం. యిప్పుడే వస్తా-" విజయలక్ష్మికూడా తమ్ముడి వెనకే పరుగెత్తింది.

గదిలో ఒంటరిగా నిలబడి పోయాడు శేఖరం. ఎంత టైమ్ గడిచిందో అతనికి స్పృహలేదు. విజయలక్ష్మితిరిగివస్తూ "సారీ శేఖరం" అంది.

'ఫర్వాలేదులే- ఈ అమ్మాయా నీ సెక్రటరీ-'

'అవును- యేం?-'

"ఏంలేదు. వూరికే అడిగాను-" శేఖరం పెదిమలు యింకేదో చెప్పటానికి ప్రయత్నిస్తున్నాయి.

అదేంగమనించని విజయలక్ష్మి టేబిల్ మీద పుస్తకాలు సర్దుతూ "నా సెక్రటరీయే కాదు కొద్దిరోజుల్లో నా మరదలు కూడా కాబోతోంది. ప్రసాద్ వివాహం చేసుకోబోతున్నాడు."

"ఐసీ!" అతని కళ్ళలో కోపం—విషాదం కలిసిపోయిన భావం ఒకటి తళుక్‌మని మెరిసి అంతలో మాయమైంది.

"సరే! నే వస్తాలక్ష్మీ" అన్నాడు.

"ఇదేమిటి? భోజనానికి వుండవూ?—"

"ఉహు వీల్లేదు—ఓ ఫ్రెండ్‌ని కలుస్తానని మాటయిచ్చి వచ్చాను. యేమీ అనుకోకు—ప్లీజ్—"

ఆవిడ యింకోమాట చెప్పేందుకు అవకాశం యివ్వకుండా వెళ్ళిపోయాడు.

హోటల్‌కి తిరిగి వచ్చేస్తుంటే—ఆరోజు హఠాత్తుగా పుస్తకం మెట్లమీద జారవిడిచి పారిపోయిన మనిషెవరో యిప్పుడు స్పష్టంగా తెలిసింది. ఏంచేశాడు తను? తనలో ఏంచూసి జయంతి అలా దూరంగా పారిపోతోంది! శేఖరానికి జీవితంలో యేనాడు అన్పించనంత ఒంటరితనం, నిరాశ మనసులో గూడుకట్టుకోసాగింది.

●　●　●

జయంతికి మళ్ళీ మెలకువ వచ్చేసరికి మంచం ప్రక్కనే కూర్చుని ప్రసాద్ ఆదుర్దాగా చూస్తున్నాడు. క్షణంసేపు అలా తన మీదకి వంగి ఆత్రంగా చూస్తున్న మొహం అచ్చు శేఖరంలాగానే కన్పించింది. ఛప్పున జరిగి అతని చేయిలాక్కుని అందులో మొహం దాచుకుంది "నన్ను క్షమించండి—క్షమించండి" అంది.

"ఏమిటిది? జయంతీ యెందుకు?—" స్పష్టంగా విన్పిస్తున్న ప్రసాద్ కంఠం జయంతి మత్తు వదలించి విడదీసి ఈలోకంలోకి లాక్కొచ్చింది. వెంటనే చేయివదలివేసి ప్రసాద్‌వంక చూసింది. అతను శేఖరంకాదు. గదంతా వెతికింది. ఎక్కడా అతను లేడు.

"ఆయనేరీ?—" అస్పష్టంగా అడగలేక అడిగింది.

"యెవరు! శేఖరం సంగతా నువ్వడిగేది?—" ప్రసాద్ కుతూహలంగా ప్రశ్నించాడు.

జయంతి అవునన్నట్లు చూసింది.

"అతనప్పుడే వెళ్ళిపోయాడు."

"వెళ్ళిపోయారా?—"

"అవును. ఏం? అతను నీకు తెలుసా?—" అనుమానంగా అడిగాడు. జయంతి చూపులు నీరసంగా తెలుసు అన్నట్లు సూచించాయి. ప్రసాద్‌కి సంగతేమిటో క్షణంలో బోధపడింది. జయంతి మూర్ఛపోవటానికి కారణంగూడా తేటతెల్లమైంది. శేఖరం తెలిసినమనిషి కావటంవల్ల ప్రకాశం సంగతంతా మళ్ళీ బైటకి వస్తుందని భయపడిపోయి వుంటుంది. పిచ్చిపిల్ల. పాపం! జాలితో అభిమానంతో ప్రసాద్ గుండెలు సముద్రంలా పొంగాయి. వెంటనే జయంతి చేతిని తన రెండు చేతుల్లోకి తీసుకుని ఆప్యాయంగా నిమురుతూ ప్రేమ ఉట్టిపడుతున్న కంఠంతో "భయపడకు జయంతీ! వేయిమంది శేఖరాలు వచ్చినా నిన్ను నానుంచి విడదీయలేరు" అన్నాడు దృఢంగా.

అతను చేస్తున్న దేమిటో జయంతికి బొత్తిగా అర్థంగావటంలేదు. తెలిసిందల్లా ఒక్కటే! అది శేఖరం స్వయంగా చూసికూడా ఏమీ ఎరుగనట్లు నిర్లక్ష్యంగా వెళ్ళిపోయాడు. జయంతి గుండెల్లో దుఃఖపుకెరటాలు విరుచుకు పడుతున్నాయని ఎవరికీ తెలియదు. అప్పటికే విజయలక్ష్మి యిచ్చిన నిద్రమాత్రలు పనిచేయటం మొదలుపెట్టడంతో కళ్ళు మెల్లగా మూతలు పడసాగాయి.

●　●　●

రెండు సంవత్సరాల క్రితం యుద్ధంలో మరణించిన ప్రసాద్ అన్నగారు గోపాలం, శేఖరం క్లాస్‌మేట్స్‌ట. ముఖ్యంగా లక్ష్మికి శేఖరం అంటే ప్రాణంట. "నీ కంటె చాలా పెద్దదాన్నయిపోయాను కాని, లేకపోతే పెళ్ళి చేసుకుందును" అని తమాషా చేసేదిట. గోపాలం మరణించటంతో శేఖరం రాకపోకలు బాగా తగ్గిపోయినాయి. ఎప్పుడో నూటికి కోటికి ఒకసారి వుత్తరం వ్రాయటంకాని, రావటంకాని చేస్తాడు. పిల్లలు ముగ్గురిలోకి పెద్ద కొడుకు గోపాలం అంటే మునసలాయనకి ప్రాణం. అతను చచ్చిపోయింతర్వాత—ఆ దిగులుతోనే ఆయన మంచంపట్టాడు. గోపాలాన్ని గుర్తుకు తెచ్చే యేవస్తువైనా కంటికి కన్పిస్తే ఆయన చిన్న పిల్లాడిలా బావురు మంటాడు. అందుకే కూతురు అలాటి చిహ్నాలేవీ పొరపాటునకూడా లేకుండా చేసింది. ఇదంతా మాటల ధోరణిలో అప్పుడు కాస్త అప్పుడు కాస్త ప్రసాద్ ద్వారా తెలిసింది "శేఖరం నీకెలా తెలుసు? మీయిద్దరికి యెలా పరిచయం?—" ఈ మాటలమీద ప్రసాద్ యెక్కువ నొక్కి అడగలేదు. ఆరోజు జయంతి మూర్ఛపోవటానికి కారణం శేఖరం అని విజయలక్ష్మికి తెలియదు.

ప్రసాద్ వెళ్ళిపోయేరోజు దగ్గిరకి వచ్చింది.

"మీయిద్దరి మనసులు కలిసింతర్వాత యింకెందుకు ఆలస్యం—ఆ మూడుముళ్ళ తతంగం పూర్తిచేసుకుంటే సరిపోతుందిగా!" నవ్వుతూ అంది విజయలక్ష్మి.

"లక్ష్మి యెప్పుడంటే అప్పుడే! నాకేం అభ్యంతరంలేదు. తనని తొందర పెట్టటం నాకిష్టంలేదు." తృప్తిగా అన్నాడు ప్రసాద్. అతను అక్కగారిముందు, తండ్రిముందు జయంతితోమాట్లాడాలంటే సిగ్గుపడేవాడు.

వారం రోజులు గడచిపోయినాయి. ప్రసాద్ వెళ్ళిపోయాడు.

జయంతి క్రమేపి నీరసించిపోసాగింది.

'ఇదిగో! ప్రసాద్‌తో నాకు పెద్ద పోట్లాట తెచ్చి పెట్టేలా వున్నావే? మరీ అంత చిక్కిపోతే యెలా! అమ్మాయి! గట్టిగా చెపుతున్నా. నువ్వు పనీ గినీ ముట్టుకోటానికి వీల్లేదు. కడుపునిండా భోజనంచేసి -పిల్లల్తో కులాసాగా నీ యిష్టంవచ్చినట్టు తిరుగు. ఇదిగో, ఈ టానిక్స్ తాగటం మర్చిపోకు—' ఓరోజు గట్టిగా మందలిస్తూ అంది విజయలక్ష్మి.

ఆరోజు బొంబాయినుంచి ఆవిడ స్నేహితులు వచ్చారు. భార్యాభర్తయిద్దరే కావటంవల్లవాళ్ళకి తోడుగా సందడి కోసం జయంతిని తనపిల్లల్ని కూడా మహాబలిపురం చూడటానికి పంపింది విజయలక్ష్మి.

● ● ●

మహాబలిపురంలో గెస్ట్ హౌస్ సముద్రపు ఒడ్డుకి ఆనుకుని వుంది. రెండంతస్తుల ఆభవనంలో పైన వరండాలో నిలబడి చూస్తే యెదురుగుండా వత్తుగా పెరిగిన సరుకు చెట్లు కన్పిస్తాయి. వాటిమధ్యనుంచి సన్నటి కాలిబాట సముద్రం దగ్గరకు తీసుకు వెడుతుంది.

పై వరండాలో స్తంభాన్నానుకుని సాయంకాలపు నీరెండని రెప్పవాల్చకుండా చూస్తున్న జయంతికి గంభీరంగా విన్పిస్తున్న సముద్రపుఘోష "నీ కింక యీ ప్రపంచంలో పనేముంది! ఉండి యేం సుఖపడ్తావు. నీ కెవరున్నారు? నాలోకిరా! రా! వచ్చెయ్యి. సందేహించకు -' అని చేతులుజాచి అరుస్తున్నట్టుఅన్పిస్తోంది.

నిజమే. తనేం చెయ్యాలి. కొద్ది రోజుల్లో ప్రసాద్‌కి యేదో ఒకటి చెప్పక తప్పదు. అయిష్టాన్ని వ్యక్త పరిస్తే అతని మనసు గాయపడే మాట నిజం. ఎంత ఆశతో తృప్తిగా వెళ్ళాడతను. చెప్పకపోతే మౌనం అంగీకారంగా తీసుకుని విజయలక్ష్మి లగ్నాలు పెట్టించేస్తుంది. మునలాయనకూడా యీ పెళ్ళికి తొందర పడుతున్నాడు ఈ కొద్ది రోజుల్లో జయంతికి ఒక విషయం మాత్రం స్పష్టంగా తెలిసి పోయింది. శేఖరాన్ని తప్ప యింకో వ్యక్తి స్పర్శ కూడా తను భరించలేదు. అతను చూసికూడా మాట్లాడకుండా, కనీసం గుర్తించే ప్రయత్నమైనా చేయకుండా వెళ్ళిపోయాడు. మనసు రోషంతో అవమానంతో మెలితిరుగుతున్న మాట నిజమే; అతను తనకిక యెండమావి అన్న సంగతికూడా తెలుసు– అయినాసరే! మనసు రాజీ పడటం లేదు. అదీ విచిత్రం.

తను వచ్చెయ్యటం వల్ల అతనికి మంచి జరుగుతుందని ఆశించింది. సరిగ్గా అదేజరిగింది. ప్రమీలని పెళ్ళి చేసేసుకుని వుంటాడు. పరిస్థితులు చక్కబడిపోయి వుంటాయి. అందుకే మళ్ళీజీవితంలో యెక్కడప్రవేశిస్తుందో నని భయపడి వుంటాడు. లేకపోతే ప్రకాశంతో వచ్చిందని అసహ్యించు కుంటున్నాడో! ఏమైనా అనుకోనీ! అసలెప్పుడూ అంతే. అధికారం వున్నట్టు తప్ప యేనాడయినా ఆత్మీయతతో మాట్లాడేవాడా? అది

కేవలం సహాయంచేసి అవసరంలో ఆదుకున్నాను అనే అహంకారమేగా! పోనీ! అతనిపట్ల తనకున్న యీ అనురాగం యిలా గుప్తంగా వుండిపోనీ! అదే మంచిది. ఇలా ఒంటరిగా కూర్చుంటే అశాంతి మనసుని ముక్కలు ముక్కలుగా చీలుస్తుంది. భయంకరమైన ఆలోచనవైపు రెచ్చగొడ్తుంది. పిల్లల్తో కలిసివుంటేనయం.

జయంతి పైనుంచి మెల్లగా మెట్లు దిగి క్రిందికి వస్తోంది. క్రిందనుంచి ఎవరో వస్తున్నారు. వాళ్ళెవరో గమనించకుండానే ప్రక్కకు ఒదిగి తల దించుకుని గబగబా వచ్చేస్తున్న జయంతిని వెళ్తున్నఅతను హఠాత్తుగా ఆగి భుజంమీద చేయివేసి గుచ్చి పట్టుకున్నాడు. కెవ్వుమనబోయి తలెత్తి అంతలోకే ఆగిపోయింది. ఎదురుగుండా శివరామ్ నిలబడి వున్నాడు.

'శివరామ్!—' ఆశ్చర్యంగా అడిగింది.

"జయంతీ! నువ్వు—నువ్విక్కడ—'

'అరె! జయంతి' క్రిందనుంచి వస్తున్న ప్రమీల గబగబా మెట్లెక్కి పైకివస్తూ ఆశ్చర్యంగా అంది.

'జయంతీ!' శివరామ్ నోట్లోంచి అంతకంటె మాట రావటంలేదు.

'ఇన్నాళ్ళు యెక్కడున్నావు? నీ కోసం వెతికి వెతికి మా అందరి ప్రాణాలు పోయినాయి—' అంది ప్రమీల.

'నేనా?—నేను—కాని—మీ



"యిద్దరూ—" జయంతి సందేహంగా ఆగిపోయింది.

క్షణంసేపు ప్రమీల—శివరామ్ మొహాలు చూసుకున్నారు. ప్రమీల వెంటనే పయిటుకొంగులోపల నుంచి మంగళసూత్రంతీసి చూపించి నవ్వింది.

"అంటే ?—"

"అయ్యోరామా ! ఇంకా అర్థం కాలేదా ? ఇద్దరం పెళ్ళిచేసుకున్నాం. తిరపతి వచ్చి దేవుడి దర్శనం చేసుకుని యిక్కడికి వచ్చాం" కళ్ళు అపూర్వమైన కాంతితో మెరుస్తుండగా అంది ప్రమీల.

"కాని యిదేమిటి? శివరామ్–" జయంతి నమ్మలేనట్టు యిద్దరి వైపు చూడసాగింది.

"ప్రమీలా! జయంతిని మన గది లోకి తీసుకెళ్ళు. నేను క్రిందకివెళ్ళి బాయ్‌తో కాఫీ పంపమని చెప్పి వస్తాను." శివరామ్ జయంతిని ప్రమీలకి అప్పగించి క్రిందకి వెళ్ళిపోయాడు.

"రా! నిన్ను చూసిన ఆశ్చర్యాన్నుంచి తేరుకోవాలంటే నేనుడబుల్ స్ట్రాంగ్ కాఫీ రెండు కప్పులు తాగాలి." ప్రమీల జయంతి రెక్క పట్టుకుని చనువుగా పైకి లాక్కుపోయింది.

● ● ●

"ఎంత పొరపాటు చేశావు జయంతీ! అరోజు నన్నలా అడిగితే నీ మూడ్ బాగా లేదనుకున్నాను. ప్రమీలతో నా చనువు నువ్వర్థం చేసుకోలేదని మొట్టమొదటిసారిగా గ్రహించి యెలా చెప్పాలో తెలియక తికమక పడ్డాను–" శివరామ్ చాలా బాధగా అన్నాడు. ఆ రోజే తను యీ విషయం స్పష్టపరిస్తే యింత గొడవ జరిగేది కాదేమో.

"కాని– అరోజు రేఖారాణి –" జయంతి ఆగిపోయింది.

ప్రమీల– శివరామ్ చూపులు కలుసుకున్నాయి.

"నే చెప్పలా యిలాంటిదేదో జరిగి వుంటుందని. సరిగ్గా అలాగే అయింది." కాఫీ కెటిల్లోంచి కప్పుల్లో ఒంపుతూ అంది ప్రమీల.

"రేఖారాణి యేమంది జయంతీ?"

జయంతి మెల్లగా మధ్య మధ్య శివరామ్–ప్రమీల ఫర్వాలేదు చెప్పు అని ప్రోత్సాహం యివ్వగా జరిగిందంతా చెప్పింది.

"అసలాయన ప్రమీలని ఆ దృష్టితో యెప్పుడూ చూడలేదు–" అన్నాడు శివరామ్.

"ఆయన చూసినా చూడక పోయినా –" జయంతి ఆగిపోయింది.

"అది నిజమే జయంతీ. అసలు ప్రమీలని యెలాగైనా శేఖరంకిచ్చి వివాహం చేయించాలన్నది రేఖారాణి పట్టుదల. అందులో ఆవిడ స్వార్థం చాలావుంది. ప్రమీలయితే– ఆవిడ ఆటలుయెప్పటిలా సాగుతాయి. ఆయనమీద అధికారం అలాగే వుండిపోతుంది. ఇదీ అవిడపన్నాగం."

"అంతకంటే యింకేంలేదా?—" నీరసంగా అడిగింది.

"భగవంతుడి సాక్షిగా యేంలేదు. మాయిద్దరిమధ్య పరస్పర ఆకర్షణ వుందని తెలిసిన క్షణంనుంచి ఆయన ప్రమీలని స్వంత చెల్లెలిలా చూశారు. పైపెచ్చు నన్ను తన దగ్గర సెక్రటరీగా మాన్పించేసి పెద్ద వుద్యోగం స్వయంగా యిప్పించి నాకో స్థితి, హోదా వచ్చేలా చేశారు."

వాళ్ళమాటలు వింటుంటే కేవలం అంతా తన తెలివి తక్కువతనంగా—తొందరపాటుగా యిదంతా జరిగినట్టుంది. అది ఒప్పుకోవాలంటే జయంతి రక్తంలో ప్రతి బిందువూ యెదురు తిరుగుతోంది.

"అయినా! అదంతా వదిలేయ్! అసలు నీకు బుద్ధిలేక పోయింది జయంతీ! అన్నిరోజులు అతని దగ్గర వున్నావు. అతని చనువు – అమాటల ధోరణిబట్టి నీపట్ల యెలాటి అభిప్రాయం వుందో కనుక్కోలేక పోయావంటే ప్రపంచంలో నీకంటే మూర్ఖులు యింకోరు లేరనిపిస్తోంది." అంది ప్రమీల.

జయంతి యెఱ్ఱబడిన మొహంతో కిటికీవైపు తిరిగింది.

"ఆయనెప్పుడూ నాకు ఒక్కమాట కూడా చెప్పలేదు. ఏ విషయమైనా కూడా నాకెలా తెలుస్తుంది."

"నువ్వు గ్రహించి వుంటావని అనుకుని వుంటాడు."

"కాని నేను బెంగుళూరు నుంచి వుత్తరం వ్రాశాను. దాని కెందుకు జవాబు వ్రాయలేదు!—" దివ్వన వెనక్కి తిరిగి కోపంగా అంది. వాళ్ళను

కున్నంత మూర్ఖురాలుకాదు తను. అది వీళ్ళు గ్రహించటంలేదు.

'ఎప్పుడు వ్రాశావు? ఆయనకి అందిందో లేదో!' అన్నాడు శివరామ్.

'నువ్వెళ్ళిన తర్వాత ఆయనకి యాక్సిడెంటు అయింది. నెలరోజులు మంచంలోంచి లేవలేదు. హాస్పిటల్లో వున్నాడు. ఆ సంగతి నీకు తెలుసా?' అంది ప్రమీల.

'యాక్సిడెంటా?' యెప్పుడు?–' శివరామ్ చెప్పాడు. అంటే తను సరిగ్గా వెళ్ళిపోయినరోజున బెజవాడ నుంచి తిరిగి వస్తుంటే అయిందా! అంటే–అంటే తనసుకున్నట్టు ఇంటికి తిరిగిరాగానే తనకోసం వెతికే అవకాశం రాలేదన్నమాట. జయంతి కిప్పుడు అర్థంఅవుతోంది. మంచంమీద వున్న శేఖరానికి తర్వాత రెండు మూడు రోజుల తర్వాత తనసలు వూళ్లో లేదని తెలిసివుండివుంటుంది. ఆ హైములోనే తను వ్రాసిన వుత్తరం–ఆ గొడవలో అతనివరకూ వెళ్ళలేదన్న మాట! జయంతి మనసుమీద పడిన బరువు బాధగా అంతులేని అఘాతాల్లోకి గుంజెయ్యటం ప్రారంభించింది. కాని–శేఖరం యెందుకు మాట్లాడ లేదు. కన్పించికూడా యెరుగనట్టు వెళ్ళిపోయాడెందుకు! ఈ ఆలోచనతో మతిపోతోంది.

'బైదిబై–చెప్పటంమర్చిపోయాను. మాతోపాటు డాక్టరుగారు కామేశ్వరమ్మగారుకూడా వచ్చారు. వాళ్ళలా శివాలయంవైపు వెళ్ళారు. కొంచెం సేపట్లో రావచ్చు–' అన్నాడు శివరామ్. జయంతి,కెందుకో ఒక్కసారి అక్కడినుంచి దూరంగా, వాళ్ళెవరూ కన్పించనంత దూరంగా పారిపోవాలనే ఆత్రం కలగసాగింది.

కాని ఆ అవకాశమే దొరక్కుండా వాళ్ళిద్దరూ వచ్చేశారు. మొదట్లో డాక్టరుగారు లోపలికి వచ్చారు.

'ఆమూల కిటికీ దగ్గర నిలుచుంది యెవరో చూడండి.' అంది ప్రమీల హుషారుగా.

'ఎవరు?–' బైట నీరెండలోంచి వచ్చిన ఆయన వెంటనే చూడలేక పోతూ అన్నారు.

'సరిగ్గా చూడండి–' అన్నాడు శివరామ్.

జయంతి పాలిపోయిన మొహంతో యిటుచూస్తోంది. డాక్టరుగారికళ్ళకి క్రమంగా ఆ ఆకృతి తెలిసింది. ఆయన వెంటనే వున్నట్టుండి 'నిజంగా!' అన్నారు.

జయంతి కదలిముందుకువచ్చింది.

'ఇదుగో! నిన్నే చప్పున రా లోపలికి' సంతోషంతో ఆయన బైటకిచూస్తూ గావుకేక పెట్టారు.

'ఏమిటది? ఏమైంది—' ఖంగారుగా లోపలికివచ్చిన కామేశ్వరమ్మగారు షాక్ తిన్నట్టు ఆగిపోయింది.

'జయంతీ! నిజంగా!–నిజంగా!–' ఆవిడ చేతులు జాస్తూ అంది.

'నిజంగా ఏమిటి నీ మొహం. అంత స్పష్టంగా కన్పిస్తుంటే—' డాక్టరుగారు మందలించారు.



అప్పటికే, జయంతి ఆవిడ చేతిలో వాలిపోయి గుండెల్లో మొహందాచుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది.

● ● ●

'ఇక్కడికి యీ జరిగిందంతా చాలక యింకా జాప్యం చేస్తావా? నా మాట విను. మాతో వచ్చెయ్యి. నీకు తెలియదు. శేఖరం పైకి ఎంత గంభీరంగా కన్పిస్తాడో లోపల అంత—' ఆవిడ వాక్యం పూర్తిచెయ్యలేదు. జయంతి యీ మధ్యలోనే అడ్డు తగులుతూ 'వద్దు వద్దు. నన్ను క్షమించండి నేను రాను. రాలేను. నేను చేసింది పొరపాటే, కావచ్చు. కాని–క్షమార్పణ కోరుకోవాలంటే తగినంత చనువుకూడా వుండాలి' అంది.

'ఎక్కడో పిచ్చిదానిలా వున్నావే!—'

ఈ పరిస్థితుల్లో నిజంగా పిచ్చిదాన్నయితే అంతకంటే సుఖం ఇంకోటి వుండదు. కాని కావటంలేదు. నేను మామూలుగానే వున్నాను. అదే తమాషా—'

'సరె. నీ యిష్టం–పోన్లే! అతనే

స్వయంగా వచ్చి తీసుకువెడతాడు సరేనా!... ...' ఎంతసేపు ఎన్ని విధాల నచ్చచెప్పినా జయంతి వినకుండా మూర్ఖపుపట్టు పట్టడం చూసి ఆవిడ విసుగ్గా అంది. ఉన్నట్టుండి జయంతి అలా హఠాత్తుగా మాయమైతే—దానికి శేఖరం మనసు ఎంత గాయపడిందో స్వయంగా ఆవిడకి తెలుసు. అతను పైకి ఒక్కమాట కూడా అననిమాట నిజమే! కాని కాంతి లోపించిన అతనికళ్ళు—ప్రతి విషయంపట్లా అతను చూపే వుదాసీనత-మానసికంగా లోపల్లోపల దిగమ్రింగుతున్న ఆవేదన యివన్నీ ఆవిడ మాతృహృదయం కనిపెట్టకపోలేదు.

శివరామ్ వాళ్ళు విజయలక్ష్మి వాళ్ళ యింటికి వస్తామంటేకూడా జయంతి యిష్టపడలేదు. అడ్రస్ యివ్వలేదు. మౌనంగా వచ్చినవాళ్ళతో తిరిగి యింటిముఖం పట్టింది. వాళ్ళు రమ్మనగానే యెలా వెళ్ళిపోతుంది! శేఖరం గురించి తనకంటే యెక్కువ వీళ్ళందరికీ తెలుసా? ఆ రోజు హఠాత్తుగా కన్పించినప్పుడు-ఆ సాయంత్రం తను యెలాగో అయిపోతే- ఒంట్లో బాగాలేదేమోనని భయపడి ప్రసాద్ దగ్గరగా వచ్చి చేతులు పట్టుకున్నప్పుడు - ప్రసాద్ భుజంమీద నుంచి శేఖరం మొహం తను చూడలేదూ! ఆ చూపులు యెంత కఠినంగా వున్నాయి. జన్మలో తనుచేసినపనిక్షమిస్తాడా అతను. ఒకవేళ ధైర్యం చేసి వెడుతుందే అనుకో! కానిఅతను నిర్లక్ష్యంగా మాట్లాడితే-హీనంగా చూస్తే? తనేమై పోవాలి? ఇప్పుడైతే యీ కాస్త వ్యక్తిత్వం అయినా మిగులుతుంది. ప్రకాశంతో వచ్చేసినా అతనికీ తనకీ యేలాటి సంబంధం లేదని శేఖరానికి యెవరు నచ్చచెప్తారు! అసలు చెప్తేమటుకు వింటాడా? అతని కోపం - అతని అహంకారం తనకి కొత్తా! ఉహుఁ! ఒంటిమీద యేమాత్రం స్పృహవున్నా మెదడుకి యేమాత్రం వివేచనా శక్తి వున్నా తానలాటి బుద్ధి తక్కువపని యెప్పుడూ చేయదు. కానీ! ఇద్దరి మధ్యా యీ అఘాతానికి తన తెలివి తక్కువ తనమే కారణం. అదినిజమే. ఒప్పుకుంటుంది. కాని యిది పూడ్చాలంటే ఒక్క జయంతి వల్ల కాదు. జయంతి బలం చాలదు. అదెప్పటికైనా అతనే చెయ్యాలి. లేకపోతే యింతే. కామేశ్వరమ్మ గారితో మొండిగా రానని ఖచ్చితంగా తిరస్కరించి నందుకు జయంతి యింటికి వచ్చిం తర్వాతకూడా యేమాత్రం బాధపడలేదు.

● ● ●

వారం రోజులు గడిచి పోయినాయి. జయంతి యెంతవద్దనుకున్నా హఠాత్తుగా యేక్షణంలోనైనా శేఖరం రావచ్చుననే ఆశ మనసులో మూరుమూలగా మినుకు మినుకు మంటూనేవుంది. ఎన్ని విధాలదాన్ని ఆర్పేయాలని చూసినా సాధ్యం కావటంలేదు.


విజయలక్ష్మి పురోహితుడినిపిలిచి లగ్నం పెట్టించింది. జయంతిని యెవరూ సంప్రతించలేదు. 'ఈ పెళ్ళి నాకిష్టం లేదు. వద్దు.' అని జయంతి బైటపడనూలేదు. పెళ్ళి సరిగ్గా ఇరవై రోజులుంది. పెళ్ళిశుభలేఖలుఅచ్చయినాయి. పనులు చురుగ్గా సాగుతున్నాయి. చాలాకాలం తర్వాత యింట్లో శుభకార్యం జరుగుతున్నందుకు విజయలక్ష్మి ఆర్భాటంగా పెద్ద యెత్తున ఏర్పాట్లు చేయిస్తోంది. సాధ్యమైనంత వరకూ వారంరోజులు ముందుగానే వస్తానని - శలవుకోసం ప్రయత్నం చేస్తున్నానని ప్రసాద్ ఉత్తరం వ్రాశాడు. అన్నీ సవ్యంగా చకచకా జరిగిపోతున్నాయి. రోజులు గిఱ్ఱున తిరిగి వస్తున్నాయి పెళ్ళి పది రోజుల్లోకి వచ్చేసింది. ప్రసాద్ ఎల్లుండి వస్తున్నానని తెలియజేశాడు.

'ఓ రోజు మధ్యాహ్నం విజయలక్ష్మి జయంతిని వెంటబెట్టుకుని చీరెల కోసం షాపుకెళ్ళింది.

'చూడు చూడు. రంగులు నీకేవి యిష్టమో! చూసుకో—' అంది.

'నాకు తెలియదు! మీరే చూడండి. నాకేదయినా బాగానే వుంటుంది' పరధ్యాసగా అంది జయంతి. కొన్ని రాత్రిళ్ళుగా తనకు అస్సలు నిద్రనేది కాని మనసుకి విశ్రాంతి అనేది కాని లేదు పూరికే అలసట అన్పిస్తోంది. ముభావంగా వుంటే ఆవిడ ఏమనుకుంటుందోనని లేని హుషారు తెచ్చిపెట్టుకుని బలవంతంగా తిరుగుతోంది.

షాపు అతను రకరకాల చీరలు తెచ్చి ముందు పడేశాడు. ఇవిగో యివి బాగుంటాయి. ఇవి లేటెస్ట్ ఫాషన్. ఈ రంగులు ఆవిడకి అద్భు



తంగా వుంటాయి అంటూ వస పిట్టలా ఒకటే వాగుతున్నాడు.

'ఇదుగో! చూడండి. ఎంత మంచి రంగో! కలర్ గ్యారంటీ!' లేత నీలం రంగు చీరకి ముదురు నీలంలో హంసల బారు అంచున్న చీర చూస్తూ అన్నాడు. జయంతి వులిక్కిపడింది. అది ఆ రోజు ప్రమీల పుట్టినరోజుకి శేఖరం తెచ్చి బలవంతంగా కట్టుకుంటేనేకాని వీల్లేదన్న చీర.

'నీ కళ్ళకి నా మీద కోపంతో పొరలు అడ్డు వచ్చాయిగాని— చూడు— ఈ చీరెలో యెంత బాగున్నావో!—' నడుందగ్గిర పడిన మడతని సరిచేసి భుజాలుపట్టి తన వైపు త్రిప్పుకుంటూ అన్నాడు శేఖరం. ఆ రోజులు ఏమైపోయినాయి. అతని మనసులో ఆ అధికారం యెలా పోయింది.

'చూడు. ఈ అంచు చాలా బాగుంది. తీసుకుంటావా?—'

విజయలక్ష్మి చీరెని చేతిలోకి తీసుకుని చూస్తూ అంది.

'వద్దు వద్దు. నా కా రంగు బాగా లేదు. అసహ్యంగా వుంది—' వెంటనే అంది జయంతి.

షాపువాడు వింతగా చూశాడు. అతని చూపులో బొత్తిగా ఫ్యాషన్ తెలియదు. ఎక్కడ అడివి సరుకురాబాబు అన్నట్టున్నాయి.

'సరే! మీరుచూసి సెలెక్టు చేసుకోండి-' షాపులోకి యింకో కస్టమర్ రావటంతో అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

'నువ్వు చూసుకో మరి—' అంది విజయలక్ష్మి.

'అదుగో! ఆనీలం చీరె యిటు చూపించు-' అప్పుడే షాపులోకి వచ్చినవాళ్ళలో ఒకావిడ అడిగింది.

జయంతి-విజయలక్ష్మి యిద్దరూ వెనక్కు తిరిగి చూశారు. క్షణంసేపు జయంతి గుండెలు ఆగిపోయినాయి. వెంటనే మొహం యిటు తిప్పేసుకుంది. ఆనీలంచీరె అడుగుతున్నావిడ ఆరోజు తనకి కోపం తెప్పించి శేఖరం చేత 800/- చందా యిచ్చేలా చేసిన సరస్వతీరామన్.

జయంతి యెంత త్వరగా మొహం తిప్పేసుకున్నా ఆక్షణంలో సగంలోనే ఆవిడ జయంతిని గుర్తుపట్టేసింది. వెంటనే మొహం చాటంత చేసుకుని 'అరె! మిసెస్ శేఖర్! మీరిక్కడున్నారే! మెడ్రాస్ ఎప్పుడొచ్చారు.' అంటూ గబగబాదగ్గరకి వచ్చింది. 800 చందా యివ్వగల మనుష్యులతో పరిచయం బాగా పెంచుకోవాలని ఆవిడకి తెలుసు.

జయంతి మొహం కందగడ్డలా తయారైంది. ఏం చెప్పటానికి తోచటంలేదు.

'ఎవరితో మాట్లాడుతున్నారు మీరు?—' విజయలక్ష్మి అనుమానంగా అడిగింది.

'మీతోకాదు. మీ ప్రక్కనావిడతో – కొంచెం దారియిస్తారా—'

సరస్వతీ రామన్ విస్మయంతో చూస్తున్న విజయలక్ష్మిని తప్పించుకుని జయంతి దగ్గరగావచ్చి 'ఎన్నాళ్ళయింది మీరువచ్చి? ఏరీ మీవారు కన్పించరే!' అంది. జయంతి నిస్సహాయంగా చూస్తుండిపోయింది.

'నేనిక్కడికివచ్చి నెల రోజులు పైనే అయింది ఇంతకీ మీరెక్కడ వుంటున్నారో చెప్పండి. నేనువచ్చి మీయిద్దర్నీ మాచెల్లెలింటికి లాక్కుపోతాను-'

'ఇదుగో! ఈ చీరె యెలా వుంది!' దూరంగా నిలబడిన యింకో ఆవిడ సరస్వతీ రామన్‌ని విసుగ్గా పిలిచింది.

'వస్తున్నా! యిప్పుడే ఒక్క క్షణం-' అని ఆగి జయంతిని చూస్తూ. 'మీరుకూడా బట్టలు చూస్తూండండి. నేను కూడా ఆపని ముగించుకుని వస్తాను. ఇద్దరం కలిసిమీవారి దగ్గర కెళ్ళి ఆయన పర్మిషన్ తీసుకుని ఆయనకూడా వస్తే మా యింటికి వెడదాం-' అనినవ్వుతూ వెళ్ళిపోయింది.

'ఎవరు లక్ష్మి. ఆవిడ?-' విజయలక్ష్మి కటువుగా అడిగింది.

'మనం యింటికి వెడదామా!-' రక్తంలేని మొహంతో అందిజయంతి.

'పద-' చీరెలకి మళ్ళీ వస్తామని షాపు అతనితో చెప్పి విజయలక్ష్మి దోవతీసింది. జయంతిఅనుసరించింది. సదా నవ్వుతూ వుండే ఆవిడ మొహంలో యిన్నడూ చూడని గంభీరత చూసిం తర్వాత జయంతికిక తను శేఖరాన్ని గురించి చెప్పడం తప్ప యింకో మార్గం లేదనిపించింది.

● ● ●

'ఎంత విచిత్రమైన మనుష్యులు మీ రిద్దరూ! శేఖరం ఒక్కమాటు కూడా మాట్లాడకుండా వెళ్ళిపోవడం యెంత చిత్రం!-' ఇంటికి వచ్చిం తర్వాత జయంతి చెప్పిందంతావిని తెల్లబోతూ అంది విజయలక్ష్మి.

'కన్పించటం లేదూ! నా మీద కోపం, అసహ్యం-'

'నువ్వు మటుకు తక్కువేం తిన్నావు?- అయినా నేనెంత మతిమరపుదాన్ని! శేఖరం నీ పేరుతో అప్పుడెప్పుడో వుత్తరం రాస్తే నేను వెంటనే పెళ్ళిచేసుకోమని జవాబు కూడా రాశాను. ప్రసాద్ నిన్ను జయంతి అని పిలుస్తున్నప్పుడు ఆ ధ్యాసే రాలేదు-'

'మొన్న వొచ్చినప్పుడు నాసంభాషణే రాలేదా?'- అడగలేకఅడిగింది.

'ఎందుకు రాలేదు? ఏమైంది అని నేనడిగితే పెళ్ళి చేసుకోలేదు, ఆ అమ్మాయి యిష్టపడలేదని నవ్వి వూరుకున్నాడంతే - నాకేం తెలుసు యిదంతా? -' విజయలక్ష్మి కళ్ళముందు ఆ రోజు జయంతి మూర్ఛపోగానే 'ఈఅమ్మాయా నీ సెక్రెటరీ!' అన్నప్పటి అతని మొహంకదిలింది.

'ఇప్పుడు నన్నేం చేయమంటారు చెప్పండి?—' దీనంగా అడిగింది జయంతి.

'వెంటనే బట్టలు సర్దుకో! రైలెక్కిస్తాను.'

'రైలా?—'

'అవును. అసలు నేనే వచ్చి దించి శేఖరాన్ని మొహంమీద నాలుగూ అడగాలని వుంది. కాని నాకేం హక్కు లేదు. ఈ పెళ్ళి ఆగటానికి వీల్లేదు. ఈ లోపల పెళ్ళికూతుర్ని చూడాలి నేను—' జయంతి క్రిందికి చూస్తూండి పోయింది.

'ఎలా? ఇష్టంలేదా?—వెళ్ళవా—'

'ధైర్యంలేదు—'

'ఏం ఫర్వాలేదు. ఒకవేళ అత నేదైనా అంటే, అవమానపూర్వకంగా మాట్లాడితే సరాసరి నా దగ్గరికి వచ్చెయ్యి. ఈ యింటి తలుపులు నీకెప్పుడూ తెరిచేవుంటాయి. కాని ప్రసాద్ భార్యగా కాదు—నా సెక్రెటరీగా అని నువ్వు గుర్తుంచుకోవాలి.'

'వెళ్ళక తప్పదంటారా?—' నీరసంగా అడిగింది.

'తప్పదు. తప్పుచేసింది నువ్వు. తప్పుచేసినప్పుడు తెలుసుకుని క్షమాపణ కోరుకోటానికి సిగ్గెందుకు!—'

'కాని—అతను క్షమించడు. నాకే నమ్మకంలేదు—'

'నాకు నమ్మకం ఉంది. నువ్వు వెళ్ళి ప్రయత్నం చెయ్యి—' దృఢంగా అంది విజయలక్ష్మి.


● ● ●

జయంతి ఆ స్టేషన్‌లో దిగగానే ముందు సరాసరి కామేశ్వరమ్మగారి దగ్గరికి కాని—సునంద వద్దకి కాని వెళ్దామా అనుకుంది. వద్దు, ముందు అతనిదగ్గరికి వెళ్ళటమే మంచిది. ఒకవేళ అత నేదైనా హీనంగా మాట్లాడితే సరాసరి ఎవరికీ తెలియకుండా తిరుగు రైలెక్కి విజయలక్ష్మి దగ్గరికి చేరుకోవచ్చు.

టాక్సీ యింటిని సమీపిస్తుంటే మనసంతా యెలాగో అయిపోసాగింది. తను ఇంట్లోంచి వెళ్ళిపోయే ముందు మళ్ళీ యిలా తిరిగి రావల్సి వస్తుందని కల్లోకూడా అనుకోలేదు. ఇంటిముందు ఆవరణలో శేఖరంకారు లేదు. జయంతి తేలికగా ఊపిరి పీల్చింది. ఇది కొంతనయం సరాసరి అతనికిగుమ్మంలోనే యెదురవకుండా!

తలుపులు దగ్గరగా వేసివున్నాయి. మెల్లగా వరండా మెట్లెక్కి తలుపు తట్టింది. కొద్దిసేపయిన తర్వాత నాయర్‌వచ్చి తలుపుతీశాడు.

'నాయర్! గుర్తున్నానా!—' భూతాన్ని చూసినట్టు నోరు తెరిచి చూస్తున్న నాయర్‌ని నవ్వుతెచ్చిపెట్టుకుంటూ అడిగింది. వాడు సమాధానం లేకుండా యింకా అలాగే చూస్తున్నాడు.



'ఆయన వున్నారా లోపల—నేనింట్లోకి రావచ్చా?—'

నాయర్ మెల్లగా యీలోకంలోకి వచ్చి తప్పుకుని దారిఇచ్చాడు.

'వాసులేడా?'

ఉన్నాడన్నట్టు తలూపాడు.

'రాత్రంతా నిద్రలేదు. స్నానం చేస్తాను. తింటానికేమైనా వుందా? బాగా ఆకలి వేస్తోంది–' నాయర్ నిశ్శబ్దంగాతలాడించి వెళ్ళిపోయాడు.

జయంతి లోపలికి వచ్చింది. ఆ హాలు– గదులు– వాటిల్లో సామాను, పూలకుండీలు వాటన్నిటిని చూస్తుంటే ఒంట్లోకి కొత్తశక్తి వచ్చినట్టు అన్పించింది.

గదిలోపలకి వచ్చి కూర్చున్న జయంతి నిజమా అబద్ధమా అన్నట్టు వాసు వచ్చి తొంగిచూశాడు.

'యేం వాసూ!–' పలకరించింది.

వాసులోపలకి ధైర్యంగావచ్చాడు.

కొద్ది సేపయిం తర్వాత– స్నానం చేసి భోంచేసి సరాసరి శేఖరం గదిలోకి వచ్చి పడుకుంది.

(సశేషం)



డిటెక్టివ్ లెసన్ నెం 2

బీనాదేవి బి.ఎ.

రాత్రి పదిన్నరయింది. రాత పూర్తి చేసి మంచినీళ్ళు తాగి ప్రసాద్ తన గది బయటికి వచ్చేశాడు. ఇంకా లేబరేటరీలో లైట్లు వెలుగుతూనే వుండటం చూసి ఆశ్చర్యపోయేడు. ఇంకా అవినాశ్‌బాబు లేబరేటరీలో పనిచేస్తున్నారన్నమాట. అప్రయత్నంగా లేబ్ వేపు నడిచి, లేబ్‌లో ప్రవేశించాడు ప్రసాద్. అవినాశ్ బాబు నాటి సాయంత్రం తెచ్చిన బ్లడ్ శాంపిల్ ఎనలైజ్ చేస్తున్నారు.

"కమాన్ మై బోయ్! నీ కోసం కబురంపుదా మనుకుంటూ వుంటే నువ్వే వచ్చేవు. రా, కూర్చో. ఈ ఎనాలసిస్ నోట్సు పది నిమిషాల్లో డిక్టేట్ చేస్తాను. కాస్త రాసిపెట్టు" అన్నారు అవినాశ్.

ప్రసాద్ టేబిలుదగ్గరకు వచ్చి కూర్చున్నాడు. టేబిలుమీద యితర పుస్తకాలతోపాటు "జ్యోతి" కూడా వుంది. కొంతసేపయాక అవినాశ్ డిక్టేట్ చెయ్యటం మొదలుపెట్టేరు. బేసిన్‌వద్ద చేతులు కడుక్కొని ప్రసాద్‌కి ఎదురుగా తన కుర్చీలో అవినాశ్ కూర్చునేసరికి డిక్టేషను పూర్తయింది.

పూర్తిచేసిన నోట్సుని అవినాశ్‌కి అందించాడు ప్రసాద్. అవి అందుకుంటూ అవినాశ్ "ముత్యాల్లాంటి దస్తూరీ. ఇంతకీ నీ నల్లప్రియురాలికి ప్రేమలేఖ పూర్తిచేశావా? లేదా?" అన్నారు నవ్వుతూ.

ప్రసాద్ ఆశ్చర్యానికి మేరలేక పోయింది. ఎలాగ కనిపెట్టేసేరు అవినాశ్! అడగకుండా వుండలేక పోయేడు. "ఎలా పట్టేసేరు సార్?" అన్నాడు.

"ఇదివరకే చెప్పేనుగదా! చూసిన విషయాల్నిబట్టి కనపడని విషయాలని చూడగలిగి వుండాలి డిటెక్టివ్ అని. ఇదే డిటెక్షన్ అంటే. ఇంకా చెప్పగలను. నువ్వు నీ ప్రియురాలికి ఆకుపచ్చని లెటర్ పేపరుమీద ఉత్తరం ఇప్పుడేరా సేవు. అవునా?" అన్నారు అవినాశ్ నవ్వుతూ.

"ఎస్ సర్" అన్నాడు ప్రసాద్.

"వాషబుల్ రాయల్ బ్లూ ఇంక్‌తో రాసేవు."

"అవును" అన్నాడు ప్రసాద్ దొంగతనం చేసినట్టు.


"ఇలాటివి కనిపెట్టడం చాలా సులువు. నీకు పాశ్చాత్య సంప్రదాయాలమీద మక్కువ ఎక్కువ. పాశ్చాత్య దేశాల్లో వాషబుల్ బ్లూ ఇంకు స్త్రీలే వాడుతారు. కాని ఆ ఇంకు స్త్రీ పురుషులందరికీ నచ్చుతుంది మనదేశంలో. పాశ్చాత్య సంప్రదాయాన్ని తోసిపుచ్చి నువ్వు ఆ వాషబుల్ బ్లూ యింకే వాడేవంటే నీకు బ్లూ రంగిష్టమన్న మాట. బ్లూ ఇంకు బ్లూ పేపరు మీద కనిపించదు. కాబట్టి ఆ రంగు పేపరు నీ లవ్ లెటరుకి వాడి వుండవు. మరింకే రంగు కాగితం వాడి వుంటావు? గ్రీన్ కూల్ కలరు. అంటే చల్లని రంగు మనకు దొరికే లెటరు పేపర్లు సాధారణంగా నాలుగు రంగుల్లో వుంటాయి. బ్లూ, ఎల్లో, రెడ్, గ్రీన్. వాటిలో గ్రీన్ ఒక్కటే నీ కిష్టమైన కూల్ కలరు. అంచేత ఆ రంగు పేపరు వాడి వుండాలి. అవునా?" ప్రశ్నించేరు అవినాశ్.

"అవును సార్. కాని నే నేరంగు యింకు వాడేనో ఎలా తెలిసిపోయింది సార్?"

"నీచేతిమీద చిన్న సిరా మరక వుంది. అది వాషబుల్ బ్లూయింకుది. బహుశా యిప్పుడే మంచినీళ్ళు తాగేవు కాబోలు తడికి మచ్చ పెద్దదయింది. భోజనానికి ముందు ఆ మచ్చ వుండి వుంటే అది కడిగేసుకుని వుండేవాడివి. అంటే భోంచేశాక ఆ యింక్‌తో ఏదో రాసేవన్నమాట. ఇప్పుడు నువ్వు నేను డిక్టేట్ చేసిన నోట్సు అందరూవాడే మామూలు బ్లూ బ్లాక్ యింక్‌తోనే రాసేవు." అని ఆగేరు అవినాశ్ ఎఫెక్టు కోసం.

ప్రసాద్ అతని తెలివికి ఆశ్చర్యపడిపోయేడు.

ఫర్ యువర్ ఇన్ఫర్మేషన్ నేను గ్రామఫోను పిన్నులు కొనను పెంచుతాను -



'నా నోట్సుకి మామూలు ఇంకు వున్న పెన్నువాడేవు ఇంతకు కొంచెంసేపు ముందే వాషబుల్ బ్లూ యింకు వాడేవు. నీ దగ్గర యిప్పుడు రెండుపెన్నులులేవు. అంటే నీగదిలో ఆ రెండో పెన్ను వదిలేశావన్నమాట. దాని అర్థం ఆపెన్నుకి ప్రత్యేక ఉపయోగంవుండివుండాలి. ఆపెన్ను బైటికి తేకపోవడం వల్లా ఆ సిరా బ్లూ యింకుది అవడం వల్లా యిప్పుడే నువ్వు ఉత్తరంరాసి వుంటావి. అది నీ ప్రియురాలికే అయ్యుంటాలి. ప్రత్యేక ఆధారం లేకపోయినా నీ సిరా రంగు ఎన్నికనుబట్టి, నోట్ పేపరురంగు, ఉత్తరం స్వభావంకూడా గెస్ చేసేను. నే చెప్పింది రైటేనా?'

'అక్షరాలా సార్.'

'నీ చర్యలను బట్టి నీ అభిరుచులు కూడా చెప్ప గలిగి వుండాలి' మంచి డిటెక్టివ్. మాట వరసకు చెబుతా. నీకు హ్యూమరస్ రైటింగ్స్ యిష్టం లేదు. అవి ఎంత ఉత్తమమైన వైనా వాటి జోలికిపోవు. డిటెక్టివ్‌ని ఎల్ల వేళలా రక్షించేది పిస్తోలుకాదు. హంటర్ కాదు. అధికారం కాదు. అతన్ని రక్షించేది సెన్స్ ఆఫ్ హ్యూమర్. అవర్ ఆఫ్ డిఫీట్‌లో – అంటే ఓటమి పొందినప్పుడు తన తెలివి తక్కువకి తనే నవ్వుకో గలిగి వుండాలి డిటెక్టివ్. తన ఓటమికి కోపం తెచ్చుకున్నా, ఉడుకు మోత్తనం తెచ్చుకున్నా తర్వాత బుర్ర అసలు పనిచేయక యింకా ఎక్కువ

ఫెయిలవుతాడు. ఒక ఆడదానిచేతిలో ఓడిపోయినప్పుడు పిడుగు పడ్డట్లు షెర్లాక్ హోమ్స్ నవ్వగలిగేడని అందరికీ తెలుసు. చెప్పు. ఏమంటావ్? నే చెప్పింది అంగీకరిస్తావా డిటెక్టివ్‌కి మంచి సెన్స్ ఆఫ్ హ్యూమర్ వుండాలని?'

'అంగీకరిస్తాను సార్. కాని నాకు హాస్యరచనలంటే యిష్టంలేదని ఎలా కనిపెట్టేశారు సార్?' ఆతృతగా అడిగేడు ప్రసాద్.

'ఎలిమెంటరీ మైడియర్ ప్రసాద్! నా టేబిలుమీద 'జ్యోతి' వుంది. ఒక గంటక్రిందటే వచ్చింది. అంటే నువ్విదివరకు దాన్ని చూసి వుండవు. నువ్వు టేబిలువద్ద కూర్చున్న పది నిమిషాలవరకూ నేను నోట్సు డిక్టేట్ చెయ్యలేదు. నీకు హాస్యం అంటే ఏమాత్రం యిష్టంవున్నా ఆ పత్రిక పేజీలు తిరగెయ్యకుండా వుండవు. 'జ్యోతి'లో హాస్యరచనలు, కార్టూన్లు పడుతూ వుంటాయి. కాని నువ్వుదాన్ని ముట్టనైనా లేదు. ఇటుపైనన్నా హాస్యరచనలు చదువు' అని సలహా యిచ్చేరు అవినాశ్.

'అలాగేసార్' ఉత్సాహంగా అన్నాడు ప్రసాద్.

లెసన్ 2— మంచి డిటెక్టివ్ కాదలుచుకున్నవారు 'జ్యోతి' చదవాలి.

(ఇతరులు చదవకూడదనికాదు.)

□□□

ఆశలు అనుభవాలు

ప్రొద్దుట్నుంచీ మిత్రులు చేసిపోయిన కోలాహలానికి 'హోంసిక్' చేసినట్లయి, సిటీపార్కుకు బయల్దేరాడు డాక్టర్ రావ్. రావ్ పార్కుకొచ్చేసరికి వాతావరణం కాస్త చిరాగ్గానేవుంది. పదకొండు గంటలు దాటటంతో మూగఎండ కాస్తోంది.

సెలవురోజులు కావటం వలన కాబోలు పార్కంతా రద్దీగావుంది. హాంబర్గర్లు తింటూ శాండ్‌విచ్‌లను తింటూ: బ్లాక్ కాఫీ, వోడ్కా, షాంపేన్ మొదలైన పానీయాలుత్రాగుతూ వుల్లాసంగా తేలిపోతున్నారు కొంతమంది. పిల్లలు కొందరు కోసు అరంజ్ త్రాగుతూ ఆనందంతో త్రుళ్లుతున్నారు. యువతీ, యువకులు కొందరు సరస్సులో బోట్ షికార్లు చేస్తున్నారు. మరికొందరు నాచురల్ హిస్టరీ మ్యూజియమ్ ముందరవున్న పూలతోటలో కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు. కొంతమంది స్త్రీ పురుషులు చేతులు చేతులు కలుపుకుని జూవైపు విలాసంగా నడుస్తున్నారు.

ఓ ప్రక్కన కూర్చుని పార్కంతా కలయజూచిన రావ్‌కు అందులో ప్రత్యేకమైన గొప్పదనం గోచరించలేదు. 'మన పబ్లిక్‌గార్డెన్ మాత్రం దీని కెలా తీసిపోతుంది' అనిపించింది.

పబ్లిక్ గార్డెన్ గుర్తుకొచ్చే సరికి మనస్సుపోయి హైదరాబాద్‌లో వాలింది సాయంత్రంపూటఆబిడ్స్‌లో

విహారి — శాలివాహన

నుంచుని అందమైన యువతుల్ని చూస్తుంటే యిట్టే హాయిగా గడిచిపోయేసికాలం. ఆ మనుష్యులు, ఆవేషభాషలు—అతరహా నేవేరు. భారత స్త్రీల కట్టుబొట్టు, వేషంలోనే వొక ప్రత్యేక ఆకర్షణ, పవిత్రత గోచరిస్తుంది. ఇక్కడి స్త్రీలో?— సారాయి తాగుతూ, సిగరెట్లు కాలుస్తూ, జీన్స్ వేసుకుని 'బాబ్డ్' హెయిర్ డ్రెస్సింగ్‌తో అదోరకంగా వుంటారు. అసలు వాళ్ళ అందం పొందిక వీళ్ళకెక్కడిది?

'మా కళ్యాణినిచూస్తే 'మిస్ అమెరికా'లకైనా కళ్ళు జిగేల్ మనాల్సిందే!'

కళ్యాణి గుర్తుకొచ్చేసరికి కామేశం, కరుణాకరం కళ్ళముందు మెదిలేరు. కామేశం ఇప్పుడేం చేస్తున్నాడో? కరుణాకరం ఏదో కంపెనీలో గుమాస్తాగా వుంటున్నాట్ట. వాణ్ణి తలుచుకుంటే జాలి కలుగుతున్నది చిన్నతనంనుంచీ భవిష్యత్తును గురించి గొప్ప ఆశాభావం వుండేది వాడికి. తానో పెద్ద గొప్పవాడు కావాలనీ, ఎమ్మే ప్యాసై పెద్ద వుద్యోగాన్ని చేపట్టాలనీ, అందమైన యువతిని అర్ధాంగిగా పొందికార్లలో షికార్లు చేయాలనీ— ఏవేవో కలలు కంటూ వుండేవాడు. పాపం! వాడి కలలన్నీ కల్లలే అయినై.

తను మాత్రం అనుకున్నాడా?— తానిలా అమెరికాలో మూడేళ్ళు వొంటరి జీవితం గడుపుతాడని! ఈ దేశంవచ్చిన క్రొత్తలో తానెన్ని అగచాట్లు పడ్డాడు. అన్నం కూరగాయలు లాంటివి దొరుకుతాయేమోనని ఎన్నో రెస్టారెంట్లు తిరిగేడు. ఎంతసేపూ బీఫ్ బర్గర్లు, హాట్ డాగులు, బార్బక్యూ బీఫ్ తప్పితే మన పదార్థాలే గోచరించేవి కావు. తర్వాత కొంత కాలానికి మూర్తి రావటం యిద్దరూ కలిసి వో 'అపార్ట్‌మెంట్' తీసుకుని 'స్వయం పాకం' మొదలెట్టటం జరిగింది. ఏదైనా అంతే!— మనం అనుకున్నవి జరగక పోవచ్చు, అనుకోనివి జరిగిపోనూవచ్చు. మనమంతా నిమిత్త మాత్రులమే!

మూడేళ్ళు తానీ దేశంలో గడిపేడు. మూడు రోజుల్లో స్వదేశానికి వెళ్ళబోతున్నాడు. ఆ మూడు రోజులూ మూడు యుగాలుగాతోచి, యీ దేశంలో యిక వుండలేననిపిస్తున్నది. కనిపించిన ప్రతిదీ ఏదో వింతగా తోచి విసుగుదల కలిగిస్తున్నది. డెబ్బయి రెండు గంటలు, డెబ్బయిరెండు సెకన్లయి, తను వెళ్ళి హైదరాబాద్‌లో వాలితే బాగుండుననిపించింది. ఇదంతా స్వదేశంమీది మమకారం కాబోలు! అందుకే అన్నారు 'జననీ జన్మభూమిశ్చ...' అని!

స్వదేశాన్ని గురించీ, స్వజనాన్ని గురించీ ఆలోచిస్తూ కూర్చున్న రావ్‌కు వాతావరణం చల్లబడటం తెలియనే లేదు.

'హల్లో డాక్టర్ రావ్! యూ ఆర్ హియర్' అన్న మాటలకు తలెత్తి చూశాడు రావ్.

డాన్సింగ్ స్టెప్స్‌తో రావ్ దగ్గరికొచ్చాడు జాన్సన్. అతనికి విష్ చేసి మౌనం వహించాడు రావ్. జాన్సన్ రావ్‌వుంటున్న యింట్లోనే మరో భాగంలో వుంటున్నాడు.

రావ్ ముఖకవళికల్ని గమనిస్తూ 'కమాన్ డాక్టర్' అని పిలిచాడు జాన్సన్. భారంగా లేచి జాన్సన్‌ను అనుసరించాడు రావ్. జాన్సన్ ప్రక్కన నడుస్తున్నాడన్నమాటేగాని, రావ్ ఆలోచనంతా కరుణాకరం మీద వుంది కరుణాకరం వ్యక్తిత్వానికి జాన్సన్ ప్రతిబింబం. జాన్సన్‌కు కూడా కరుణాకరంలా జీవితంమీద గొప్ప ఆశ వుంది. అతనూ జీవితంలో ఎంతో వున్నతస్థితికి పోవాలనీ, జాలీగా దేశ దేశాలు తిరగాలనీ, ఏవేవో కలలుకంటూ వుంటాడు. కాని వాస్తవంలోమటుకు జాన్సన్ వో కంపెనీలో వర్కర్!

ఏ ఆశలూ లేనివాడికి ఎన్నెన్నో అవకాశాలూ, అనుభవాలు! ఏవేవో ఆశించేవాడికి ఏవీ లభించకపోవటం! ఏవిటో యీ 'లీల' అనిపించి సన్నగా నవ్వుకున్నాడు రావ్.

ఇద్దరూ కలిసి గదికొచ్చారు. జాన్సన్ సోఫాలో కూర్చుని సిగరెట్ తీసి నోట్లో పెట్టుకుంటూ రావ్‌కొకటి ఆఫర్ చేశాడు. రావ్ చూసేలోగానే సిగరెట్ వెనక్కు తీసి 'మీది పాల్‌మాల్ కాబోలు, ఇది కామెల్ బ్రాండుగదా' అన్నాడు.

రావ్ జాన్సన్ కళ్ళలోకి చూస్తూ నవ్వాడు. సిగరెట్ ఆఫర్ చేయటం అంతలోనే యిలా మాట్లాడటం బాగా అలవాటైపోయింది జాన్సన్‌కు. ఇద్దరూ సిగరెట్లు కాలుస్తూ కూర్చున్నారు.

'ఐతే మీ దేశం వెళ్ళినా నన్ను మాత్రం మీరు మరచిపోలేరు కదూ?' జాన్సన్ అడిగాడు.

'ష్యూర్, ష్యూర్. నేనీ యింటికి రాగానే మీ రిచ్చిన స్వాగతం, మొట్టమొదటిసారి నాపేరు పుస్తకం మీద చదివి 'కంటూరావ్' అని పిలిచిన పిలుపు, మీ సిగరెట్ ఆఫర్లు—ఇవన్నీ ఎలా మరచిపోగలను చెప్పండి.'

'నేననేది అదిగాదండి. నాలాంటి బూజమ్ ఫ్రెండొకతను మీకున్నాడంటిరే ఆ రెస్పెక్టులో' అన్నాడు జాన్సన్.

రావ్ సమాధానం చెప్పేలోగా మూర్తి అక్కడికొస్తూ 'అవును జాన్సన్. మీవంటి మిత్రుల్ని ఎవరు మాత్రం ఎలా మర్చిపోతారు!' అన్నాడు.

జాన్సన్ సంతృప్తిగా సిగరెట్ పొగ వదిలాడు. ఇంతలో గదితలుపు మీద చప్పుడు కావటంతో 'కమిన్' అన్నాడు మూర్తి. పదిమంది యువతీ యువకులు తలుపుతీసుకుని బిలబిలమంటూ లోపలికి ప్రవేశించారు. రావ్ లేచి వారందర్నీ ఆహ్వానిస్తూ సీట్లు చూపాడు. అంతా కూర్చుని సంభాషణకు వుపక్రమించారు. రావ్‌కు 'ఫేర్‌వెల్ పార్టీ' ఏర్పాటు చేయటాన్ని గురించిన విషయంమీద

సాగిపోయింది సంభాషణ. మర్నాడు పార్టీ యివ్వటానికి నిశ్చయించుకుని రావ్ అనుమతి తీసుకుని వెళ్ళిపోయారు వచ్చిన వాళ్ళంతా. జాన్సన్ కూడా వాళ్ళతో పాటే నిష్క్రమించాడు. మూర్తి రావ్‌కోసం కొన్ని వస్తువులు కొనటానికని "డౌన్‌టౌన్"కు వెళ్ళాడు.

రావ్ ఒక్కడే గదిలో మిగిలాడు. మిత్రుల ఆదరాభిమానాలకు అతని మనస్సెంతగానో సంతోషించ సాగింది. అమెరికన్ ఫ్రెండ్స్ చూపే వాత్సల్యాన్ని తలచుకునే సరికి, వాళ్ళనందర్నీ వదలి వెళ్ళిపోవటానికి మనస్సుకు బాధ అనిపించింది. కాని, స్వదేశంలో వున్న బంధువుల్ని, స్నేహితుల్ని తలచుకుని ఎప్పుడెప్పుడు ఇండియా పోదామా అని వువ్విళ్లూరింది మనస్సు.

రావ్ ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ "గుడ్ ఆఫ్టర్‌నూన్ డాక్టర్" అంటూ గదిలో ప్రవేశించింది వివియన్. మిస్ వివియన్ కూశారావ్‌కు "కోశెనెంట్"

రావ్ ఆమెకు ప్రత్యభివాదనం చేస్తూ సోఫా చూపాడు. వివియన్ కూర్చుంది. కేస్‌లోనుంచి సిగరెట్ తీసుకుని హేండ్‌బాగ్‌లో దేన్నో వెగకటం మొదలెట్టింది. రావు లైటర్‌తో ఆమె సిగరెట్ వెలిగించాడు.


అతని ముఖంలో గోచరించిన అయిష్టతను పసిగట్టి అంది వివియన్. "అయామ్ సారీసర్. మాచెస్ మర్చిపోయాను."

"డజన్ట్ మాటర్" అంటూ కూర్చున్నాడు రావ్.

కొన్ని నిముషాలు నిశ్శబ్దంగా గడిచిపోయినై.

వివియన్ చెప్పటం మొదలెట్టింది. "డాక్టర్ రావ్. మీరీ దేశం వచ్చిన తొలిరోజుల్లో మొట్టమొదటిసారి మిమ్మల్ని చూసినప్పుడే నాకు మీరంటే అమితమైన గౌరవం, అభిమానం, ప్రేమా ఏర్పడినై. ఈ విషయాన్ని ఎన్నోమార్లు మీతో విన్నవించుకున్నాను కాని, మీరు మాత్రం నేనంటే అయిష్టంగా వుంటూ నాకు చాలా కష్టం కలిగిస్తున్నారు. కనీసం వొక్కసారి, యస్, ఎట్ లీస్ట్ వన్స్ — మీతో డాన్స్ చేయాలనేకోర్కె నాలో బలీయంగా వుంది. మూడేళ్ళనుంచీ నాకోర్కె తీర్చలేదు మీరు. మరో రెండు రోజుల్లో ఎటూ మీ దేశానికి పోబోతున్నారు. ఈ రోజన్నా కాస్త వుల్లాసంగా నాతో గడుపుతారని ఆశిస్తున్నాను."

రావ్ తలెత్తి వివియన్ కళ్ళల్లోకి చూశాడు. ఆమె కళ్ళల్లో కాంక్ష, సిగ్గు, అసహాయత గోచరిస్తున్నా వాటిని వెనక్కి నెడుతూ ప్రాధేయత మాత్రమే వుట్టిపడుతున్నది. రావ్‌కు ఆమెను చూసి జాలి కలిగింది. సిగరెట్ వెలిగించుకుంటూ అన్నాడు. "సారీ వివియన్. నేను నీతో డాన్స్ చేయలేదని నాపై నేరారోపిస్తున్నావుగాని, నేనీ మూడేళ్ళలో ఏ యువతితోనైనా డాన్స్ చేస్తూ వుండగా



చూసిన వాళ్ళెవరైనా వున్నారా అనే విషయం ఆలోచించు. నాకలాంటి యాక్టివిటీస్ మీద యింట్రెస్ట్ లేదు. అంతేగాని నువ్వంటే అయిష్టత కాదు. దీన్ని గురించి నువ్వింతగా బాధపడుతున్నందుకు నేను చాలా విచారిస్తున్నాను. మా దేశంలో ఆచారాలను గురించి చెప్పినిగదా."

వివియన్ చిరుకోపాన్నభినయిస్తూ "నువ్వు వట్టి యిండియన్‌వి రావ్" అంది.

"'ఏ దేశమేగినా ఎందుకాలిడినా' నే కోరుకునేది యీ గౌరవమే"— తెలుగులో అనుకున్నాడు రావ్.

"మీ భాషలో నన్ను దూషిస్తున్నారా ఏం? తిట్టదలచుకుంటే ఇంగ్లీషులోనే తిట్టండి. నేనేమీ అనుకోను" అంది వివియన్.

రావ్ సిగరెట్ యాష్‌ట్రేలో పడేసి నవ్వుతూ అన్నాడు "నో నో. నువ్వు చూపే గౌరవానికీ, ఆప్యాయతకూ తిట్లను బహూకరించేటంత మూర్ఖుడుకాడీ తెలుగువాడు."

వివియన్ తమాషాగా నవ్వేసింది. రావ్‌కూడా ఆమెతో శృతి కలిపాడు. కొద్దిక్షణాలు కాగానే వివియన్ రావు కూర్చున్న సోఫాలోకివచ్చి అతనిప్రక్కగా కూర్చుంది.

"ఏంవిటి విషయం?" అన్నట్లు ఆమెవైపు చూశాడు రావు.

వివియన్ అతని చేతిని తన చేతి

లోకి తీసుకుని నొక్కుతూ "ప్లీజ్" అని ఏదో చెప్పబోయింది.

ఇంతలో "ఐయామ్ వెరీ సారీ వివియన్" అంటూ లేచాడు రావు. వివియన్ నిస్సహాయురాలైంది.

విసవిస లేచి బాగ్ తీసుకుని "దట్సాల్ రైట్. మిమ్మల్ని ఎల్లుండి ఏరోడ్రోమ్‌లో కలుసుకుంటాను" అంటూ గబగబ నడుస్తూ వెళ్ళిపోయింది.

రావు ఆమె వెళ్తున్నవైపు చూస్తూ అలాగే వుండిపోయాడు కొన్నిక్షణాల సేపు. తర్వాత తెప్పరిల్లుకొని తన కర్తవ్యాన్ని గుర్తుచేసుకున్నాడు. రూమ్‌లో తన సామానంతా సర్దటం మొదలెట్టాడు. ఏదో చేస్తున్నాడన్న మాటేగాని అతని ఆలోచనంతా అనేక విషయాలమీద వుంది.

అమెరికన్లు, వారి స్వరూప స్వభావాలనుగురించి ఆలోచిస్తున్నా, అంతలోనే ఇండియామీదకు మళ్ళుతున్నది అతని మనస్సు. "నే నిచ్చిన కేబుల్ యీపాటికి చేరేవుంటుంది. కరుణాకరం ఏం చేస్తున్నాడో?" అనుకుంటూ సోఫాలో కూలబడ్డాడు రావు.

• • •

జేబులోనుంచి కాంతారావిచ్చిన టెలిగ్రామ్‌ను తీసి మళ్ళీ చదువుకున్నాడు కరుణాకరం.

"సక్సెస్ ఇన్ ఫ్లయింగ్ కలర్స్. స్టార్టింగ్ ఆన్ ఫస్ట్"

నిన్నగాక మొన్న వెళ్ళినట్టుంది కాంతం. ఇంతలో ఎంతవాడైనాడు? సాహిత్యంలో పి హెచ్. డి. తీసుకుని దొరబాబులా రాబోతున్నాడు. తనూవున్నాడు, ఎందుకూ? — ఉద్యోగంగుమాస్తాగిరీ, ఉనికి మురికిపేటల మూలకొంపలో. అందుకనే కాంతం వస్తున్నాడంటేఏదో ఆందోళనగా ఉంది తనకు. విదేశాల్లో పట్టా పుచ్చుకుని గొప్పవాడై వస్తున్న కాంతాన్ని తానెలాఆహ్వానించగలడు? ఆదరించగలడు?

కరుణాకరానికి తన స్థితికి తనకే సిగ్గు కలుగుతున్నది. కాని, కాంతం తనకు ఆప్తమిత్రుడు. "భారతదేశంలో అడుగుపెట్టగానే తొలిసారి నాకు మీ ముగ్గురూ కనపడాలి. కామేశాన్ని, కళ్యాణినీ కలుసుకుని, వాళ్ళకీ సంగతి చెప్ప"మని యిదివరకే రాశాడు కాంతం. తనంటే అంతటి ఆప్యాయత చూపే మిత్రుణ్ణి రిసీవు చేసుకుని ఆతిధ్యమివ్వకుండా ఎలా వుండగలడు తను? ఉండలేడు కనుకనే నానా అవస్థలూపడి కామేశాన్ని కల్యాణినీ కలుసుకుని కాంతం రాకసంగతి తెలియజేశాడు.

కరుణాకరం ఆలోచన చిన్నతనం మీదికి మళ్ళింది. తమ "క" కార చతుష్టయాన్ని "తోడుదొంగ"లని ముద్దుగా పిలుస్తూ వుండేవాళ్ళు చాలామంది. నలుగురిలోనూ కాంతం లక్ష్మీపుత్రుడు; కామేశం ఆర్థికంగా ఏబాధాలేనివాడు, కళ్యాణి మధ్యతరగతి ఉద్యోగి పుత్రిక. ఎటొచ్చీ తనే ఆర్థిక వ్యవస్థ అనే పగ్గపు వుచ్చులో చిక్కుకున్నవాడు. ఫస్టుఫారం మొదలు ఇంటర్‌వరకూ తాము నలుగురూ కలిసి చదువుకున్నారు. అక్కడ తమ దారులు వేరయినాయి. కాంతారావు బియ్యే ఆనర్స్‌లో చేరాడు. కామేశం బి ఇ. చదవటానికి మద్రాసు వెళ్ళిపోయాడు. కల్యాణి వాళ్ళనాన్నకు ట్రాన్స్‌ఫర్ కావటంతో కాకినాడ వెళ్ళటం, బియ్యస్సీలో చేరటం జరిగింది. తాను మాత్రం మధ్యంతరంగా చదువుకు స్వస్తి చెప్పి వుదరపోషణకు దారులు వెతకవలసి వచ్చింది. హఠాత్తుగా నాన్న పోవటం, రాధ పెళ్ళికెదిగి కూర్చోవటం — ఇవన్నీ తానూ వాళ్ళలా చదువు కొనసాగించలేక పోవటానికి మూలమైన కారణాలలో కొన్ని మాత్రమే.

"అసలు చిన్నతనంనుంచీ నా ఖర్మిలాగే కాలింది ప్చ్" అని నిట్టూర్చాడు కరుణాకరం.

కరుణాకరంతో సంబంధం వుండి, అతని జీవిత విశేషాలు తెలిసిన వాళ్ళెవరైనాసరే అతనిని "కష్టజీవి" అనే అంటారు. అసలు అతని జీవితచరిత్రను గ్రాఫ్ గీసి చూస్తే మన కగుపించేది పూర్తిగా వక్రరేఖే. అతని తండ్రి ఏదో కంపెనీలో వర్కరుగా పనిచేసూ వుండేవాడు. చాలీచాలని జీతంతో సంసారాన్ని సాగించటమే కష్టం కాగా, కరుణాకరాన్ని అసలు కాలేజీ చదువులో చేర్చనే వద్దని భావించాడు అతని తండ్రి. కాని, కరుణాకరం గట్టిగా పట్టుబట్టి కాలేజీలో చేరాడు. ఎలాగైనా సరే తన పేరు ప్రక్కన ఎం. ఏ. అనే మరో రెండక్షరాలను కలుపుకోవాలనేది అతని జీవితపు ఆశయం కావటంతో కరుణాకరం కాలేజీ ఫీజు మొదలైన తనకవసరమైన ధనాన్ని చందాల రూపంలో సేకరించుకునేవాడు. మిత్రుని విద్యాభిలాషకు సంతోషించి అడపాదడపా ఆర్థిక సహాయం చేస్తూ అతనికి తన వుత్సాహ ప్రోత్సాహాల్నిస్తూ వుండేవాడు కాంతారావు.

కరుణాకరం ఆశయాలు, ఆదర్శాలు, వూహాలు, కలలూ ఆకాశాన్నంటుతూ వుండేవి అవన్నీ వినిసన్నగా నవ్వి వూరుకునేవాళ్ళు కామేశం, కల్యాణీ. కాంతారావు మాత్రం "ఎందుకురా అలాంటి ముందాలోచనలుచేస్తూకూర్చోవటం. అన్నీ మనం కోరుకున్నట్లు జరుగకపోతే తర్వాత తీరనిబాధ మిగులుతుంది" అనేవాడు. వెంటనే ప్రారంభమయ్యేది పెద్ద చర్చ.

"అసలు నన్నడిగితే మానవుడు ఆశాజీవి అంటాను. ఆశించటం మానవుడి జన్మహక్కు. దేన్నయినా సాధించాలనే "యాంబిషన్" లేకుంటే జీవితంలో మనం వున్నతస్థితికి పోనేలేము. అంతేకాక మరో ముఖ్య విషయమేమిటంటే "ఆశ, కోరిక" అనేవే నశిస్తే "పురోభివృద్ధి" అనే పదమే నిఘంటువులనుంచే తొలగించాల్సి వస్తుంది" — ఉపన్యాసధోరణిలో యీ విధంగా గంటలతరబడి చెప్పుకుపోయేవాడు కరుణాకరం. దాన్ని ఖండించేవాడు కాంతారావు.

"అలా ఎన్నెన్నో ఆలోచించుకుని ఫస్టుక్లాసులో ప్రయాణాలు చేస్తూ ప్లాట్‌ఫారాలమీద జాలీగా తిరుగుతూ జీవితాన్ని గడపాలని కోరుకో బట్టే యిలావుంది నా గతి" అని పించింది కరుణాకరానికి.

కామేశం, కల్యాణీల మీొదికి మళ్ళిం దాతని మనస్సు. కామేశం నాగార్జునసాగర్‌లో ఇంజనీరు. ఓ పెద్ద బంగళా, అందమైన భార్య, ఇద్దరు పిల్లలు, కార్లలో కాంప్‌లకు తిరగటుం—అదృష్టవంతుడు!

కాంతం రాకసంగతి చెప్పటానికి నిన్న తను వెళ్ళేసరికి యింట్లోలేడు. ఏదో వూరు పోయ[illegible]. వాడి సతీమణి చాలా మంచిగా మాట్లాడి గౌరవించింది. "సాయంత్రం వస్తారు, వుండ"మని బలవంతం చేసిందికాని, తనే టైమ్‌లేదని వుత్తరం వ్రాసిచ్చి వచ్చేశాడు. అక్కణ్ణుంచి కల్యాణి వుండే వూరెళ్ళాడు ఆమె సమితిలో ఎన్. ఇ. ఒ.గా పనిచేస్తున్నది. తను వెళ్ళేసరికి ఎవరో మహిళల్ని కూర్చోబెట్టి వుపన్యాస మిస్తోంది.. తనను చూసి చాలా అప్యాయంగా ఆహ్వానించి, ఎన్నెన్నో విషయాల్ని మాట్లాడింది. తనంటే చిన్నతనంనుంచీ కల్యాణికి అదోవిధమైన అభిమానం. ఆమె అంటే తనకూ అంతే. కల్యాణి ఆకారంలో ఎంతో మార్పు గోచరించినా, ఆ మాటల్లో చలాకీతనం, కళ్ళల్లో చిలిపితనంమాత్రం పోలేదు. చక్రాల్లాంటి కళ్ళు త్రిప్పుతూ చిన్ననాటి ముచ్చట్లుచెప్పింది. తామిద్దరూ పిచ్చుక గూళ్ళు కట్టడం మొదలు రైలుబండి ఆటలాడు కోవటం వరకూ ఎన్నెన్నో చెప్పింది. అవన్నీ వినేసరికి తన మనస్సెంతో దూరం [illegible]గెంతింది. కళ్యాణితో తన స్నేహం కలకాలం నిలిచిపోవాలి. ఆమెతో తానా విధంగా రోజూ ఆడుకోవాలి.

డాబామీద పండువెన్నెల్లో తన కెదురుగా కూర్చుని కబుర్లు చెప్తున్నది కళ్యాణి.

ఎన్నెన్నో విషయాలు! ఆమె మాట్లాడుతుంటే తను మూగవాడై పోవాలసిందే! ఆమె వాక్ప్రవాహ ధారల్లో మున్కలు వేస్తుంది తన హృదయం.

కళ్యాణి ప్రక్కకు జరిగి ఆమె కళ్ళల్లో కళ్ళుపెట్టి "నీ మాటల తీయదనాన్ని నాసొత్తు చేయవా కళ్యాణీ" అంటూ ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని ఆప్యాయంగా నొక్కాడు. నునుసిగ్గుతో మొహాన్ని చేతుల్లో దాచుకుని, వ్రేళ్ళ సందునుంచి అరమోడ్పు కళ్ళతో చూస్తూ అంది కళ్యాణి. "అంతకన్న నా జీవితానికి కావలసిన దేముంది? నే నెప్పుడూ మీదాన్నే."

"నేను ధన్యుణ్ణి కళ్యాణీ. నేను ధన్యుణ్ణి కళ్యాణీ."

చేతులు రెండూసాచి, ముందుకు లేచి కళ్ళు తెరచిన కరుణాకరం, స్వాప్నిక జగత్తు నుంచీ యీలోకంలో పడ్డాడు. మొహాన పట్టిన చెమటను తుడుచుకున్నాడు. తనుకన్న కల నిజం అయితే తాను ధన్యుడే!—.

"ఏంవిటీ కల?" అనుకుంటూ ప్రక్కమీద పడుకుని అటూ యిటూ పొర్లసాగేడు.

● ● ●


బేగంపేట విమానాశ్రయంలో ఆగింది విమానం. డాక్టర్ రావ్ లైట్ గ్రీన్ సూట్‌లో పెదవులపై మందహాసంతో విమానంలోనుంచిదిగాడు. చేతుల్లో పూలమాలలు వుచ్చుకుని ఎదురుగా నిలబడివున్న ముగ్గురు మిత్రుల్ని చూసి అతని కళ్ళు ఆనందంతో మిలమిలలాడాయి. చిరునవ్వుతో చేయి వూపుతూ వాళ్ళ దగ్గర కొచ్చాడు రావు. ముగ్గురూ అతన్ని పూలమాలల్లో ముంచేశారు. సంతోషంతో వుక్కిరిబిక్కిరైనరావు వాళ్ళను పరామర్శించే సరికి చాలా సేవు పట్టింది.

"ప్రపంచంలో ఏ మూలకు పోయినా, నా హృదయంలో వో మూల కూర్చుని నే చూసినవన్నీ చూస్తూనే వున్నాడు కరుణాకరం"

రావు మాటలకు కరుణాకరం మనస్సు వుప్పొంగిపోయింది.

"ఏరా, కామూ నవభారత నిర్మాణంలో ఎంత బిజీగావున్నా, కనీసం నీ 'వెరబౌట్స్' అన్నా తెలియజేయకపోతే ఎలారా?"

"ఆఁ... అదే... నేనూ చాలా ఫీలవుతున్నాను. ఎక్కడా..."



కామేశం యివ్వబోయే సంజాయిషీని మధ్యలోనే త్రుంచేసి, "ఏం కల్యాణీ, గొగుపుల్ల అరటి బోదెగా మారిందే" అనికల్యాణిని ప్రశ్నించాడు రావు.

అందరూ గలగలమని నవ్వుతూ ముందుకు సాగారు. కారు స్టార్టు చేస్తూ అడిగాడు కామేశం, "ఏరా

అమెరికా పోయొచ్చినా నీలో ఏఁవీ మార్పు రాలేదే!"

"ఏ విషయంలోరా?" రావు ఎదురు ప్రశ్న వేశాడు.

"అన్ని విషయాల్లో... ఆకారంలో, మాటల్లో" అంది కల్యాణి.

"ఓ, అదా–అక్కడ మనంకార్లలో తిరిగి పదిమంది మీద అజమాయిషీ చేసే వుద్యోగాలేవీ చేయలేదు గదా" అన్నాడు రావు.

కామేశం మొహం ముడుచుకున్నాడు.

"ఏఁ ఏందోయ్, మిమ్మల్నే. బాగానే పాడుస్తున్నారు" అంది కల్యాణి కామేశం సీటుమీదకు వొరుగుతూ.

అంతా నవ్వేసి వూరుకున్నారు. కారు రంయ్‌న సాగిపోతున్నది. వెనక సీట్లో రావ్ ప్రక్కగా కల్యాణి, ఆమె ప్రక్కగా కరుణాకరం కూర్చున్నారు.

కారు నగరంలో ప్రవేశించింది.

"మీ నాన్నగారికి పక్షవాతంటుగదా కల్యాణీ. ఆ మధ్య కరుణ రాశాడు. వారి ఆరోగ్యం యిప్పుడెలా వుంది? మీ తమ్ముడి దగ్గరేవా వుండటం, లేక నీ దగ్గరేనా?" మౌనాన్ని భంగపరుస్తూ అడిగాడు రావ్.

"ఆఁ. అలాగే వున్నారు. గుంటూర్లో తమ్ముడి దగ్గరే వున్నారు" కల్యాణి చెప్పింది.

"ఏరా కామూ. మీ శ్రీమతి ఏమంటున్నది? ఇప్పటికన్నా ఆవిడ కాస్త మాట్లాడటం నేర్చుకుందా లేదా? మీ మాష్టర్ ఎలావున్నాడు? అన్నట్టు ప్రోగ్రెస్ ఏమైనా వుందా?"

చిరునవ్వు నవ్వాడు కామేశం "బొత్తిగా మాట్లాడదురా కాంతం అంతే నువ్వానాడన్నావే–ఏదీ ఇవాళ యిలాగే వుంటుంది. ఇంకా కొన్నాళ్లు పోనీ మాచెల్లి నీకు వినుగెత్తేటట్లు కబుర్లు చెప్తుందని. అక్షరాలా అదే. జరిగింది. అబ్బ ఇప్పుడు వొకటే "సొద" అనుకో. ఇక హరి మామయ్యతో కుస్తీకి సిద్ధంగా వున్నాడు. జాగ్రత్త. పోతే నెంబర్‌టూ రమకి రెండేళ్ళు."

ఊఁ కొడుతూ కామేశంమాటల్ని విన్న రావ్ సీట్లో వెనక్కు వాలాడు. కళ్యాణి సీట్లో ఆ ప్రక్కకు జరిగి వుఁడటంతో ఆమె భుజానికి రావ్ భుజం తగిలింది. ఇద్దరూ వొకర్నొకరు చూసుకున్నారు. కల్యాణి సిగ్గుపడి పోయింది. ప్రక్కకు జరిగి పైట సరిచేసుకుని ముందుకు కూర్చుంది. ఆమె బుగ్గలమీద లేత గులాబీరంగు ఛాయలు కదలాడటం, పెదవులు మృదువుగా కంపించటం పసిగట్టి బయటకు చూస్తూ వుండిపోయాడు రావ్.

కారు హోటల్ ముందుకు తీసుకొచ్చి పార్క్ చేశాడు కామేశం.

అంతా కార్లోంచి దిగగానే "ఏరోయ్, నువ్వూ మాతోనే వచ్చావా?" అన్న రావు ప్రశ్నకు

అందరూ దిగ్భ్రమ చెంది వొకళ్ళ మొహాలొకళ్ళు చూసుకున్నారు.

"ఏవిటిరా అలా నిర్ఘాంతపోతారు. మన కరుణ మనతోనే వచ్చాడా అనే అనుమానమొచ్చింది. లేకపోతే ఏమిట్రా మూగనోము పట్టినవాడిలా అలా కూర్చున్నావు, కార్లో" అని కరుణ భుజంతట్టూ హోటల్లోకి సాగాడు రావు.

"ఓరి నీ వేట్లు పాడుగానూ. చంపేశావే" అంటూ నడిచాడు కామేశం.

కల్యాణి గలగలా నవ్వేసింది. కరుణాకరం యిబ్బందిగా చిరునవ్వు నవ్వి రావును అనుసరించాడు.

కాఫీలు ముగించి బయటికి రాగానే అన్నాడు కామేశం "నాకు కొంచెం అర్జంటుపనివుందిరా కాంతం. మంత్రిగారి విజిట్ వుంది. నిన్ను రిసీవుచేసుకోవటానికే చాలా కష్టం మీద రాగలిగాను. వెళ్ళిపోతున్నందుకు ఏఁవీ అనుకోకు. మళ్ళీ మాటవుదాం. ఎల్లుండి నేనే వచ్చి తీసుకుపోతాను. అన్నట్టు నువ్వుందేది తాజ్‌లోనేగదూ."

రావ్ నిరాశచెంది జవాబు చెప్పలేక పోయాడు మూగగా కామేశం కళ్ళల్లోకి చూస్తూ వుండిపోయాడు.

"కాదు. రేపటికి మావూరు చేరుకుంటాం. మీరు సరాసరి అక్కడికే రండి."

కల్యాణి మాటకు కరుణాకరం, రావ్ ఆమెవైపు తేరిపార చూశారు. అయితే ఏఁవీ చెప్పలేక పోయారు.

కల్యాణి టాక్సీ పిలిచి రావ్ సామానంతా టాక్సీలో పెట్టించింది. కామేశం టా టా చెప్పి వెళ్ళిపోయాడు.

కామేశం ప్రవర్తనకు రావు బాధపడుతున్నాడని కరుణాకరం, కల్యాణీ యిద్దరూ గుర్తించారు. కాని ఏ విధంగానూ కామేశాన్ని సమర్థించలేకపోయారు. చివరికి కరుణాకరమే అన్నాడు.

"వాడి వుద్యోగం అలాంటిదిరా. ఏం చేస్తాం."

రావు తెప్పరిల్లుకుని "యస్. యస్. వాడి వుద్యోగం అలాంటిది. ఐనా చిన్ననాటి మమతలు చిరస్థాయిగా వుంటాయనుకోవటం కూడా కొంత అత్యాశే పదండి" అన్నాడు.

"ఎక్కడికి?" అనే ప్రశ్న ఎదురైంది.

కరుణాకరం జవాబు చెప్పలేక పోయాడు. అతనికి మనస్సులో సంశయం కలిగింది. "కాంతాన్ని తన రూముకు తీసుకుపోవటమా, లేక ఏ హోటల్లో నన్నా దిగమనటమా?" అని హృదయంలో ఏదో బాధపీకింది. ధైర్యంచేసి అన్నాడు: "ఎక్కడికేవిటి? మా రూమ్‌కే"

"ఆఁ. మళ్ళీ రూమ్ కెందుకండీ ఏకంగా హోటల్లోనే వుంటే పోదూ" అంది కల్యాణి.

వీరిద్దరూ మాట్లాడుతుండగానే టాక్సీలో ఎక్కి కూర్చున్నాడు రావు. కల్యాణీ, కరుణాకరం [illegible] లోపలి కొచ్చారు.

టాక్సీ కరుణాకరంగారూముందు ఆగింది. అంతా దిగి లోపలికి వచ్చారు. గదినంతా కలయచూసిన తర్వాత రావు తను వచ్చినప్పట్నుంచీ కరుణాకరం మనస్సులో మధన పడిన కారణం తెలుసుకోగలిగాడు కాని, కరుణాకరం ఈ విషయాన్ని గురించి యింతగా బాధపడటంబాగా లేదనిపించింది రావుకు. ఆ గదితో ఎంతో పరిచయం వున్నవాడిలా ఏ మాత్రం బెరుకులేకుండా తన కార్యక్రమం ప్రారంభించాడు రావు. స్నానాదికాల్ని ముగించి ముచ్చట్లలోకి దిగారు ముగ్గురూ.

రావు సిగరెట్ వెలిగిస్తూ అన్నాడు. "నీకింత బిడియమైతే ఎలారా కరుణా? ఏం నేనేమన్నా పరాయివాణ్నా ఏమిటి? లోలోపల అంతగా కుళ్ళుతావేం. అయినా అంత బాధపడటానికి నీగది కేమొచ్చింది. దివ్యంగావుంది. అరేభాయ్ మనసు మంచీ పంచుకోవాలిగానీ, ఏగూట్లో వుంటేఏరా? నాపాలనీఅంతే. పోనీలే నీతత్వం నాకు తెలుసుగా" అంటూ అంతలోనేవిషయం మార్చి విదేశాల కబుర్లు చెప్పసాగాడు.

వస్తుతః మాటకారియైన రావు మాట్లాడుతుంటే నోరు తెఱుచుకుని ఆ విశేషాలన్నీ వినసాగేడు కరుణాకరం. కల్యాణి మధ్య మధ్య ఏవో అడుగుతూ, రావు చెప్పే కబుర్లమీద శ్రద్ధ కనపరచింది.

"జాన్సన్‌కూడా నీలాగే వుండేవాడు. అతనికి ఏవేవో కోరికలున్నాయి. కాని, అవి తీరని కోరికలుగా మిగిలిపోయాయి. నేవస్తుంటే "ఎప్పటికైనా భారతదేశం వస్తాననే ఆశ మాత్రం వీడను డాక్టర్. ఇవాళ జరగని మహత్కార్యం ఏనాటికీ జరగదని ఎందుకు నిస్పృహ చెందాలి?" అన్నాడు. ఎందుకూ?— అచ్చు నువ్వెంతో అతనూ అంతేననుకో." రావు చెప్పుకు పోతున్నాడు.

కరుణాకరం హృదయంలో ఎన్నెన్నో ఆలోచనల సంచలనం రేగింది. తానాశించిన వేవీ జరుగక పోయినా, తన ఆశ ప్రతిబింబాన్ని, తన కోరికలకు రూపాన్ని కాంతంలో చూస్తున్నా డీనాడు. అదే తనకు సంతోషం. తనకు లేకపోయినా, ఆ అదృష్టం తన ఆప్తమిత్రుణ్ణి వరించింది. ఇంతకంటే యింకేం కావాలి?—

"జాన్సన్ అంటూ వుండేవాడు. "నే కోరిన కోరికల్లో ఏవీ నెరవేరక పోయినా, అందమైన యువతిని మాత్రం భార్యగా పొందుతాను డాక్టర్" అని. అలాగే నీకుకూడా నువ్వు వూహించుకున్న అందమైనపిల్ల భార్యగా వస్తుందనే నమ్మకంనాకుంది. అసలు ప్రేమించిన యువతి అనుకూలవతియైన భార్యగావస్తే పురుషుడికి స్వర్గం లభించినట్లే గదరా, కరుణా" అని అంతలో కల్యాణి వైపు తిరిగి అడిగాడు రావు "ఏమంటావు కల్యాణీ" అంటూ.

"అక్షరాలా నిజం" దృఢంగా అంది కల్యాణి రావు కళ్ళల్లోకి అదోలా చూస్తూ. అంతలోనే వాచీ



చూసుకుని "భోజనానికి టైమయింది లేవండి" అంది.

ముగ్గురూ లేచి హోటల్‌కి బయల్దేరారు.

భోజనాలు ముగించుకుని కరుణాకరం, రావు గది కొచ్చారు. కల్యాణి ఎక్కడో ఆఫీసులో పనిచూసుకుని సాయంత్రం వస్తానని వెళ్ళింది. గది కొచ్చి కూర్చున్న రావు కరుణాకరంతో కొన్ని ఆంతరంగిక సమస్యలను చర్చించటం మొదలెట్టాడు.

"ఆ కామేశంగాడు పెద్ద గొప్పవాడైపోయాడే చిన్నప్పుడు ఏవేవో కోస్తూ వుండేవాడు నత్తిగంటయినా వుండకుండా వుడాయించాడే వాడు. నీతోనూ అలాగేవుంటాడా?"

కరుణాకరం కొంచెం సేపు తటపటాయించి అన్నాడు 'నాతో ఆ మాత్రం మాట్లాడటానికి కూడా కష్టంగానే వుంటుంది. ఎవరికైనా అంతే గదరా కాంతం. తనకంటే తక్కువ వాడితో ఎక్కువగా ఏది మాట్లాడినా ఎక్కడ మన సహాయాన్నాశిస్తాడోనని భయమేగదా'

'ఊఁ' అని నిట్టూర్చి విషయం మార్చాడు రావు. 'అమ్మా నాన్నా లేరుగదా. అది చెప్పటానికని ఎన్నాళ్ళలా బ్రహ్మచారివిగా వుంటావురా. పెళ్ళి సంగతేఁవిటి?'

కరుణాకరం పేలవంగా నవ్వేశాడు. 'నువ్వింందాక ఏదో శుభాకాంక్షల్ని తెలియజేస్తుంటివే. ఆ శుభదినాన్ని రానీ' అన్నాడు.

రావు కొంచెంసేపు ఆలోచించి 'ఓ అదా కోరుకున్న అందమైన అమ్మాయి భార్యగా రావాలనేగా. అయితే యింతకీ నీవుద్దేశ్యమేమిటి?' అన్నాడు.

రావు ప్రశ్నకు ప్రశ్నార్థకంగా అతని కళ్ళల్లోకి చూశాడు కరుణాకరం.

'నీ మనస్సులో మాట నాకు తెలుసనుకో అయినా నీ నోటనే వినాలనుంది. చెప్పు.'

'నువ్వే చెప్పు చూద్దాం' అన్నాడు కరుణాకరం కొంచెం సిగ్గుపడుతూ.

'కల్యాణి నీ మనస్సాకట్టింది గదూ. బయటికి చెప్పుకోకుండా నీలోవున్న కోరిక యిదేనని నా అభిప్రాయం. అవునా?'

కరుణాకరం కొద్ది క్షణాలు మౌనం వహించాడు. తలవంచుకుని 'అవును' అన్నాడు చివరికి.

'ఆఁ. నాకుతెలుసు చిన్నప్పట్నుంచీ నీకామెమీద ప్రత్యేకమైన అనురాగం వుంది. మరి ఆమె ఏఁవంటున్నది?'

'కల్యాణి దగ్గఱ నేనెప్పుడూ యీ ప్రస్తావన తేలేదు.' అన్నాడు కరుణాకరం.

రావు అడిగాడు 'అయితే నన్ను కనుక్కోమంటావా? నీకు మాత్రం నేను తప్ప కావలసిన వాళ్ళెవరున్నారు. ఏమంటావు?'

ఊఁకొట్టి వూరుకున్నాడు కరుణాకరం.

'కల్యాణి చదువు, సంస్కారంగల యువతి. పైగా వుద్యోగం చేస్తున్నది. నీవూ వొకింటి వాడివై నాలాంటి వాళ్ళకు యింతకంటే గొప్ప ఆతిథ్యం యివ్వవచ్చు ఇప్పుడు నువ్వనుభవించిన బాధంతా వుండకుండా పోతుంది'

రావు మాటలకు సన్నగా నవ్వాడు కరుణాకరం.

'కరుణాకరం ఆశలన్నీ మారినా, ఇదైనా నెరవేరేటట్లు చూడటం మిత్రుడుగా నా కర్తవ్యం.' అనుకుంటూ లేచాడు రావు.

ఆవేళ సాయంత్రం కల్యాణీ, రావు కలిసి గోల్కొండకు షికారు వెళ్లారు.

కోటంతా చూసి వొకచోటకూర్చుని పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్న సమయంలో కల్యాణితో పెళ్ళి విషయం కదిపాడు రావు. ఆమె సిగ్గుపడి, 'ఇప్పుడు నా పెళ్ళికేం తొందర?' అంది

రావు కొంచెం గట్టిగానే అడిగాడు, 'కరుణాకరమంటే నీ అభిప్రాయమేఁవిటి కల్యాణీ?'

ఆమె అదోలా రావువైపు చూసి అంది, 'మంచి స్నేహితులు.'

'అది సరే, నేనడిగేది వివాహాన్ని గురించి... అంటే నీవు అతన్ని వివాహం చేసుకోవటం—'

కల్యాణి అతనిమాటల్ని త్రుంచేస్తూ 'నన్ను గురించి మీ అభిప్రాయమేఁవిటి?' అంది.

రావు కొంచెం గాభరాపడ్డాడు. ఏం చెప్పాలో అర్థంకాలేదు. కొద్ది క్షణాలు ఆలోచించి అన్నాడు. 'మంచి స్నేహితురాలివి.'

కల్యాణి చిత్రంగానవ్వింది. రావుకేసి విలాసంగా చూసి 'తమాషాగా మాట్లాడటం నేర్చుకున్నారే. ఎలాగైనా చతురులు' అంది.

రావు మౌనంగా వుండిపోయాడు. సంభాషణ సరళంగా తనకు కావలసిన దారిలో సాగటంలేదని గ్రహించి కల్యాణి హృదయం తెలుసుకోవటమెలాగా అని ఆలోచించసాగేడు రావు.

ఇంతలో కల్యాణి అడిగింది 'అందరి పెళ్ళిళ్ళను గురించి విచారిస్తున్నారు. మరి మీ పెళ్ళి సంగతేఁవిటి?'

'ఎక్కడన్నా వుద్యోగం రావాలి గదా'

గడ్డి పరకల్ని త్రుంచి మునిపంటితో కొరుకుతూ, తలవంచి క్రీగంట రావును పరీక్షిస్తూ కూర్చుంది కల్యాణి. ఆమె అంతరంగంలోకూడా అనేక విషయాలు అటూ యిటూ దొరలసాగేయి. మౌనంగా కాలం గడిచిపోతున్నది.

చివరికి రావు చెప్పాడు 'కరుణాకరం సంగతి నీకు తెలియందికాదు కల్యాణీ. చిన్నతనంనుంచీ ఎన్నెన్నో కోరుకుని, అంతకంత ఆశాభంగం పొంది కష్టాలను అనుభవించాడు. మొదట్నుంచీ నువ్వంటే వాడికి అభిమానం. నీకు గుర్తుందో లేదో. చిన్నప్పుడు చిలక కొట్టిన జామకాయల్ని అందరం తినేవాళ్ళం. కాని, నువ్వు వాడు కోరికి యిచ్చిన పండయినా ఏ అభ్యంతరం లేకుండా తినేదానివి. అదే మళ్ళీ కామేశం, నా విషయంలో "మీ ఎంగిలితింటానా" అని హోరాహోరీ పోరాడేదానివి. అలా వాడికి నీమీద ఏర్పడిన అభిమానం ప్రేమగా మారింది. బ్రతుకులో బరువులు [illegible] వుంటాయిగాని, వాటిని భరిం[illegible] శక్తినిచ్చేవి కూడా కొన్ని [illegible] కరుణ కన్నకలలు, [illegible] వాడి [illegible] నే నమ్మి [illegible]

కరుణ జీవితాన్ని నందనవనం చేయమని నిర్ణయిస్తున్నాను."

కల్యాణి రావు మాటలు విని "ఫారెన్ పోయొచ్చినా మీరు తెలుగు మాత్రం మరిచిపోలేదే. పెద్ద పెద్ద పదాలు వుపయోగిస్తున్నారు." అని ఆలోచనలో పడింది.

కొద్ది క్షణాలైన తర్వాత అన్నది కల్యాణి. "ఇలాంటి రోజు తప్పక వస్తుందనీ ఈ ప్రశ్నకు నేను సమాధానం చెప్పవలసి వస్తుందనీ నాకు తెలుసు. అందుకనే నేను చాలాకాలం ఆలోచించి వొక నిర్ణయానికి వచ్చాను."

రావు ఆతురతగా కల్యాణి కళ్ళల్లోకి చూశాడు.

"కరుణాకరం మీ అందరిలోకీ కొన్ని విషయాల్లో ఉన్నతుడే. వారిని నేను ప్రేమించగలను గౌరవించగలను. కాని ఆ ప్రేమ భావం వేరు వైవాహిక సంబంధమైన బంధానికీ, ఆ అనురాగానికీ ఏ మాత్రం పొత్తులేదు. వారిని నేను వివాహం చేసుకోలేను."

రావు నిరాశతో కూలిపోయాడు. ఒడలంతా చెమటలుపట్టి మనిషి చల్లబడి పోయాడు.

క్షణాలు కాలగర్భంలో కలిసి పోతున్నై. పశ్చిమాన సూర్యుడు అస్తమించ బోతున్నాడు.

కల్యాణి రావుకు దగ్గఱగా జరిగి "మీ మనస్సును కష్ట పెట్టినందుకు మన్నించండి" అంది. రావు మూగగా ఆమె కళ్ళల్లోకి చూశాడు ఆమె తలవంచుకుని అడిగింది. "చిన్నతనం నుంచీ మీ ముగ్గురిలోనూ, నాకు మీరంటే ప్రేమా, అనురాగం నెలకొన్నాయి. దాన్ని మీరు గుర్తించలేదు కాని, నా హృదయంలో మీరూపం, నా భావనలో మీవ్యక్తిత్వమ హెూత్కృష్టమైన స్థానాన్ని ఆక్రమించాయి. ఈ అనురాగలతకు మీరు ఆధారమైనా బ్రతుకు తోటలో పూలుపండిస్తారనే ప్రగాఢవాంఛ నాకుంది."

కల్యాణి మాట్లాడింది ఆమె హృదయంలో ఆవేదనో లేక ఏ కథలోని పలుకులో అర్థంకాలేదు రావుకు. ఆమె మాటలకు స్తంభీభూతుడై పోయాడు.


కొది క్షణాలైన తర్వాత కల్యాణి మళ్ళీ ఁడిగింది "ఏమంటారు?"

రావు హృదయంలో స్పందన హెచ్చింది. అతని కళ్ళెదుట వివియన్ నిలిచింది. అతని మనస్సులో రకరకాల వూహాలు అల్లుకున్నాయి. చివరికి మాటలు కూడబలుక్కుని అన్నాడు "అసంభవం కల్యాణీ. అలా ఎన్నటికీ జరగదు."

మరో కొద్దిసేపటికి యిద్దరూ ఖారంగా లేచారు. బయల్దేరబోతూ చివరిసారిగా మళ్ళీ అడిగాడు రావు "అయితే యీ విషయాన్ని గురించి నువ్వు పునరాలోచించవలసిన అవసరంలేదా కల్యాణీ?"

కల్యాణి తల అడ్డంగా త్రిప్పుతూ "ఊఁహు" అంది.

వారిరువురు ముందుకు నడిచారు.



ఇద్దరి నిట్టూర్పులూ గాలిలో కలిసి పోయాయి.

• • •

రావుకు సాగర్ యూనివర్శిటీలో ఉద్యోగమై వెళ్ళిపోయేముందు కరుణాకరం స్థితికి చాలా వగచాడు. అతనికి ధైర్యం చెప్పాడు "ఏదెలా జరిగినా గుండె దిటవు చేసుకుని బ్రతకాలిరా కరుణా. అనవసరంగా మనస్సు పాడుచేసుకోక, బ్రతుకును పూలబాటుగా మార్చుకోటానికి ప్రయత్నించు."

కరుణాకరం పేలవంగా నవ్వి వూరుకున్నాడు.

పై ఘటన జరిగిన సంవత్సరానికి రావుకు ఖాజీపేట ప్లాట్ ఫారం మీద కలిశాడు కరుణాకరం. ఇద్దరూ వొకర్ని గురించి వొకళ్ళు క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. రావు పెళ్ళికి రాలేకపోయినందుకు కరుణాకరం ఏదో సాకు చెప్పాడు అదే ప్రశ్న కరుణాకరం వేస్తే రావు కూడా అలాంటి సమాధానమే చెప్పాడు.

"మా శ్రీమతిని తీసుకుని మూర్తి గారి దగ్గఱకు పోతున్నాను గారినివిరా" అంటూ కరుణాకరాన్ని రైలుదగ్గరకు తీసుకు పోయాడు.

ఫస్టుక్లాసు కంపార్ట్‌మెంట్‌లో కూర్చుని ఏదో యింగ్లీషు మేగజైన్ తిరగవేస్తున్న ఆమెని చూశాడు కరుణాకరం. మేలిమి బంగారు ఛాయలో, దానికి తగిన అలంకరణతో అప్సరసలా మెరిసి పోతున్నది ఆమె. మొహంలో కళ, కళ్ళల్లో కాంతి – చూపరుల్ని విచలితుల్ని చేసేటట్లున్నాయి. ఆమెను చూడగానే కరుణాకరం మనస్సులో ఏదో పునీతభావం కలిగింది. రావు పరిచయం చేస్తుంటే హృదయపూర్వకంగా రెండు చేతులూ ఎత్తి ఆమెకు నమస్కరించాడు కరుణాకరం.

కొద్ది క్షణాల తర్వాత అన్నాడు కరుణాకరం. "మా అత్తగారుపోయి పదమూడురోజులేఅయింది. కర్మాంతరాలు ముగిసినై. హైదరాబాద్ వెళ్తున్నాం. రండి మాఆవిడ్ని చూద్దురుగాని."

వెయిటింగ్ రూమ్ వైపు దారి తీశాడు కరుణాకరం. ఆమె కూడా కంపార్ట్‌మెంట్ దిగివచ్చింది. అంతా కలిసి వెయిటింగ్ రూమ్‌లోకి వచ్చారు. కరుణాకరం తన భార్యను వాళ్ళకు పరిచయం చేశాడు.

రావు ఆమెనుపరీక్షగాచూశాడు. అతని హృదయం కలతచెంది ఆ బాధ మొహంలో ప్రస్ఫుటమైంది. ఏమీ మాట్లాడలేక పోయాడు "వస్తా" నని శెలవు తీసుకుని వచ్చి రైల్లో కూర్చున్నాడు. భార్యకూడా అతన్ని అనుసరించింది.

కరుణాకరం, అతనిభార్య కంపార్ట్‌మెంట్ ఎదుటనిలబడి ఏదోమాట్లాడుతున్నారు. కాని రావుకు ఆమాటలేమీ వినిపించటం లేదు. కంచీదెబ్బ తిన్న గుర్రంలా వుందతని మనస్సు.

గార్డు విజిలేసి పచ్చజెండా వూపాడు. ఇంజన్ కూత వేసింది. కరుణాకరం అతని భార్య తమకు వీడ్కోలిచ్చి వెళ్ళిపోతున్నారు.

రైలు సాగింది.

వెళ్తున్న భార్యాభర్తల్ని చూస్తూ గొణుక్కున్నాడు రావు, "అందగత్తె కాకపోతే పోయె, వొంటినిండా ఆ మసూచికపు మచ్చల్లేకుండా వుండకూడదూ. పాడువిధి! కొందరి జీవితాలమీద అంతగా ఎందుకు కక్ష కట్టాడో?"

రావు కర్చీఫ్ తీసి కళ్ళు తుడుచుకున్నాడు.

అతని కంటినుంచి రాలిన కన్నీటి బొట్టును చూసి ఏంతోచిందో ఏమో సన్నగా నవ్వుకుంది అతని సతీమణి.

□□□

రచయితలకు మనవి

'జ్యోతి'కి రచనలు పంపేవారు అవి నిరాకరింపబడిన పక్షంలోవాటిని త్రిప్పి పంపగోరితే రచనలతోపాటు తగినన్ని స్టాంపులను జతచేసి పంపించాలని మనవి. రచనతోపాటు కాక తరువాత స్టాంపులు పంపవద్దని, అట్టివారికి రచనలు త్రిప్పి పంపడం కష్టసాధ్యమని గుర్తించాలని కూడా మా విజ్ఞప్తి.

— మేనేజింగ్ ఎడిటర్.

శిఖరాలూ సరిహద్దులూ

సీరియల్

(గతసంచిక తరువాయి)

30

మేజర్ రాయ్‌కి ఆపరేషన్ చేయటం పూర్తయింది. డాక్టర్లు వెళ్ళిపోయారు. లలిత అతనికి కట్లు కట్టుతోంది. మేజర్ ఆమె నెమ్మదితనాన్ని గమనిస్తున్నాడు. ఆమె ముఖంలోని భావాలను చదువుతున్నాడు. ఆమె మధ్యమధ్య అతని ముఖంకేసి చూస్తూ అతడు తననే గమనిస్తున్నాడని తెలుసుకుని మళ్ళీ కళ్ళు వాల్చేసుకుంటోంది.

మేజర్ నవ్వుతూ అన్నాడు, "అన్ని వందల మైళ్ళ దూరంనుంచి సరిగ్గా నేను గాయపడేసమయానికి చేరారు. చాలా తమాషాగా వుంది. ఈ రోజు ప్రాణాలతో తిరిగిరాగలమని అనుకోలేదు. బహుశ మిమ్మల్ని చూసే యోగం వున్నందువల్లనే తిరిగివచ్చానేమో. ప్రసాద్ ఎప్పుడూ మిమ్మల్ని గురించి చెబుతూవుండేవాడు. మీ ఫోటోలవల్ల, మీ ఉత్తరాలవల్ల మీ స్వభావాన్ని, మీ నడక, మీ మాట తీరు అన్నీ వూహించుకునేవాడిని. నా ఊహ నిజమే అయింది."

లలిత మాట్లాడే ధైర్యంలేక, ఏం మాట్లాడాలో తెలీక సిగ్గుతో మౌనంగా వుండిపోయింది. మళ్ళీ అతనే అన్నాడు : "యుద్ధం మనుషుల్ని తమాషాగా కలుపుతుంది, విడదీస్తుంది. ఒకే కుటుంబంలోనివాళ్ళు విడిపోతారు. వేరు వేరు కుటుంబాల వాళ్ళు కలుస్తారు. ఎన్నో వందల మైళ్ళ దూరంలో ఎక్కడెక్కడో వుండేవారు, ఒకరికొకరు ఏమీ తెలియనివారు ఒక్కచోట కలిసి, ఒక్క కుటుంబంగా మెలగుతారు. వాళ్ళ అనుబంధం గాఢంకాగానే మళ్ళీ విడిపోతారు. ఒక్కొక్కప్పుడు మృత్యువే విడదీస్తుంది. అందుకే యుద్ధజీవులు మమతలకు అతీతంగా వుండాలి.

వాళ్ళ సంబంధాలు తామరాకుమీద నీటిబొట్టులాగా వుండాలి. కానీ, వాళ్ళూ మనుషులేకనుక సహజంగా వాళ్ళకి మమతలు ఉంటాయి.

లలిత తలవంచుకునే అంది "మా కుటుంబం విషయం అంతే అయింది. యుద్ధం వల్లనే మా అమ్మ చచ్చిపోయింది. నాన్నను ఒంటరివాణ్ణిచేసి నేనూ, అన్నయ్యా ఇక్కడికి వచ్చేశాము. ఇక్కడ మీరు కలిశారు."

ఇంతలో కల్నల్ అక్కడికి వచ్చారు. ఆయన ఏదో బాధపడుతున్నట్లు గ్రహించాడు మేజర్.

"నీగాయం ఎలావుంది మేజర్?" అని పరామర్శించాడు కల్నల్.

"అబ్బె-అట్టే బాధలేదు కల్నల్. రెండు రోజుల్లో బాగైపోతుంది." కల్నల్ ఇంకేదో చెప్పాలని, చెప్పలేకపోతున్నట్లు కనిపెట్టాడు మేజర్.

"నాయక్ సింగ్ మరణించాడు మేజర్." అన్నాడు కల్నల్.

"అవును విన్నాను. నిజంగా అంత గొప్పవీరుణ్ణి నేను ఎక్కడా చూడలేదు. వ్యక్తిగాకూడా అతను చాలా ఉన్నతమైనవాడు. అతని మరణవార్త చాలా బాధకలిగిస్తోంది. ఇంత విజయోత్సాహంలోనూ అతను లేని వెలితి కనిపిస్తూనే ఉంది."

"నాయక్ భార్య కాశీలో విశ్వేశ్వరాలయం దగ్గర నివసిస్తోందిట."

"అవును కల్నల్. ఆమెవిషయం నేనూ ఆలోచించాను. ఆమెకు ఇప్పుడు "నా" అన్నవాళ్ళెవరూ లేరు. బహుశా ఆమె కాశీ విడిచిరాదేమో. ఆమె అంగీకరిస్తే మాత్రం తప్పకుండా ఆమెను నా తల్లిగా స్వీకరిస్తాను. నాకూ తల్లి లేదన్న దిగులు తీరుతుంది. ఇక్కడ నుంచి బైటపడగలిగితే ముందుగా ఆమెనే కలుసుకుంటాను."

"నా అభిప్రాయాన్ని చక్కగా గ్రహించావు మేజర్. నేను కోరేదీ అంతకంటే ఏమీలేదు" అన్నాడు కల్నల్ కృతజ్ఞత ఉట్టిపడేటట్లు.

మేజర్ ఔదార్యానికి లలిత ముగ్ధురాలయింది.

31

తెల్లవారింది. చైనావారు యుద్ధ విరమణను ప్రతిపాదించినట్లు ఢిల్లీ కేంద్ర కార్యాలయంనుంచి కల్నల్‌కు వర్తమానం అందింది. ఈ విషయం తెలియ జేయడానికై ఆయన ఆఫీసర్లందరినీ సమావేశ పరిచారు. ఈ వార్త వినగానే అందరి ముఖాలు వికసించాయి.

"ఈ విషయంలో చైనానుపూర్తిగా నమ్మటానికి వీల్లేదు. ఇందులో బొత్తిగా కపటం లేకుండాపోదు. ఈ విరమణ తాత్కాలికమే కావచ్చు. మనం ఎప్పుడూ దాడి నెదుర్కోడానికి సిద్ధంగా ఉండవలసిందే. అయితే కనీసం కొన్నిరోజుల వరకైనా దాడి ప్రమాదం ఉండదనుకుంటాను" అన్నారు కల్నల్.

ఇంతలో ఒకవ్యక్తి తూలుతూ వచ్చి అక్కడ కూలిపోయాడు. అందరూ ఆశ్చర్యంగా అతనివంక చూశారు. అతని దుస్తులన్నీపూర్తిగా తడిసిపోయి ఉన్నాయి. ఒంటినిండా గాయాలు, నెత్తురు మరకలు ఉన్నాయి అతను జమేదార్ దౌలత్‌సింగ్.

"జమేదార్ నువ్వా! ఏమిటిది? ఎక్కణ్ణించి వస్తున్నావు? ఏం జరిగింది?" అని గాభరాగా అడిగాడు కల్నల్.

"చైనావాళ్ళ దగ్గర్నుంచి తప్పించుకు వచ్చానుసార్. మనవాళ్ళు అక్కడ చాలామంది ఉన్నారు. చైనావాళ్ళు దారుణంగా చిత్రహింస చేస్తున్నారు. రాజీని పరమ కిరాతకంగా హింసపెట్టి చంపేశారు సార్."

శివరామ్‌కు ఒక్కసారిగా నెత్తిమీద పిడుగుపడినట్లయింది. కుప్పగా కూలిపోయాడు. కల్నల్ నిలువెల్లా కంపించిపోయాడు. ఒక్క నిమిషం ఎవ్వరూ మాట్లాడలేకపోయారు. అంత దారుణమైన వార్త తమ జీవితంలో ఎన్నడూ వినలేదు వాళ్ళు.


"అసలు ఇదంతా ఎల్లా జరిగింది జమేదార్? రాజీ తనగుడిసెకె వెళ్ళిందిగా మధ్యాహ్నం? నువ్వు ఎల్లా పట్టుబడ్డావు అసలు?" కల్నల్ ఆత్రుతగా అడిగాడు.

"రాజీని ఎక్కణ్ణించిఎత్తుకొచ్చారో తెలీదు సార్. చైనావాళ్ళలో కొందరికి మన యూనిఫారము లున్నాయి. మన యూనిఫారంలోవున్న ఒకడు రాజీని కాళ్ళు, చేతులు, నోరు కట్టేసి మోసుకు వచ్చాడు. తర్వాత కట్లు ఊడతీసి నానా చిత్రహింస పెట్టారు సార్. కసిగా వాళ్ళేవో బండబూతులు తిట్టారు. వాళ్ళ భాష నాకు తెలీలేదు. చేతులు మెలిపెట్టి, చేతివేళ్ళని బూట్లతో పచ్చడి పచ్చడిగా తొక్కి, ఇనపచువ్వలు కాల్చి వాతలు పెట్టి మహా భయంకరంగా హింసించారు. చివరికి చెట్టుకు కట్టేసి తుపాకితో కాల్చి చంపారు సార్. మనవాళ్ళల్లో యింకా చాలామందిని అలాగే చేస్తున్నారు. నేను మొన్నటి యుద్ధంలోనే వాళ్ళకిఖైదీగా చిక్కాను. నా వంతు హింస రాకముందే వాళ్ళ కన్ను కప్పి తప్పించుకువచ్చాను."

అతను చెబుతున్న ఒక్కొక్క మాట ఒక్కొక్క బల్లెపు పోటులా తగిలింది కల్నల్‌కు. ఆయన వేదనకు అంతులేదు. రాజీమీదా, నాయక్ మీదా ఆయన విపరీతమైన అభిమానం పెంచుకున్నారు. చివరికి దాని పర్యవసానం యిలా అయింది. శివరామ్ కేవలం జీవచ్ఛవం అయిపోయాడు. రాజీ మరణవార్త స్థావరంలో సైనికు లందరికీ తెలిసింది.

రెడ్‌క్రాస్ వర్కర్లు యుద్ధరంగం నుంచి శవాలను, క్షతగాత్రులను తీసుకువస్తున్నారు. నాయక్ శవాన్ని స్ట్రెచెర్‌మీద తీసుకువచ్చి కల్నల్

నండూరి పార్థసారథి



ఎదుట వుంచారు. కల్నల్ ఆ శవం మీది ముసుగును తొలగించి మహా వీరుని ముఖాన్ని చూశారు. ఆయన కన్నుల వెంట కారిన కన్నీరు నాయక్ గడ్డాన్ని తడిపి వేసింది. ఆయన వంగి నాయక్ నుదుటుముద్దు పెట్టుకున్నారు. స్ట్రెచర్ అక్కడనుంచి కదిలి పోయింది.

కెప్టెన్ ప్రసాద్ కల్నల్‌వద్ద అనుమతి తీసుకుని సీమాను చూడటానికి జీప్‌లో బయలుదేరాడు. స్థావరానికి కొద్ది దూరంలో ఒక చిన్న గుట్టమీద ఒంటరిగా విరాగిలాగా కూర్చున్న లెఫ్టినెంట్ శివరామ్ కనిపించాడు. కెప్టెన్ జీప్‌ను అక్కడ ఆపి, అతని దగ్గరకు వెళ్ళాడు. లెఫ్టినెంట్ కదలేదు, మాట్లాడలేదు. అసలు అతని మొహంలో ఏ భావమూ కనిపించలేదు. ప్రపంచంలోని దేని మీద అసక్తిలేని వాడిలాగా దేనితోనూ నిమిత్తం లేనివాడిలాగా ఉన్నాడు. కెప్టెన్ స్నేహంగా అతని భుజంమీద చెయ్యి వేసి నిమిరాడు. చిన్న తమ్ముణ్ణి లాలించినట్లు అతని శిరస్సును తన హృదయానికి హత్తుకున్నాడు. 'నువ్వు సైనికుడివి శివరామ్. దేశరక్షణకు అంకితమైన వాడివి. నువ్వు ఇలా కాకూడదు. నువ్వు నీ కోసం కాదు– దేశం కోసం. రాజీని ఎంతగా ప్రేమించావో దేశాన్ని అంతగా ప్రేమించు. ఈ దేశమే నీ రాజీ అయితే రక్షించుకోవా? ప్రేమ మనిషిని క్రుంగతీయకూడదు – మనిషికి చైతన్యశక్తి నివ్వాలి. ధర్మం కోసం రాజీ జీవితాన్ని అంకితం చేసింది. ఆమెను ఆరాధించిన నీకూ అదే కర్తవ్యం, అదే ధర్మం' అన్నాడు. లెఫ్టినెంట్ చలించాడు. 'సారీ కెప్టెన్' అంటూ తనను తను మేల్కొలుపుకున్నాడు. కెప్టెన్ అతని భుజంతట్టి గుట్టదిగివచ్చి జీప్‌లో కూర్చున్నాడు.

జీప్ వెళ్ళినవైపు చూస్తూ ఉండిపోయాడు లెఫ్టినెంట్ శివరామ్.

సమాప్తం

తప్పెవరిది?

వేసవి ఎండ తీక్షణంగా వుంది. అప్పుడు టైం సుమారు మూడుగంటలై వుంటుంది. బందర్లో ఎవరినో కలుసుకుని అతనితో ఏదో ముఖ్యమైన విషయాన్ని గూర్చి మాట్లాడాలని సుధాకర్ స్కూటర్‌మీద మహావేగంతో వొస్తున్నాడు.

దారిలో ఏదో పల్లెటూరది. సుధాకర్ దాదాపావూరి చివరికొచ్చేసరికి అక్కడో మంచినీళ్ళబావి, ప్రక్కనే బక్కెట్లూ కన్పించాయి. అసలే అతనికి దాహంగా వుందేమో! బావి కన్పించేసరికి అతనికెక్కడలేని దాహం పుట్టుకొచ్చింది. వెంటనే రోడ్డు పక్క చింత చెట్టు క్రింద స్కూటర్‌దిగి, దానికి స్టాండువేసి బావిని సమీపించి తృప్తిగా కడుపునిండా నీళ్ళుతాగి ఆ చల్లని నీటితో మొహం తడుపుకుని రుమాల్తో చేతులూ మొహం తుడుచుకుంటూ ఆ చింత చెట్టు నీడ క్రింద నిలుచుని అలసట తీర్చుకుంటున్నాడు.

రోడ్డుమీద ఇంచుమించు పదేళ్ళలోపు కుర్రాళ్ళు ఒకర్నొకరు బంతితో కొట్టుకుంటూ రోడ్డుకడ్డంగా అటూ ఇటూ పరుగులుతీస్తూ ఆడుకుంటున్నారు. ఆ రోడ్డు కిరుప్రక్కలా కొద్దిగా ఇళ్ళున్నాయి. వాకిళ్ళముందర ఆపిల్లల తల్లులుగాబోలు చుట్టూ మరికొందరు అమ్మలక్కలతో కూర్చుని తమ పిల్లల ఆటనుచూస్తూ వాళ్ళు బంతితో ఒకర్నొకరు బాదుకొంటుంటే సరదాగా చప్పట్లు చరుస్తూ నవ్వుకుంటున్నారు.

ఈదృశ్యం సుధాకర్ కంటపడింది. కార్లు, లారీలూ, సైకిళ్ళు తెంపు లేకుండా తిరుగుతుండే ఈ రోడ్డు మీద నిర్భయంగా పిల్లలాడుకోవటాన్ని చూసి సుధాకర్ కొంచెం భయపడ్డాడు.

పిల్లల కేమైనా ప్రమాదం జరుగుతుందేమోనన్న భయం కూడా లేకుండా పెద్దవాళ్ళు సహితం వాళ్ళ ఆటని ఆసక్తిగా తిలకిస్తూ ఆనందిస్తున్నారేమిటాని సుధాకర్ ఆశ్చర్యపోయాడు. వాళ్ళమీద కోపం కూడా కలిగింది సుధాకర్‌కి. అలానే అటుకేసి చూస్తుండిపోయాడు.

ఇంతలో యిటువేపునుండి ఒక బస్సు రయ్‌మని రావడం పిల్లలంతా చెల్లాచెదురుగా పరిగెత్తడం, ఓ ఎనిమిదేళ్ళ కుర్రాడు మాత్రం రోడ్డు కడ్డంగా పరుగుతీయడం, డ్రైవర్ గట్టిగా బ్రేక్ తొక్కాడేమో బస్సు కిర్రుమని శబ్దంచేస్తూ ఆగిపోవడం అన్నీ తృటిలో జరిగిపోయాయి.

ఏం జరుగుతుందోనని ఖంగారుగా అటే చూస్తున్న సుధాకర్ కళ్ళకి ఆ కుర్రవాడి సుతిమెత్తని హృదయంపై రోలర్ బండలాంటి బస్సు టైర్లు బరువుగా దొర్లిపోవడం, ఆ పసిప్రాణం గిల గిల తన్నుకోడం అంతా స్పష్టంగా కన్పించింది. సుధాకర్‌కి ఒళ్ళు జలదరించి ఆ దృశ్యాన్ని చూడలేక కళ్ళు గుడ్డిగా మూసుకున్నాడు.

ఆ పిల్లవాడి తల్లి కాబోలు "అమ్మో నా బిడ్డ చచ్చిపోయాడు బాబోయ్... ..." అంటూ బిగరగా ఏడ్చుకుంటూ గుండెలు బాదుకుంటూ రోడ్డుమీదకి పరుగుతీసింది.

"బంగారంలాంటి పిల్లాణ్ణి పొట్టన బెట్టుకున్నాడు. ఈడి శిరుసు పగల! ఈడిజిమ్మదియ్య! ఈణ్ణి గోతిలో పెట్ట!" ఇలా వాళ్ళనోటికొచ్చిన విధంగా డ్రైవర్ని శాపనార్థాలు పెడుతూ రోడ్డుమీదికి పరుగులు తీశారు మిగిలిన అమ్మలక్కలంతా.


కాసేపటికి సుధాకర్ మామూలు మనిషై ఒక్క ఉరుకున అక్కడికి పరుగుతీశాడు. పిల్లవాడి తల, దేహం అంతా పచ్చడి పచ్చడి అయిపోయి రక్తపు మడుగైంది. ఆ భయంతో బీభత్స హృదయ విదారక దృశ్యానికి సుధాకర్ ఒళ్ళు గగుర్పొడిచింది. ఆ దారుణ సంఘటనకి అతని హృదయం బాధగా ఆక్రోశించింది. కళ్ళనుండి వేడి కన్నీటి బిందువులు ఉబికి వచ్చాయి.

అప్పటికి బస్సులోని ప్రయాణీకులంతా క్రిందకుదిగి బిలబిలమంటూ బాలుని శవంచుట్టూ చేరి నిర్ఘాంతపోయి చూస్తున్నారు. అప్పటికింకా ఆడవాళ్ళు చేతులాడిస్తూ కోపోద్రేకంతో డ్రైవర్ని తిడుతూనే వున్నారు. పిల్లవాడి తల్లి కొడుకు శవంమీదపడి గుండెలు పగిలిపోయేట్లు విలపిస్తోంది.

డ్రైవర్‌కి నలభై రెండు సంవత్సరాలకి మించివుండవు. అతను మహా ఆందోళనతో వచ్చి ఆ దృశ్యంకేసి చూస్తున్నాడు. సుధాకర్ హఠాత్తుగా డ్రైవర్‌కేసి చూశాడు.

డ్రైవర్ కళ్ళనిండా నీళ్ళునిల్చి వున్నాయి. మొహంలో భయాందోళన చిహ్నాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి మనిషి నిలువెల్లా కంపించిపోతున్నాడు. డ్రైవర్ని ఆస్థితిలో చూసిన

దొండపాటి దేవదాసు




అతనిమీద ఎంతో జాలి, విచారమూ కలిగాయి సుధాకర్‌కి.

ఇంతలో "తన్నండి, చంపండి, పొడవండి. వెధవకి నడపడం చేతకాదు వాడిబొంద లేదు, ఇలా ఎంతమంది ప్రాణాలు తీస్తాడు. పట్టుకోండి, చెట్టుకి కట్టేయండి." ఇలా పెద్దగా కేకలు పెడుతూ వొస్తున్నారు ఆ చుట్టు ప్రక్కల ఇళ్ళల్లోని మగాళ్ళు.

సుధాకర్ హఠాత్తుగా వాళ్ళవేపు చూశాడు. అప్పటికి వాళ్ళు చాలా దగ్గర కొచ్చారు రోషావేశాల్తో.

వాళ్ళేం చెయ్యబోతున్నారో గ్రహించి 'ఆగండి...' గట్టిగా అరిచాడు సుధాకర్. ఆ వచ్చినవాళ్లంతా మంత్ర ముగ్ధుల్లా ఎక్కడివాళ్ళక్కడ ఆగిపోయి సుధాకర్ మొహంలోకి ఆశ్చర్యంగా చూశారు.

"విధివశాత్తు జరిగిపోయింది. దానికెవరేం చేస్తారు! అయినా



ఇంతక్రితం పిల్లలంతా కార్లు తిరుగుతుండే ఈరోడ్డుమీద ఇష్టమొచ్చినట్లల్లా ఆడుకొంటుంటే మీరంతా వినోదంగా చూస్తుండిపోయారేగాని ఇలాంటి ప్రమాదమేదన్నా సంభవిస్తుందేమోన్న అనుమానం గానీ భయంగానీ మీకెవ్వరికి కలుగలేదుగాబోలు! పాపం ఇప్పుడు విచారించి ఏమిటి ప్రయోజనం? మీరంతా ఎలాగో ఓర్చుకుని ప్రశాంతంగా వుండండి. జరగవలసిన తతంగం తరువాత జరుగుతుంది" అన్నాడు సుధాకర్ గంభీరంగా.

అప్పటికి ధైర్యం కలిగిందేమో "జరిగిందేదో జరిగిపోయింది. ఇహ వూరుకోండి" అంటూనోళ్ళువిప్పారు బస్సు ప్రయాణీకులు.

అంతవరకూ మౌనంగా వున్న ఓ ప్రయాణికుడు నేలమాపులు చూస్తూ ఏదో ఆలోచిస్తున్న సుధాకర్ని సమీపించి "ఏం సుధాకర్! ఎందాకా ప్రయాణం? బందరేనా?" అంటూ అతని భుజం తట్టాడు.

సుధాకర్ ఉలిక్కిపడిచూసి "కృష్ణయ్యగారా?, అవునండి బందరు వెడుతున్నాను. అక్కడ [illegible] పేటలో ఒకతన్ని [illegible] చాలా ముఖ్యమైనపని" [illegible] సమాధానంగా.

ఈ మాటలు [illegible]

పడ్డాయి. ఒక్కసారి తన దృష్టిని సుధాకర్‌మీదికి పోనిచ్చాడు. అదే సమయంలో సుధాకర్ దృష్టికూడా డ్రైవర్‌మీదికి మళ్ళింది

డ్రైవర్ మొహంలో కన్పించిన దైన్యాన్ని, అతని జాలిగొలిపే చూపుల్ని భరించలేక సుధాకర్ గిరుక్కున వెనుదిరిగి తన స్కూటర్‌వేపు నడక సాగించాడు.

ఇంతలో హఠాత్తుగా డ్రైవర్ కేదో ఆలోచన తట్టి గబగబ నాలు గడుగులు ముందుకు వేసి 'ఏమండీ!' అని కేకేశాడు.

ఎవరాఅని సుధాకర్ వెనక్కు తిరిగి డ్రైవర్ని చూసి ఆశ్చర్యపోయాడు ఎందుకు పిల్చాడా అని.

డ్రైవర్ పరుగున సుధాకర్ని సమీపించి 'బాబూ! తమరు బందరు బుట్టాయపేటకదూ వెళ్తున్నారు?' వినయాన్ని ప్రదర్శిస్తూ ఆతృతగా అడిగాడు.

'అవును. ఏం?' ప్రశ్నార్థకంగా డ్రైవర్ మొహంలోకి చూశాడు సుధాకర్.

'ఐతే, బాబూ! తమరు నాకో చిన్న సాయం చేసిపెట్టాలి... ...' అంటుండగానే డ్రైవర్ కళ్ళలో నీళ్ళు నిండి స్రవించసాగాయి. దుఃఖంతో అతని గొంతు పూడిపోయింది. కొన్ని క్షణాలు అలానే మౌనంగా వుండి పోయాడు.

'ఏమిటో చెప్పండి. చెప్పకుండా లోలోపల బాధపడతారు దేనికి? త్వరగా చెప్పండి.వీలైతే తప్పకుండా చేస్తాను' ఓదార్పుగా అంటూ డ్రైవర్‌కి మరింత దగ్గరగా వెళ్ళి నిల్చున్నాడు సుధాకర్.

'నిన్నటి తెల్లవారుఝామున నా ఆరేళ్ళ పిల్లకి కొద్దిగాజ్వరమొచ్చింది. వెంటనే దగ్గర్లోవున్న డాక్టర్‌గారికి చూపించాను. ఆయనేదో టానిక్ వ్రాసిచ్చాడు. ఆ సమయంలో నా దగ్గర నయాపైసా లేదు. వెంటనే మా వీధిచివర్లోనే వుంటుండే నా మిత్రుడు చంద్రం దగ్గరకి వెళ్ళాను. కనీసం ఐదురూపాయలైనా అప్పిస్తాడేమోని. తీరా వెళ్ళి కనుక్కుంటే ఆయన ఆ తెల్లవారుఝాము బండికే ఏదో అర్జంటు పనిమీద విజయవాడ వెళ్ళాడని, మళ్ళీసాయంకాలానికిగానీ తిరిగిరాడని ఇంట్లో చెప్పారు. అప్పటికే నాకు డూటీ టైమైంది. మళ్ళీవచ్చి అన్నీ చూసుకోవచ్చులే అని డ్యూటీకొచ్చి హైదరాబాద్ వెళ్ళాను. మళ్ళీ ఇవాళ ఇప్పుడొస్తున్నాను. కానీ ఇప్పుడు ఇక్కడ నా ఖర్మ ఇలా కాలింది' అంటూ డ్రైవరు చేతుల్లో మొహం దాచుకొని విలపించడం ప్రారంభించాడు.

సుధాకర్ హృదయం ఆర్ద్రమై కళ్ళు చెమర్చాయి. 'అయితే నన్నేం చెయ్యమంటారు?' నెమ్మదిగా అడిగాడు.

డ్రైవర్ కళ్ళు తుడుచుకుని తీవ్ర ప్రయత్నం మీద గొంతుపెకల్చుకుని 'బాబూ! నేను కాపురం ఉంటున్నది కూడా బుట్టాయపేటే! మా యింటి అడ్రస్ ఇస్తాను. తమరు కాస్త శ్రమనుకోకుండా మాయింటి దాకావెళ్ళి మీరు నాకు బాగా తెలిసినవారని, నిన్న సాయంకాలం నేను మీకు హైదరాబాద్‌లో కన్పించి ఏదో అర్జంటు పనుండి అనుకున్న ప్రకారం ఇంటికి రాలేక పోయానని పిల్లకి జ్వరం మోపుగావుంటే చంద్రాన్నడిగి డబ్బు తీసుకోమన్నాననితమరు నా భార్యతో చెప్పాలి. ఇంతే ఈ కాస్త పని చెయ్యండి తమరిమేలు ఎన్నటికీ మర్చిపోలేను' అంటూ సుధాకర్ మొహంలోకి చూశాడు ఆశగా.

మనుషుల హృదయాల్లో వుండే బాధల్ని గ్రహించగల సుధాకర్ కి సమాచారం తెలిశాక అతని హృదయం ద్రవించి పోయింది. 'ఓ తప్పకుండా చెప్తాను. అడ్రస్ దీని మీద వ్రాసివ్వండి' అంటూ జేబులోంచి ఓ కాగితాన్ని కలాన్ని తీసి డ్రైవర్ చేతి కందించాడు.

డ్రైవర్ వినయంతో అందుకుని తనపేరు, ఇంటి అడ్రసూ వ్రాసిచ్చాడు. సుధాకర్ భద్రంగా జేబులో పెట్టుకుని బయల్దేర బోయాడు.

'బాబుగారూ... !' ఖంగారుగా పిల్చాడు డ్రైవర్. ఆశ్చర్యంగా అతని మొహంలోకి చూశాడు సుధాకర్.

'బాబుగారూ! ఇలా జరిగిందని మా యింట్లో పొరబాటునైనా చెప్పకండి. ఈ కేసువిషయం ప్రక్కవూరి పోలీసుస్టేషన్ కెళ్ళి రిపోర్టివ్వాలి. దీని వ్యవహారం ఎప్పటికి పూర్తవుతుందో... నేను త్వరలో వస్తానని మా యింట్లో...' ఆపైన మాట్లాడలేక పోయాడు డ్రైవర్. అతని కళ్ళనుండి అశ్రుకణాలు జల జల రాలాయి. కొంతసేపటితర్వాత గబగబ కళ్ళు తుడుచుకొని 'తమ సహాయాన్ని ఎన్నటికీ మర్చిపోనుబాబూ! సరే ఇక వుంటానండీ...!' అంటూ సుధాకర్‌కి వినయంగా వొంగి నమస్కరించి డ్రైవర్ భారంగా అడుగులువేస్తూ బస్సువేపు నడిచాడు. సుధాకర్ బరువుగా ఓ నిట్టూర్పు విడిచి స్కూటర్ వేపు సాగాడు.

ఏదైనా దార్లో ఇలాంటి ప్రమాదం జరిగితే వెంటనే అక్కడికి దగ్గర్లో వున్న పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి డ్రైవర్ గానీ, కండక్టర్‌గానీ రిపోర్టివ్వాలి! ఇప్పుడు ప్రమాదం జరిగిన చోటుకి బందరు పన్నెండుమైళ్ళకు పైగా వుంది.

సుధాకర్ యింకా పైనుండి ఒస్తున్నాడు. అతను ఇరవైమైళ్ళలోపు ప్రయాణానికి సామాన్యంగా స్కూటర్‌నే వినియోగిస్తాడు. సుధాకర్ వస్తున్న పని నిజంగా చాలా ముఖ్యమైనది. కానీ, ఇప్పుడు అత నెవర్నైనా [illegible] సుకోవాలని వస్తున్నాడో [illegible] కాస్తా సుధాకర్ దృష్టి [illegible] అదృశ్యమై, ఆ స్థా[illegible] భార్యా, పిల్ల[illegible] [illegible]న్నారు.

సుధాకర్ స్కూటర్ మహావేగంతో రోడ్డుమీద పరుగులు తీస్తోంది.

• • •

సుధాకర్ తనకు డ్రైవరిచ్చిన అడ్రస్ ప్రకారం అతని ఇల్లు తెలుసుకుని ఇంటి ముందర స్కూటర్ దిగి గుమ్మంవేపు చూశాడు. ఇంట్లో కొంతమంది ఆడవాళ్లు హడావుడిగా అటూఇటూ తిరుగుతున్నారు.

పాపం ఆయన కూతురు కేం ప్రమాదం జరగలేదుగదా? ఆందోళనగా అడుగులు ముందుకువేశాడు సుధాకర్. ఇంతలో లోపల్నుంచో నడివయస్కురాలు అతన్నిచూసి గబగబ వాకిట్లోకొచ్చి "ఎవరు కావాలండీ!" అని ప్రశ్నించింది.


"అది సరేగానీ ఇంట్లో ఏమిటి హడావుడి! ఇది డ్రైవర్ రామయ్యగారిల్లేకదూ!" అన్నాడు కొంచెం ఖంగారుపడుతూ.

"అవును బాబూ ఇదే! పాపం వాళ్ళ కొచ్చిన కష్టం ఏమని చెప్పమంటారు...?" ఆమె మాటలు పూర్తి కాకముందే "ఏమ్మా! అలా అంటున్నావ్? ఆయన కూతురి కెలా వుంది?" ఆందోళనగా అడిగాడు.

"ఆ పిల్లకి నిన్న పొద్దున కొద్దిగా జ్వరం తగిలింది. అదే తగ్గుతుందిలే అనుకున్నారో ఏమో? పాపం రామయ్యగారు మామూలుగా డ్యూటీకి హైదరాబాద్ వెళ్ళాడు. సరిగ్గా ఉదయం పదిగంటలయ్యే సరికి ఆ పిల్లకి జ్వరం ఇంకా ఎక్కువై దాంతోబాటు చిన్నబిడ్డభేష్ట వచ్చింది. అది తెలుసుకుని రామయ్య భార్య సీతమ్మ ఖంగారుగా మాయింటికి:పరుగెత్తుకొచ్చి విషయం చెప్పింది. ఇద్దరం పిల్లను తీసుకుని పెద్దాసుపత్రికి వెళ్లాం. అదృష్టవశాత్తు ఆ డాక్టర్‌గారెవరో మహానుభావుడు మంచి మందు వేయడంవల్ల ప్రమాదం తప్పింది. అప్పటికి సరిగ్గా రెండు గంటలయింది. అప్పటివరకూ మేం భోజనం చేయలేదు గనుక ఆకలనిపించి పిల్లని ప్రక్కవాళ్ళతో చూస్తుండమనిచెప్పి మేం ఇంటికొచ్చాం. ఇంతలో సీతమ్మ నిండు గర్భవతి గనుక ఆమెకు నొప్పులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికి రెండు గంటల నుంచి అవస్త పడుతున్నది. ఇంకా పిండం బయట పడలేదు. వాళ్ళాయన ఈ పాటికి డ్యూటీ దిగవలసింది మరెందుకనో ఇంకా రాలేదు. మీ రాయన్తో ఏమైనా పనుండి వచ్చారా?" అందామె.

డ్రైవర్ కుటుంబ పరిస్థితుల్ని విన్న తరవాత అతనికెంతో విచారమూ సానుభూతీ కలిగాయి. ఈవిషయాన్ని గురించే ఆలోచిస్తుండి పోయాడతను.

"ఏం బాబూ! మాట్లాడరేం?" అందామె. అప్పటికి సుధాకర్ ఆలోచనల నుండి తేరుకుని "ఆఁ... ఆఁ... నేనాయనకు బాగా తెలిసినవాణ్ణి! నిన్న సాయంకాలం నాకాయన హైదరాబాద్‌లో కన్పించి ఆయనకి అక్కడేదో అర్జంటు పనుందని,



త్వరలో వస్తానని ఇంట్లో చెప్పమన్నాడు. నాకీ వూళ్ళో చాలాముఖ్యమైన పనులుండడంవల్ల సరేనని వెంటనే బయల్దేరి వచ్చాను. ఆయన భార్యకిమ్మని నాచేతికి డబ్బుకూడా యిచ్చాడు" అన్నాడు సుధాకర్.

రామయ్య డబ్బిచ్చి మనిషిని పంపాడని తెలుసుకున్న ఆమె తన మొహాన్ని సంతోషంతో ఇంతచేసుకొని "సీతమ్మా! మీ ఆయనకి హైదరాబాద్‌లో ఏదో అర్జంటు పనుండి ఆగిపోయాడట,. త్వరలో వస్తానని నీకు" చెప్పమని డబ్బుకూడా యిచ్చి పంపాడట. అడుగో ఆ బాబుగారు [illegible] నిల్చొనివున్నారు" అంటూ లోపలికి వెళ్ళిపోయిందామె.

పాపం ఆమె రెండు గంటలనుండి నొప్పుల్తో బాధపడుతుంటే ఇక్కడున్న వారిలో ఒక్కరికైనా ఆమెను హాస్పిటల్ తీసుకెళ్ళాలన్న ఆలోచనే రాలేదా? ఒకవేళ అలాంటి అభిప్రాయం ఎవరికన్నాకలిగినా ఆ, మన కెందుకులేఅని వూరుకున్నారా? ఆలోచిస్తున్న సుధాకర్‌కి లోపల్నుండి హృదయ విదారకమైన మూల్గువిన్పించింది. ఆమె నిప్పుడు ఏం చేయాలన్న విషయం తను కూడా మర్చిపోయి మొద్దులా నిల్చున్నాడేమాని తన్ను తాను నిందించుకుని లోపలున్న ఆమెను కేకేశాడు. ఆమె "ఏం బాబూ" పిల్చారా?" అంటూ గుమ్మం దగ్గర కొచ్చింది.

'అవునమ్మా! నే నిప్పుడేవస్తాను సీతమ్మగార్ని హాస్పిటల్‌కి తీసుకెడదాం. సిద్ధం చెయ్యండి' అంటూ సుధాకర్ వెనుదిరిగి రోడ్డువేపుకి వెళ్ళి కాసేపట్లో ఓ రిక్షాని తీసుకొచ్చాడు.

ఈలోపుగా అక్కడున్న ఆడవాళ్ళు సీతమ్మని సిద్ధంచేసి నెమ్మదిగా నడిపించుకుంటూవచ్చి రిక్షాలో కూర్చోబెట్టారు.

'సుబ్బమ్మక్కా! కాస్త నువ్వు కూడా రామ్మా!' ఆ నడివయస్కురాల్ని వుద్దేశించి ప్రాధేయపూర్వకంగా అడిగింది సీతమ్మ.

'పాపం! కాస్త సహాయంగా మీరూ రండి సుబ్బమ్మగారూ!' అన్నాడు సుధాకర్. సుబ్బమ్మ కాదనలేకపోయింది. రిక్షా బయల్దేరింది గవర్నమెంటు హాస్పిటల్ కేసి. దానికి వెనుకే సుధాకర్ స్కూటర్ బర్... మని శబ్దంచేస్తూ బయల్దేరింది.

రిక్షా సరాసరి వచ్చి మెటర్నిటీ వార్డు గేటుముందరాగింది. సుధాకర్ స్కూటర్ దిగాడు. అప్పుడే గూర్ఖావాడు మెయిన్‌గేటుదగ్గర లోపల్నుండి బైటికొచ్చేవాళ్ళు, బైటనుండి లోపలి కెళ్ళేవాళ్ళు ఎక్కువమంది చేరివుండడంవల్ల అక్కడి కెళ్ళాడు.

'అడుగో! ఆ డాక్టర్‌గారే బాబూ! పొద్దున పిల్లకి సూదులేసింది' అంటూ మెయిన్‌గేటువేపు చెయ్యి చూపించింది సుబ్బమ్మ.

దూరంగా డాక్టర్ మూర్తి సైకిల్ మీద గేటువేపు వొస్తున్నాడు. వెతకబోయిన తీగ కాళ్ళకు తగిలినట్లు 'ఓ! మూర్తి సమయానికి కన్పించాడు. ఆయన నాకు తెలుసు. నేను మాట్లాడుతాను లేమ్మా!' సుబ్బమ్మతో అని సుధాకర్ మెయిన్‌గేటు వేపు ఆత్రంగా నడిచాడు.

అప్పుడే గేట్లోంచి బైటికొచ్చిన డాక్టర్ మూర్తి సుధాకర్ని చూసి "హల్లో మిస్టర్ సుధాకర్! ఎప్పుడు రావడం?' అంటూ ఠక్కున సైకిల్ దిగి సుధాకర్‌తో కరచాలనంచేశాడు.


సుధాకర్ సీతమ్మ పరిస్థితిని చెప్పి, మెటర్నిటీ వార్డులోని నర్సులతోనూ డాక్టర్లతోనూ ఆమె విషయంలో కాస్త జాగ్రత్త తీసుకోవలసిందిగా చెప్పిరమ్మని మూర్తిని అభ్యర్థించాడు.

'ఓ...అయితే వాళ్ళెవరు? నీకేమైనా బంధువులా సుధాకర్!' ప్రశ్నించాడు మూర్తి.

'ఆ విషయం నిదానంగా చెప్తాను. నువ్వు త్వరగా వెళ్ళు' అన్నాడు ఖంగారుగా.

'సరే! నువ్వామెను తీసుకు రామ్మా!' సుబ్బమ్మ నుద్దేశించిచెప్పి, మూర్తి లోపలికెళ్ళాడు. ఈలోపు సీతమ్మ కూతురిపేరు, ఏ వార్డులో వుంద మొదలైన వివరాలు సుబ్బమ్మ నడిగి తెలుసుకున్నాడు సుధాకర్. సుబ్బమ్మ సీతమ్మని నెమ్మదిగా లోపలికి నడిపించుకుపోయింది.

కాసేపట్లో డాక్టర్ మూర్తి తిరిగొచ్చి 'డోంట్ వర్రీ సుధాకర్! నేనన్నీ చెప్పి వచ్చాను.' అన్నాడు.



తరువాత సీతమ్మ కూతురు విషయం అడిగాడు సుధాకర్. ఆపిల్లని జ్ఞాపకం తెచ్చుకొని 'ఓ ఆ పిల్లా! ఆమెకేమీ పరవాలేదు. వాళ్ళు పరిస్థితిని త్వంగా తెలుసుకుని తీసుకువచ్చారు. అంచేత ప్రమాదం తప్పిపోయింది. వీళ్ళని గురించి నువ్వేమీ ఖంగారుపడకు. నేనన్నీ చూస్తాను. సరే మిస్టర్ సుధాకర్! నేను కాస్త అర్జంటు పనిమీద వెడుతున్నాను. మళ్ళీ కలుస్తా' అన్నాడు మూర్తి సైకిలెక్కబోతూ.

'థాంక్యూ వెరీమచ్' అన్నాడు సుధాకర్. మూర్తి చిరునవ్వు నవ్వి హడావుడిగా సైకిలెక్కి వెళ్ళిపోయాడు.

సుధాకర్ పాపంఉదయమెప్పుడో భోంచేశాడు. ఈ వ్యవహారంలో అతను తన ఆకల్ని మర్చిపోయాడు. ఇప్పుడుతనకి విపరీతమైన ఆకలి అనిపించి బజారు బయల్దేరాడు తనవాహనా న్నధిరోహించి. అతను టిఫిన్ కాఫీ ముగించి మళ్ళీ హాస్పిటల్‌కి బయల్దేర బోతుండగా ఓ మిత్రుడు కన్పించాడు. అతన్తో మాట్లాడి శలవు తీసుకుని మరి కొంచెం దూరం వెళ్ళేసరికి మరో తెలిసినాయన కన్పించాడు. మొత్తానికి మళ్ళా అతను హాస్పిటల్ చేరుకునే సరికి రెండుగంటలు గడిచిపోయాయి. గేటు ముందర స్కూటర్‌దిగి లోపలికి వెళ్ళబోయేసరికి వరండాలో నిల్చున్న సుబ్బమ్మ నవ్వుమొహంతో గబగబ అతని కెదురుగావచ్చి 'బాబుగారూ! మీరటు వెళ్ళిన గంటలోపు సీతమ్మ సుఖంగా ప్రసవమైంది. మగ పిల్లాడు

పుట్టాడు. తల్లీ పిల్లాడు బాగున్నారు. ఇంతకుముందు ఆ డాక్టరుగారు వాళ్ళతో మాట్లాడి వెళ్ళడంవల్ల వాళ్లు పనులు చాలా శ్రద్ధగా చూశారు. ఇంతకుముందే సీతమ్మ కూతుర్ని కూడా చూసివచ్చాను. బాగానే వుంది. చక్కగా మాట్లాడుతున్నది కూడా!' అంది.

ఇది విన్న తరువాత సుధాకర్‌కి నెత్తిమీద నుండి పెద్ద బరువుదించినట్లయి అతనికెంతో సంతోషం కలిగింది "అమ్మా! నేనోమాటు సీతమ్మగార్ని ఆమె పిల్లవాణ్ని చూసి వెళ్ళాలనుకుంటున్నాను" అన్నాడు ఎంతో ఉత్సాహంగా. "రండిబాబూ!" అంటూ సుబ్బమ్మ ముందు బయల్దేరింది. సుధాకర్ ఆమెననుసరించాడు.

"ఏమ్మా! ఎలావుంది ఒంట్లో!"

"బాబూ! మీరెవరో సమయానికి దేవుళ్ళావచ్చి ఆదుకున్నారు. మా జీవితంలో మర్చిపోలేం!" అంటూ సీతమ్మ రెండుచేతులెత్తి సుధాకర్‌కి నమస్కరించింది.

'ఛా... అదేమిటమ్మా! నేచేసిందేముంది? అంతా అపరమాత్ముడు చేశాడు.'

"బాబు గారూ! నేను మగ బిడ్డని కన్నానని మావారికి తెలిస్తే అబ్బ... ఎంత సంతోషపడతాడనుకున్నారు. కానీ పాపం సమయానికి లేకుండా పోయారు. చూడండి నా బుజ్జిబాబుని... ..." పిల్లాడి మీదున్న ముసుగును తొలగించింది సీతమ్మ ఆమె పక్కలో చందమామలా వెలిగిపోతున్న బుల్లిబాబుని విస్ఫారిత నేత్రాలతో తిలకించాడు సుధాకర్.

ఈ పసిబాలుని తండ్రి తనో హంతకుడుగానూ, ఘాతకుడుగానూ, ఇంకా పలు రకాలుగా దూషించబడుతున్నా డక్కడ. తను అందాల బాబుని కన్నదని ఎప్పుడు చెప్పాలాయనకు? ఆ ద్వారా ఆయన మొహంలో వ్యాపించే సంతోష రేఖల్ని తా నెప్పుడు చూడాలి. ఆయన ఆనందంతో పాలుపంచుకుని తా నెప్పుడు తృప్తి పడాలి? అని అతని రాకకోసం ఒళ్ళంతా కళ్ళు చేసుకుని ఆశగా ఎదురు చూస్తోంది అతని భార్య యిక్కడ. సుధాకర్‌కి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. రుమాల్తో చాటుగా తుడుచుకున్నాడు.

హఠాత్తుగా అతని కేదో గుర్తొచ్చి గభాల్న ప్యాంటుజేబులోంచి పర్సు బైటికి తీశాడు. అందులో నాలుగు పదులు బైటికి తీసి "మర్చిపోయా! ఇదిగోనమ్మా మీ ఆయనగా రిచ్చిన డబ్బు!" అంటూ చెయ్యి జాపాడు.

నిజంగా ఆ డబ్బు తన భర్త యిచ్చాడుకాబో లనుకుంది సీతమ్మ. తన పరిస్థితి తెలుసుగనుక ఎంతో దూరమాలోచించి డబ్బు పంపారాయన. నిజంగా ఆయనకు తనంటే ఎంత ప్రేమ! అనుకుంటూ సుధాకర్ చేతిలోంచి డబ్బందుకుని మరోసారి తన కృతజ్ఞతను వ్యక్తం చేసింది.

"సరే నే నిహ వెళ్ళొస్తానమ్మా!" అంటూ శలవుతీసుకుని వెనుదిరిగి అడుగులు వేసుకుంటూ వరండా చివర కొచ్చాడు సుధాకర్.

"బాబుగారూ! వెళ్ళిపోతున్నారా?" అంది సుబ్బమ్మ వెనకనించి.

"ఓ! సుబ్బమ్మగారా? రండి రండి!" అని మళ్ళీ పర్సుతీసి ఐదు రూపాయల నోటు బైటికితీసి "అమ్మా! సీతమ్మగారికి మీ రెంతగానో తోడ్పడ్డారు. అందుకు నే నెంతో సంతోషిస్తున్నాను. రేపు ఎవరికెలాటి స్థితివస్తుందో? ఏమైనా ఆపదసమయాల్లో మనుషులు ఒకరి కొకరు సహాయం చేసుకోడంకంటే గొప్ప విశేషం మరొక టేముంది?

సీతమ్మ హాస్పిటల్‌నుండి విడుదలయ్యేంతవరకు జాగ్రత్తగా చూస్తుండమ్మా! ఇదుగో ఈ అయిదు రూపాయలు తీసుకుని మీ పిల్లల కేమైనా కొనిపెట్టండి." అంటూ అయిదు రూపాయల కాగితాన్ని సుబ్బమ్మ కందించబోయాడు సుధాకర్.

'అదేమిటి బాబుగారూ! అన్నీ తెలిసిన మీరే ఇట్లాచేస్తే ఎట్లా! సీతమ్మ మంచితనం చూసే నేనామెతో స్నేహంచేస్తూ కలుపుగోలుతనంగా వుంటున్నా! మేమెంత పేదవాళ్ళమైనా మామనసు లట్లా కలిసిపోయాయి. అయినా డబ్బుతీసుకుని ఆమెకు సహాయపడతానా? లేకపోతే చెయ్యనా? అదేమిటి బాబుగారూ! మీరెప్పుడూ అట్లాఅనుకోకండి. పరవాలేదు మీ దగ్గరే వుంచండి."

"అట్టే అలా అనకమ్మా! నాసంతోషం కొద్దీ ఇస్తున్నాను పుచ్చుకోమ్మా! మీరేమీ అనుకోకండి." అన్నాడు సుధాకర్. ఆమె కాదనలేక తీసుకుంది. మొత్తానికి ఈ కాలపు మనిషి కాదనుకుంది సుబ్బమ్మ. వయసులో ఆమెకంటే చాలాచిన్నవాడు గనుక అతన్ని తన హృదయపూర్వకంగా ఆశీర్వదించింది మనస్సులోనే!

మధ్యాహ్నం జరిగిన సంఘటన ఒక్కసారి మళ్ళీ సుధాకర్ కళ్ళముందు కదలాడింది. తప్పతాగి డ్రైవ్‌చేసేవాళ్ళనీ, జనసమ్మర్దం హెచ్చుగా వున్నచోట్లకూడా స్పీడుగా పోవడమనేది ఓఘనంగా భావించే డ్రైవర్లని, మరీ అందులో నేర్చుకోకుండా ప్రమాదాలు కలిగించేట్లుచేసే వాళ్ళని కఠినంగా శిక్షించవల్సిందే! వాళ్ళని గురించి జాలిపడటం అనవసరం!

మరి మధ్యాహ్నం జరిగిన ప్రమాద సంఘటనకి కారకులెవరు? నిజంగా ఆ సంఘటనలో తప్పెవరిది?

హఠాత్తుగా సుధాకర్‌కి కళ్ళనిండా నీళ్ళు నింపుకుని భయాందోళనతో నిలువెల్లా కంపించిపోతూ ఆ భయంకర భీభత్సహృదయ విదారక దృశ్యాన్ని తిలకిస్తున్న డ్రైవర్ రామయ్య గుర్తొచ్చాడు. సుధాకర్ కళ్ళనుండి రెండు వేడి కన్నీటి బిందువులు బరువుగాజారి క్రిందకు దొర్లి పడ్డాయి.

మళ్ళీ తనా డ్రైవర్ని కలుసుకోలేదు! అతని దైన్యస్థితిని చూసి భరించలేదు తను! సుధాకర్ విచారభారంతో కృంగిపోతున్న తన శరీరాన్ని స్కూటర్‌మీద నెమ్మదిగా నిలబెట్టాడు. స్కూటర్‌కూడా కాసేపు బాధగా అరిచినా క్రమేపీ వేగాన్నందుకుంది...

□□□

కట్టు కథ

రామారావు నెత్తికి కట్టు కట్టుకుని ఆఫీసుకు వచ్చాడు. తోటి గుమాస్తాలంతా చుట్టూ మూగి "ఏమిటా కట్టు? అంత పెద్ద దెబ్బ ఎలా తగిలించుకున్నావ్?" అని ఆదుర్దాగా అడిగారు.


రామారావు వేదాంతిలా నిట్టూరుస్తూ "విషాదగాథ. వింటే బాధ" అన్నాడు.

"ఫరవాలేదు చెప్పు. నీ గాథలో బాధ మేంకూడా పంచుకుంటాం" అని ఒత్తిడి చేశారు మిత్రులు.


"పదేళ్ళకిందటి సంగతి అది నేను బి. ఏ. చదువుతున్న రోజులు. మా యింటిపక్కన పీడరుగారికి లక్షరూపాయిల ఆస్తి, లక్షణమైన కూతురూ వుండేవి. ఆ అమ్మాయి స్కూలుఫైనల్ చదువుతుండేది. నాకు పుస్తకాల పురుగనే బిరుదు, ఆ అమ్మాయికి వైజయంతీమాల అనే నిక్‌నేమ్ వుండేవి. నా బిరుదు సార్థకమని నాకు తెలుసుగాని, ఆ పిల్ల సంగతి నాకు తెలియదు. నేనెప్పుడూ ఆ అమ్మాయిని అంత పరిశీలనగా చూడలేదు. ఒక రోజు ఆ అమ్మాయి ఏదో లెక్క తెలియడంలేదని వచ్చి చెప్పించుకుని వెళ్ళింది. ఇలాగే రోజూ అది తెలియడంలేదు, ఇది అర్థం కావడంలేదని వచ్చి పాఠాలు చెప్పించుకునేది. నేను వరండాలో కూర్చుని చదువుకుంటుంటే "తుమ్మెదా ఒకసారి మోమెత్తి చూడమని... ..." అని అద్భుతంగా పాడేస్తూ నా చదువు డిస్టర్బ్ చేసేది. ఒకసారి ఏదో పుస్తకం కావాలని తీసుకెళ్ళి మర్నాడు మళ్ళీ యిచ్చేసింది. అందులో "నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. మీరుకూడా నన్ను ప్రేమిస్తుంటే మా నాన్నగారితో చెప్పి సంబంధం నిశ్చయం చేయిస్తాను" అంటూ అని ఏదో ఉత్తరం వుంది. నేను "ఎవరిదో ఉత్తరం నా పుస్తకంలోకి వచ్చిందమ్మాయ్" అని దాన్ని తిరిగి యిచ్చేశాను.

ఇవాళ పొద్దున మామూలుగా మా ఆవిడకి వంట్లో బాగా [illegible]దున మామూలుగా వంట చేస్తున్నాను. పొయ్యి మండడంలేదు. కూర వుడకడంలేదు. ఆఫీసు టైమయిపోతోంది. చేత్తో యిం[illegible] పుచ్చుకుని పులుసు కలియబెడుతున్నాను. హఠాత్తుగా [illegible] సంగతి జ్ఞాపకం వచ్చి ఆ ఉత్తరం నాకేనని అర్థమైంది. [illegible] బాదుతున్నాను. తల చిట్లింది. అయ్యో, అదీ విషయం."

— ఎ స్పెర్ —



వారి "సత్య హరిశ్చంద్ర"లో ఎస్. వరలక్ష్మి, మాస్టర్ బాబు, ఎస్. వి. రంగారావు, నాగయ్య, ఎ. వి. సుబ్బారావు



"సత్య హరిశ్చంద్ర"లో హాస్యానికి రెండు మారుపేర్లు రమణారెడ్డి, రేలంగి

* * *



కలహకంఠి గిరిజ, కాలకౌశికుడు రేలంగి



నిత్యహరితమైనకథ "సత్య హరిశ్చంద్ర"లో రామారావు, రాజశ్రీ, మీనాకుమారి.



"సత్య హరిశ్చంద్ర"లో రెండు విషాదభరిత సన్నివేశాలు



"నవ్వాలీ నవ్వాలీ"

[మీ నవ్వులు మాకే యివ్వాలీ]

- ఒకాయన కొత్తగా ఒక ఫ్యాన్సీషాపు పెట్టాడు. అమ్మకం దగ్గర అదివరకెక్కడా అనుభవంలేని కొత్తవాణ్ణి గుమాస్తాగా పెట్టాడు. ఒక రోజున షాపు యజమాని ఏదో అర్జంటుపనివుండి బయటికి వెడుతూ గుమాస్తాకు షాపు అప్పగించి వెళ్ళాడు. తిరిగి వచ్చేలోగా గుమాస్తా ఒక చిన్న ప్లాస్టిక్ కారును ఎవరికో అమ్మి యజమాని రాగానే ఆ సంగతి చెప్పాడు.

'ఈ ప్లాస్టిక్ కారు పదిహేనుపైసల కమ్మావా? నీకు బుద్ధుందా లేదా?' అని యజమాని గర్జించాడు.

గుమాస్తా హడిలిపోతూ 'అవునండి. దానికి కట్టిన చీటీమీద పదిహేను పైసలనే వుందండి' అన్నాడు.

'నీ మొహం. పదిహేను పైసలుకాదు, పదిహేను రూపాయలు. సరిగ్గా చూడద్దూ? నీకు కళ్ళులేవూ?' అంటూ అరగంటసేపు తిట్టాక, శాంతించాడు. 'పోన్లే. ఎలాగూ మనకి ఐదుపైసలు లాభం వచ్చిందనుకో. ఐనా, ఇలాంటి పొరపాటు యెప్పుడూ చెయ్యకు' అని నెమ్మదిగా మందలించాడు.

♦ ♦ ♦

- ఒక పెద్దమనిషి అర్ధరాత్రి సినిమానుంచి తిరిగివస్తున్నాడు. ఆ రోడ్డంతా నిర్మానుష్యంగా వుంది. ఇద్దరు దొంగలు ఎదురుపడ్డారు. మర్యాదగా వున్న డబ్బంతా యిచ్చెయ్యమన్నారు. పెద్దమనిషి యివ్వనన్నాడు. ఇద్దరు దొంగలతోను తలపడి హోరాహోరీగా పావుగంటసేపు పోట్లాడాడు. చివరికి దొంగలు అతన్ని కిందపడేశారు. ఒకడు చేతులు విరిచి పట్టుకోగా రెండోవాడు జేబులు తడిమి అర్ధరూపాయి చిల్లర డబ్బులుమాత్రం తీశాడు.

'బలేవాడివయ్యా. ఈ ముష్టి అర్ధరూపాయికోసమా మమ్మల్నింత తిప్పలు పెట్టావ్' అన్నా డొక దొంగ నవ్వుతూ.

పెద్దమనిషి రొప్పుతూ రోజుతూ 'అదికాదు. నా బనీను లోపలి జేబులో వందరూపాయలూ కాజేస్తారేమోనని భయపడ్డా' అన్నాడు.

చిత్రరధుని

చైత్రయాత్ర

సత్యహరిశ్చంద్ర

ముందుమాట

వేదకాలం నుంచీ సత్య వీర హరిశ్చంద్ర గాధ వినవస్తున్నది. వేదంలో, భాగవతంలో, సంస్కృత నాటకాలలో, తెలుగు నాటకాలు, పద్య కావ్యాలు, ద్విపద కావ్యాలు మొదలైన వాటిలో ఆ నిరుపమ నిత్య సత్య వ్రతుని గాథను సువర్ణాక్షరాలలో లిఖించారు.

1902 ప్రాంతాల సత్య సార్వభౌమునిపై తెలుగులో తొలి నాటకం గ్రంథరూపంలో వెలువడింది. నాటి నుంచి 70 కి పైగా తెలుగులో హరిశ్చంద్ర నాటకాలు విరచించబడినవి. హరిశ్చంద్రునిపై ఆంగ్లములోనే నాలుగుపైగా నాటకాలున్నవి.

వేదకాలంనుంచి ఈ కాలం వరకు, కాలంతోబాటు జనం, భాష, వ్యవహారాలు, అభిరుచులు మారుతూ వచ్చినవి. కాలాన్నిబట్టి, జనంలో వచ్చిన పరిణామాలనుబట్టి సాహిత్యంలో కూడా పరిణామాలు వచ్చినవి. అభినయ కళలో నాటకయుగం గర్వాతి పరిణామంచలనచిత్రయుగం. పూర్వ సాహితీ రూపాలలోని మంచిని తీసుకొని, ధీరోదాత్త లక్షణాలకు సందేహం కలిగించె సందర్భములను సంస్కరించి, నాయకుని ధీరోదాత్తతనే ప్రతి సంఘటనా ప్రకాశింపజేసే విధముగా కథనము సాగించి పాత్రోచిత శైలీ సందర్భమూ కూర్చి పండితులను, పామరులను రంజింపజేసే మాట పాటలు పొందుపరిచి, మూలమునకు, కాలమునకు, కథకు, కళకు, కొత్త కాంతి వచ్చే రీతిగా విజయా ప్రొడక్షన్స్‌వారు 'సత్య హరిశ్చంద్ర' రూపొందించారు.

సూర్య వంశీకుడైన హరిశ్చంద్రుడు కృత యుగంవాడు. శ్రీరామచంద్రునికంటె పూర్వపు చక్రవర్తి. షట్చక్రవర్తులలో ఒకడు. నూరు రాజసూయ యాగములుచేసిన ఏకైకమహీపతి. అయోధ్యరాజు. దానధర్మాది వ్రతములలో సిద్ధులైనవారు అనేకులు కలరు. కానిజగదాధారమైన సత్యవ్రతమును దృఢముగ పాలించి నిల్చిన ధీరుడు ఆ కాలానికి ఈ కాలానికి

త్రిలోకాలకూ హరిశ్చంద్రు డొక్కడే.

కథ

రామాయణం, భారతం, భాగవత కథలను ఒక్కొక్క పద్యంలో గుదిగ్రుచ్చారు. హరిశ్చంద్రుని కథను ఒక్క పాటలో గుదిగ్రుచ్చారు (ఇది చిత్రములోనే నేపథ్యములో వున్నది.) ఆ పాట భాగమును పాత్రవారీ విడగొట్టి సత్యాను సరణిలో వారే స్థితినుంచి ఏ స్థితికి దిగినదీ కథా రూపమున గ్రహించ నగును :

హరిశ్చంద్రుని కథ :

"సప్తద్వీప వసుంధర నేలిన సార్వభౌము డగు హరిశ్చంద్రుడే కాలకర్మమున కడ కీనాటికి కాటికాపరి అయెనా!

ఆ మహాత్మునికి అనుచారు లీక యీ భూత ప్రేత పిశాచములా!

... ...

వరుస సామంతరాజ వజ్ర
మకుట కాంతులన్
వరలు రాజేంద్రు దివ్య పాద
పద్మ యుగళమే
ఈ శ్మశానవాటికలో బొమికలన్ పుత్తెలన్
ఒసలికొనుచు మసలికొనుచు
నడువవలసివచ్చెనే

... ...

చతురాశాంత పరీత సర్వ
ధరణిన్ శాసింపగా
రత్న రజిత దండంబు ధరించు
రాజె
కొరవిన్ చేదాల్చి శోధించుచున్
చితులన్ ద్రోయుచు
రుద్ర భూమి నరుదెంచెన్ ఎంత
చిత్రంబహా!

చంద్రమతి కథ :

దోసిళ్ళతో రత్నరాసులే తరుగగా దానాలు చేసిన ధన్యురాలు

అత్మ సంతతి వోలె అఖిల దీన జనాళి ఆదరించిన దేవి అన్నపూర్ణ!

అట్టి చంద్రమతీ దేవి అకటా యీనాడు పట్టెడు కూటికే చెయి చాచవలసి వచ్చె.

కోటీ ఫిలింస్‌వారి
"ముళ్ళ కిరీటం" లో
విజయలక్ష్మి



ముగింపు మాట

ఎన్నో హరిశ్చంద్రల పిమ్మట వచ్చిన ఈ విజయ హరిశ్చంద్రలో కొత్త అంశాలు హరిశ్చంద్రుని పరీక్షించుటకు సహేతుకమైన ప్రాతిపదికలు వేయుట; విశ్వామిత్రుని ప్రతి చర్యా ఒక నిర్ణీతమైన ఇదమిత్థమైన ఎత్తుగడతో కూడిన దగుట; ఈశ్వరుడు కథాంతములో హఠాత్తుగా వచ్చి హరిశ్చంద్రుని రక్షించుటకాక ఆరంభమునుంచే కంటు కనిపెట్టి వుండుట, నక్షత్రకుడు గురువుపైనే తిరుగుబాటు జరిపేటంత టిగా తుదకు మారిపోవుట; ధీరోదాత్తుడైన సత్యసార్వభౌముడు "... ఈ శ్రీ హరిశ్చంద్రుడు ..." అంటూ ఆత్మస్తుతికి దిగక, మాతంగకన్యలను వివాహమాడవలసి వచ్చినప్పుడు "...వయఃపరిపాక..." ప్రసక్తి తేక, మునుల దుశ్శాసనములకంటె రాజ్యత్యాగమే మేలని యెంచి, ఎల్ల కర్మలు ఈశ్వరప్రీతికే నని అష్టకష్టములు సుఖ-సంతోషములతో స్వీకరించుట; అదినుంచి అంతమువరకు వాదనకు నిలుచునట్టుగ లక్ష్యశుద్ధితో కథ పరుగిడుట; విషాద-వినోదములు సమపాళముగ కథనములో మిళితమగుట మొదలైనవి ప్రత్యేకముగ పేర్కొనవచ్చు.

దృశ్య ప్రబంధముగా చిత్రము రూపొందించిన దర్శక నిర్మాత శ్రీ కె. వి. రెడ్డి, మూలకథ పవిత్రత నిలుపుతూ పాత్రౌచితిని కాపాడుతూ సులభ గ్రాహ్యమైన సాహితీ మాధుర్యాన్ని విరజిమ్మిన కవి శ్రీ పింగళి నాగేంద్రరావు, శ్మశాన ఘట్టములలో అద్వితీయముగ నటించిన రామారావు, ఆ పిమ్మట ఎస్. వరలక్ష్మి, రాజనాల, రేలంగి, గిరిజ, ముక్కామల, నృత్యనిర్మాత పసుమర్తి కృష్ణమూర్తి, సంగీత దర్శకుడు పెండ్యాల నాగేశ్వరరావు, కళాదర్శకులు మాధవపెద్ది గోఖలే, కళాధర్, ఛాయగ్రహణ దర్శకుడు కమల్ ఘోష్ ప్రత్యేకించి అభినందనీయులు.



విజయభట్ మూవీస్‌వారి
"తోడు - నీడ" లో
జమున

త్రిలోకాలకూ హరిశ్చంద్రు డొక్కడే.

కథ

రామాయణం, భారతం, భాగవత కథలను ఒక్కొక్క పద్యంలో గుదిగ్రుచ్చారు. హరిశ్చంద్రుని కథను ఒక్క పాటలో గుదిగ్రుచ్చారు (ఇది చిత్రములోనే నేపథ్యములో వున్నది.) ఆ పాట భాగమును పాత్రవారీ విడగొట్టి సత్యాను సరణిలో వారే స్థితినుంచి ఏ స్థితికి దిగినదీ కథా రూపమున గ్రహించ నగును :

హరిశ్చంద్రుని కథ :

'సప్తద్వీప వసుంధర నేలిన సార్వ భౌము డగు హరిశ్చంద్రుడే కాలకర్మమున కడ కినాటికి కాటికాపరి ఆయెనా!

ఆ మహాత్మునికి అనుచారు లిక యీ భూత ప్రేత పిశాచములా!

... ...

వరుస సామంతరాజ వజ్ర
మకుట కాంతులన్
వరలు రాజేంద్రు దివ్య పాద
పద్మ యుగళమే
ఈ శ్మశానవాటికలో బొమికలన్ పుఱ్ఱెలన్
ఒసలికొనుచు మసలికొనుచు
నడుపవలసివచ్చెనే

... ...

చతురాశాంత పరీత సర్వ
ధరణిన్ శాసింపగా
రత్న రజిత దండంబు ధరించు
రాజె
కొరవిన్ చేదాల్చి శోధించుచున్
చితులన్ ద్రోయుచు
రుద్ర భూమి నరుదెంచెన్ ఎంత
చిత్రంబహా!

చంద్రమతి కథ :

దోసిళ్ళతో రత్నరాసులే తరుగగా దానాలు చేసిన ధన్యురాలు

ఆత్మ సంతతి వోలె అఖిల దీన జనాళి ఆదరించిన దేవి అన్నపూర్ణ!

అట్టి చంద్రమతి దేవి అకట్కా యీనాడు పట్టెడు కూటికే చెయి చాచవలసి వచ్చె.

కోటీ ఫిలింస్‌వారి
"ముళ్ళ కిరీటం" లో
విజయలక్ష్మి



ముగింపు మాట

ఎన్నో హరిశ్చంద్రుల పిమ్మట వచ్చిన ఈ విజయ హరిశ్చంద్రలో కొత్త అంశాలు హరిశ్చంద్రుని పరీక్షించుటకు సహేతుకమైన ప్రాతిపదికలు వేయుట; విశ్వామిత్రుని ప్రతి చర్యా ఒక నిర్ణీతమైన ఇదమిత్థమైన ఎత్తుగడతో కూడిన దగుట; ఈశ్వరుడు కథాంతములో హఠాత్తుగా వచ్చి హరిశ్చంద్రుని రక్షించుటకాక అరంభమునుంచే కంటు కనిపెట్టి వుండుట, నక్షత్రకుడు గురువుపైనే తిరుగుబాటు జరిపేటంత టిగా తుదకు మారిపోవుట; ధీరోదాత్తుడైన సత్యసార్వభౌముడు '... ఈ శ్రీ హరిశ్చంద్రుడు ...' అంటూ ఆత్మస్తుతికి దిగక, మాతంగకన్యలను వివాహమాడవలసివచ్చినప్పుడు '... వయఃపరిపాక ...' ప్రసక్తి తేక, మునుల దుశ్శాసనములకంటె రాజ్య త్యాగమే మేలని యెంచి, ఎల్ల కర్మలు ఈశ్వరప్రీతికే నని అష్టకష్టములు సుఖ-సంతోషములతో స్వీకరించుట; అదినుంచి అంతమువరకు వాదనకు నిలుచునట్లుగ లక్ష్యశుద్ధితో కథ పరుగిడుట; విషాద-వినోదములు సముపాళముగ కథనములో మిళితమగుట మొదలైనవి ప్రత్యేకముగ పేర్కొనవచ్చు.

దృశ్య ప్రబంధముగా చిత్రము రూపొందించిన దర్శక నిర్మాత శ్రీ క. వి రెడ్డి, మూలకథ పవిత్రత నిలుపుతూ పాత్రౌచితిని కాపాడుతూ [illegible] గ్రాహ్యమైన సాహితీ మాధుర్యాన్ని విరజిమ్మిన కవి శ్రీ పింగళి నాగేంద్రరావు, శ్మశానఘట్టములలో అద్వితీయముగ నటించిన రామారావు, ఆ పిమ్మట ఎస్. వరలక్ష్మి, రాజనాల, రేలంగి, గిరిజ, ముక్కామల, నృత్యనిర్మాత పసుమర్తి కృష్ణమూర్తి, సంగీత దర్శకుడు పెండ్యాల నాగేశ్వరరావు, కళాదర్శకులు మాధవపెద్ది గోఖలే, కళాధర్, ఛాయగ్రహణ దర్శకుడు కమల్‌ఘోష్ ప్రశంసించ అభినందనీయులు.



విజయభట్ మూవీస్‌వారి
"తోడు - నీడ"లో
జమున

ముఖాముఖి ముచ్చట్లలో వెల్లడయిన....

"ఆదుర్తి మనసులు"

'పెళ్ళిచేసి చూడు, ఇల్లు కట్టి చూడు, అంతా కొత్త వా(తా)రలతో (సం)చలన చిత్రం తీసి చూడు'...

మొన్నీ మధ్యనే మూడవది చేసి చూసిన వ్యక్తి మూడక్షరాల ఆదుర్తి.

విమానం టెక్నిషియన్‌ను (రామమోహన్) విలాస నాయకుణ్ణి చేశారు.

సినిమాలో ఛాన్స్‌కోసం చాలా కాలంగా లెఫ్ట్ రైట్‌లు కొట్టి 'ఎబౌట్ టర్న్' అని అనిపించుకున్న ఓ పొడగరి (కృష్ణ) అడుగుముందు 'కో హీరో' పదంపెట్టి 'మార్చ్ఆన్' అని అన్నారు.

ఇంట్లో పదిహేనుమంది ప్రేక్షకులతో అభినయ ప్రదర్శనం ఆరంభించిన అబలకు (సంధ్యారాణి) దాదాపు నాలుగు కోట్ల ప్రేక్షకుల ఆనందాశీస్సుల యోగం తెప్పించారు.

క్లాసుపరీక్షలలోకూడా సినిమాలకు పోయిన ఓ సుకన్యకు చదువుకంటె చనువు అయిన సినిమా లక్షలివ్వగలదనే ధైర్యం కలిగించారు.

చాలా కాలంగా స్టేజిపై గొంతుకచినిగేటట్లు అరచి 'సినిమా ప్రేమ' ఛాన్స్‌కు నోచుకోక మజ్నూ లైపో తున్న ఎందరికో 'తేనె ఒయాసిస్'లు సృష్టించి యిచ్చారు.'

ఈ అద్భుతాలన్నీ దృష్టిలో పెట్టుకొని ఆ మూడక్షరాల మనిషి అసలు మనసులు (అభిప్రాయాలు) తెలుసుకొనేందుకు ('జ్యోతి' మద్రాసు ప్రతినిధిని) వెళ్ళాను. అంతట మా మధ్య ఊపిరి సలపని వేగంలో జరిగిన ముచ్చట్లు అచ్చట్లు యివి. ప్రశ్న నాది, జవాబు ఆ బాబుది.

ప్ర - ఆ కాలంలో అల్లావుద్దీన్ అండ్ వండర్ ఫుల్ లాంప్. ఈ కాలంలో ఆదుర్తి అండ్ వండర్‌ఫుల్ లాంప్!

జ - దీపమే. దెయ్యంలేదు!

ప్ర - వుంది. దెయ్యంలాంటి సవాలు చేశారు. జయించారు.

జ - నాకు తెలియనిదే చెబుతున్నారు. ఏమిటది?

ప్ర - మేటి తారలు అనేకంగా వుండగా కొత్తవారినే పంతంబట్టి తీసుకొనడం సవాలు కాదా?

జ - ఎన్నటికీ కాదు. తెలుగు, తమిళ రంగాలలోని అనేకమంది పెద్ద తారలతో కలసి పని చేస్తున్నప్పుడు వారిపై నేనెందుకు సవాలు చేస్తాను. కొత్త ఎక్స్‌పెరిమెంట్ చేద్దామనుకున్నాను. చేశాను.



విజయభ

రామకృష్ణ,

ప్ర - సరీగ్గా ఆ
ఇప్పుడే ఎందుకు
వచ్చిందో!

జ - అంతా కొత్త
పిక్చర్ తీయాలని నే
గానో కలలు గంటు
ఆర్థికస్తోమత ఏది?
కూడా స్తోమతు ఏది,
రెండూ సమకూరాయి
సత్యమే తత్వమైన బా
లభించింది. సుందరంగారు
అందమైన దన్నారు. శ్రీ షి
పతి చంద్రశేఖరరావుగారు

దొరక్క అనేకమంది పెద టెక్నీషి యన్‌లే వుంటే మళ్ళీ కొత్త నిరుద్యోగం సృష్టించకంలో అర్థమేమిటి?

ప్ర - తారలలో చంద్రు డొక్కడన్నట్లు మంచి టెక్నీషియన్‌లలో ఛాన్సులు లేక చంద్రులు కాలేక పోయినవారు అనేకు లున్నారు-ఉదాహరణకు విన్సెంట్ చూడండి. అవకాశం వచ్చింది. పైకి వచ్చారు. అలానే సహాయ టెక్నీషియన్‌లను స్వతంత్ర టెక్నీషియన్‌లను చేసే ప్రయత్నానికి దిగరాదా?

సెకండ్ స్ప్రింగ్ టెక్ని

ప్రజా ప్ర

ఘనత ఈ కొత్తవారిలో ఏమైనా కనిపించిందేమో చెప్పండి.

జ - ఆ. వొక్కటి. చను వు. ముఖ్యంగా ఔట్‌డోర్ షూటింగ్ సమయాలలో కానవచ్చింది. తెల్లవారు జాము నాలుగు, ఐదు గంటలకు లేపి యాక్చ్యువల్ లొకేషన్‌లకు వీరిని తీసుకొని వెళ్ళ వీలయ్యేది. కొత్తవాళ్ళు కనుక అదుర్తి ఆదేశాలకు 'ఎస్ సార్' అనే బదులు వచ్చేది. మేటి నటీనటులకు ఆదేశాలు యిచ్చి ఆవేశాలు తెచ్చుకొనేంకు ఎవ్వరూ సాహసించరు.

యత్నానికి మీరు సాహస
ారు. మరి ప్రభుత్వం
రో యిట్టి నవ్యపంథా
లుగా పన్నులమినహా
నసులు తో ప్రారంభిస్తే
డదూ!

సక్సెస్ అయితే
వారు. ఫెయిల్ అయితే
అంటారు. ప్రభుత్వం
సిన సహాయం చేస్తే

వేడుకోలు?

క లర్ చిత్రాలకు
యి వ్వ డ ం లేదు.
ర్షన చేస్తేనే కలర్ ఫిలిం
లుగు చిత్రాలు దానికి
తెలుగు ఇ ం డ స్ట్రీకిది
ండ మొంది షరతును
వజలు అ ం దో ళ న చేసి
దకపోతే మనం వెనుకపడి
ఏడవాలి - ఆ ఏడవాలి.

జ్యోతి

మేము ఒకరితో ఒడంబడిక చేసుకొని కలర్ పర్మిట్ తెచ్చుకొనేసరికి తల ప్రాణం ...

ప్ర-అంతమాట వొద్దులెండి. కొత్త వారలచేత అవసరమైన ఎఫెక్ట్ సాధించడంలో మీకు తలప్రాణం ... రాలేదా?

జ - లేదు. బోలెడంత రిహార్సల్స్ జరిపించాము.

ప్ర - షూటింగ్ సమయంలో సగటున ఎన్ని 'టేక్స్' అయ్యేవి.

జ - రెండు మూడు మించేవి
కావు. పకడ్బందీగా రిహార్సల్స్
పాము. అంచేత సెట్
తక్కువ. మే టి న
ఎక్కువ టేక్స్
తీసుకోలేదు.

ప్ర - వీళ్ళు తీసి
కోండి. కలర్ పిక్చర్
మేకప్ వగైరా ఎనో
చూసుకోవాలి. దానికి
కొత్త స్టుడియో శ్రీ
యోస్. అక్కడ
సామగ్రి, పరికరాలు
వున్నాయా? లైట్లు
పడ్డారా? కలర్‌కు
యనులు యిబ్బంది వ

జ - కలర్ పిక్చర్
మైన లైట్లు అదనంగా
మాట నిజమే. కొన్నిం
నుంచి తెప్పించాము.
లైట్లు చాలా హెచ్చు
మయ్యేవి. ఇప్పుడు క
క్వాలిటీ చాలా పెరిగింది

జ్యోతి



వాటిని వెంటనే మూసివేయమంటారా?

జ - అదే పొరబాటు. ఇన్స్టిట్యూట్‌ల నుంచే ఉత్తమ శిక్షణ పొందినవారు రావాలి. ఆర్టిస్టులకు ట్రెయినింగ్ యిచ్చే సంస్థలు మన ఆంధ్రదేశంలో లేవు. అవి లేనందునే మేము అర్జీసర్జాలకు వెళ్ళాము. అటువంటి సంస్థలే వుంటే వాటినుంచే మేటి నటీ-నటులను యెన్నుకొనే వారము.

ప్ర - అటువంటి తారా శిక్షణ కేంద్రాలు లేకపోయినా, కెమెరాకు ... అయినా ఎవ... ఎక్స్‌ప్రెషన్...



...పిక్చర్స్‌వారి ...ంచిచూడు"లో ...రాజశ్రీ

...ం. సినిమా కయితే ...అర్ మేడ్," మేడ్ బై ...స్, తారకు ఘనత ...ృష్టించేది టెక్నీషియన్సే. ...స్ అర్ మేడ్.

జ్యోతి



బాబూమూవీస్‌వారి "తేనెమనసులు" చిత్రంలో పుష్పకుమారి, వెంకటేశ్వరరావు.

"తేనెమనసులు"

కాలం మారింది. ఇది ప్రజలందరి అభిప్రాయం. కాగితాలలోనూ వుంది ఆ వాక్యం. వ్యాసాలలో, కథలలో గదించారు ఆ వాక్యం. కళ్ళకయితే అది కన్పిస్తుందికాని కార్యాచరణలో మాత్రం అది పూజ్యం.

అనేక కుటుంబాలలో భర్త భార్యను వదిలివెయ్యడం, ఆ అబలలు సంసారసుఖం ఎరుగక పుట్టిళ్ళలోనే గుట్టుగా జీవిత శేష కాలం వెళ్ళమార్చడం? ఇప్పటికీ — కాలం మారినా — జరుగుతూనే వున్నది.

కట్నాలపీడా, చీడా యింకా వుంది. ఇష్టంలేని పెళ్ళి జరగబోతే మగబిడ్డతండ్రి కట్నం చేరనందువల్ల పెళ్ళి వద్దంటే తప్పించుకొనే మగపురుషులు యీ రోజులలోనూ —

కాలం మారినా—వున్నారు. నేటికీ ఆడదంటే మగవాడికి అలుసు.

కాలం మారిం దన్నారు; సంఘం మారిం దన్నారు -కాగితాలపై. కాని కార్యానుభవంలో మారలేదు, మారలేదు మగవారి మనసులు.

కాని ఒక కన్య, ఓ "సుకన్య", అక్షరాలా కాలాన్ని మార్చింది. తండ్రి కట్నం విపరీత పరిస్థితులలో అందనందువల్ల, తండ్రే అదృశ్యుడై పోయినందువల్ల, ఈ "సుకన్య" పెళ్ళి ఆగిపోయింది. పీటలమీద "కృష్ణుణ్ణి", వరుణ్ణి కాళ్ళా వేళ్ళాపడి తనను ఏలుకోమంటే అతడు కన్నెపిల్ల నీళ్ళ కళ్ళనయినా చూడక రాతి గుండెతో పొమ్మన్నాడు.

కాల వైపరీత్యంవల్ల ఇంకొంత కాలానికి, ఇంకో ప్రదేశంలో, ఆ వరుడే, ఆ నరుడే, వానరుడై ఈ వనితవెంట పడ్డాడు. ఈమె ప్రీతికై మీసాలు గొరిగించుకొనే వరకు పోయాడు! ఎంత చెడ్డా తాళి కట్టిన భర్త. మగని మనసారా ప్రేమించింది. పెళ్ళిపీటల సంఘటన చెప్పేసి మగవాడి దురన్యాయాలు తూర్పారబట్టేద్దామనుకొంటూవుంటే ఇంకో మగవాడు ఇంకో మహా విషమ పరీక్ష తెచ్చిపెట్టాడు.

ఈ "మోహనుడు" ఓ "రాణి"ని పరిణయమాడి అమెరికా వెళ్ళివచ్చాక లేనిపోని అంతస్తులు, అందచందాలు తెచ్చిపెట్టుకొని ఆ "రాణి"ని పుట్టింటిలో శోక వాణిచేసి తన సుస్వప్నాలకు సమాధానంగా కానవచ్చిన ఆ "సుకన్య" వెంట పడ్డాడు.

ఒకప్పుడు తనకు అన్యాయం చేసిన భర్త ఒకవైపు, ఇంకో ఆడదానిని అలుసుచేసి తన వెంట పడుతున్న పరాయి పురుషుడు మరొకవైపు. కాలంమారిందా? మార్చాలా? అన్నది ఆ "సుకన్య" ఆలోచన.

తప్పు చేసిన మగరాయుళ్ళు యిద్దరూ హాయిగా వున్నారు. తప్పు చెయ్యని యిద్దరు తరుణులే హాలాహలం మ్రింగవలసి వస్తున్నది. ఈ యిద్దరిలో "రాణి" నిరాశావాదిని. రెండవ "సుకన్య" ఆశావాదిని. కాలాన్ని మార్చింది. మగరాయుళ్ళకు బుద్ధి చెప్పింది. గతి తప్పిన మగమతులకు సుగతి చూపింది. "కాలం మారింది. మీరూ మారం"డని చెప్పింది. వారిచే ఆ సత్యం ఆచరింప జేసింది, కాగితంపై మాట కార్యరూపంలోకి తెచ్చింది.

బాబూ మూవీస్ వారి—సుకన్య, సంధ్యారాణి, రామమోహన్, కృష్ణ ప్రధానపాత్రలు ధరించిన "తేనెమనసులు" చిత్రకథలోని అసలు తేనెపట్టుపై సంఘటనల కట్టు.

విశేషించి యువతీ యువకులకు చక్కిలిగింతలుపెట్టి, రెచ్చగొట్టి, అన్ని వయసులవారి, అన్ని మనసులవారి మెచ్చుకోలుకు పాత్రమయేలాగా అంతా కొత్తవారలతో, అంతా కొత్త వర్ణాలలో (తెలుగులో తొలి సాంఘిక వర్ణచిత్రమూ, తొలి సాంఘిక ఈస్ట్‌మన్‌కలర్ చిత్రమూ), అంతా కొత్త



జగపతివారి "అంతస్తులు"లో నాగేశ్వరరావు, కృష్ణకుమారి

కాలవ్యతిరేక సంస్కరణాత్మక విప్లవాత్మక వాతావరణంలో, ప్రత్యేకించి వినోద పాత్రలు లేకుండా ఘటనలలో, సంఘటనలలో, దుర్ఘటనలలో విషాదంలో వినోదం స్పందింపజేస్తూ, నవ సినీ ప్రపంచ దర్శనానికి మనకిదొక "వోష్కాడ్" అన్నట్లు "తేనె మనసులు" తీర్చిదిద్దిన సిబ్బంది యిది :

నిర్మాత-సి. సుందరం, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం - ఆదుర్తి సుబ్బారావు, కో డైరెక్టర్-కె. విశ్వనాథ్, ఛాయాగ్రహణం-పి. యస్. సెల్వరాజ్, ఔట్‌డోర్ యూనిట్ - ప్రసాద్ ప్రొడక్షన్స్, స్పెషల్ ఎఫెక్ట్స్- మదనమోహన్, కలర్ - ఈస్టుమన్ కలర్-రాజన్, జెమిని కలర్ లేబరేటరీస్, కళ - సుబ్బారావు, తోట, దుస్తులు - రామకృష్ణ, అచ్యుతం, కథ - ముళ్ళపూడి వెంకట రమణ, కె. విశ్వనాథ్, కె.ఆర్.కె. మోహన్, మాటలు - ఆత్రేయ, విశ్వనాథ్, పాటలు - ఆత్రేయ, దాశరథి, సంగీతం-కె. వి. మహదేవన్, నేపథ్య గానం - సుశీల, ఘంటసాల, శ్రీనివాస్, నృత్యాలు - హీరాలాల్, మేకప్-నాగేశ్వరరావు, రికార్డింగ్-పాటలు - రంగస్వామి, శివరాం, మాణిక్యం, రామనాథన్, మాటలు-బి. బి. కె. గోఖలే, రీరికార్డింగ్-

స్వామినాథన్, కలర్ ఫొటోలు - కళాక్షేత్ర కలర్‌లాబ్, స్టిల్స్ - సత్యం, స్టుడియో - శ్రీ సారథి స్టుడియోస్ (హైదరాబాద్), సమర్పణ-పాల్స్ అండ్ కో.

ఈ శృంగార సంగీత మధుర ప్రకృతి దృశ్య వర్ణ చిత్రానికి ఎడిటర్ టి. కృష్ణ, విడుదల-శ్రీ ఫిలింస్.

తారలైన కొత్తవారలు: రామమోహన్, కృష్ణ, వెంకటేశ్వరరావు, కోనేశ్వరశాస్త్రి, చలపతిరావు, జి. ఎస్. ఆర్. మూర్తి, సంధ్యారాణి, సుకన్య, పుష్పకుమారి, వాణీబాల, రాధాకుమారి, బేబీ రోజారాణి, జి. వి. సుబ్బారావు, కె. వి. చలం, గరిమెళ్ళ రామమూర్తి, చంద్రశేఖరరావు, ఎం. రామదాసు, ఒ. రామమూర్తి, సి హెచ్. కబీర్‌దాస్, ఎన్. వాసుదేవరావు, సరిత, ఆనంద మోహన్.


విశిష్టాంశాలు :

"తేనెమనసులు" లో కొన్ని విశిష్టాంశాలను ప్రత్యేకించి చెప్పవచ్చు. అవి యివి :

తేనెమనసుల కథ నిజానికి అంత

పద్మశ్రీవారి "ప్రేమించిచూడు"లో రాజశ్రీ, నాగేశ్వరరావు





విక్రమ్ ప్రొడక్షన్స్‌వారి "చంద్రహాస"లో కృష్ణకుమారి

కలర్ సబ్జెక్టు కాదు. కాని కాల్పనిక శక్తితో వాదనకు వీలైనంతవరకు నిలచేటట్లుగా కలర్ సబ్జెక్టు చెయ్యడమే ఒక పరీక్షలో కృతార్థులు కావడము.

"రాణి" తండ్రి (నరసరాజు—జి. ఎస్. ఆర్. మూర్తి) తను అప్పులకు వెళ్ళి పడిన అగచాట్లు ముందే వన్, టూ, త్రీగా చూపక పరీక్ష ఘట్టంలో ఫ్లాష్ బ్యాక్‌గా కాక శిరస్సుపై సూపర్ ఇంపోజ్ చెయ్యడం. బ్యాంకుకు అతడు వెళ్ళడానికి కూతురు (చిన్ని - బేబీ రోజారాణి) ప్రోద్బలించిన సంఘటన.

ఆ చిన్ని ద్వారా "సుకన్య", "కృష్ణ" లవ్ తతంగ నిర్మాణం, చిత్రీకరణ.

కృష్ణ తండ్రి వీరభద్రం (చలపతిరావు) రౌద్ర రసపోషణ. కారుకు అడ్డంగా సైకిలు పడేసి కారువాణ్ణి దబాయించడం. అబ్బాయి స్కూటరుకు వెనకసీటు ఎత్తివెయ్యడం. మీసం కొసకు బుస కొట్టడం.

ఈ వీరభద్రం కుమారుని పీటల మీద పెళ్ళి ఆగిపోవడానికి కారణం ఆ నరసరాజు చేసిన ఒక దొంగతనం. ఆ భద్రం ఈ నరసరాజు యింటి పెళ్ళికి వచ్చి [illegible] ముఖాన్నే ఆ దొంగను [illegible] బట్టడం.

[illegible]

వేశం (నర్తకి జయశ్రీ) కల్పనలో భావనాపటిమ.

జి. డి. అండ్ కో ప్రొప్రయిటర్ (చలం) వంటి కొత్తపాత్రలు కల్పించడం, రంగనాథం (వెంకటేశ్వరరావు) సోదర ప్రేమ ప్రదర్శన, 'విశ్రాంతి' కల్పన, చిత్రాంతంలో తారలైనవారల జంటలను కాశీ స్పెషల్ బస్సులో చేర్చడం మొదలైన అంశాలు

సంగీతం లలితమైనది. శ్రావ్యమైనది. ఛాయాగ్రహణం ప్రకృతిలో చల్లనిది, స్టుడియోలో ముదురైనదీ ముచ్చటైనదీ.

పై సంఘటనలన్నీ ఒక ఎత్తు పై పరీక్షలన్నీ ఒక ఎత్తు. కామాంధుడైన మోహనుడు ఓ రాత్రి 'సుకన్య'ను 'రాణి'గా భ్రమించిన సంఘటన ఒక ఎత్తు. దాన్ని చిత్రీకరణ ఒక ఎత్తు. ఆ సన్నివేశమును వాదనకు నిలచేటిగా చిత్రీకరించడమే కష్టమైతే ఒకపాట పెట్టి నిమిషాలపాటు చిత్రీకరించడం ఎంత కష్టమో, ఎంత కాల్పనికశక్తి, భావనాపటిమ, సాంకేతిక విజ్ఞానము అవసరమో వూహించవచ్చు. సహజ అసహజముల ప్రసక్తికి పోకుండా ఆ సన్నివేశం చిత్రీకరణే దృష్టిలో పెట్టుకొంటే ఆ సృష్టిని మెచ్చుకోక తప్పదు.

అన్నపూర్ణావారి క్రొత్తచిత్రం

అన్నపూర్ణావారి తదుపరి చిత్రానికి మేలో షూటింగ్ ప్రారంభం కాగలదు. దర్శకుడు –కె. విశ్వనాథ్. ముఖ్యనటుడు – నాగేశ్వరరావు. నిర్మాత–డి. మధుసూదనరావు.

చలన చిత్ర వార్తలు

"ఆంధ్ర మహావిష్ణువు" నిర్మాణ ప్రారంభం

శంభూ ఫిలిమ్సువారు ఏప్రిల్ 14వ తేదీన 'ఆంధ్ర మహావిష్ణువు' చిత్రం షూటింగ్ వాహినీలో ప్రారంభించారు. మొదటి సెట్టులోనే ముఖ్య పాత్రలందరికీ పని వున్నందున దాదాపు రెండు నెలలనుంచి దుస్తులు వగైరా నిర్మాణ కార్యకలాపాలలో నిర్మాతలు నిమగ్నులై వున్నారు. రామారావు, రంగారావు, బాలయ్య, రేలంగి, ప్రసాద్, జమున, విజయలక్ష్మి, గిరిజ మొదలైనవారు తారాగణంలో వున్నారు. కథ, సంభాషణలు, పాటలు–పింగళి నాగేంద్రరావు, స్క్రీన్ ప్లే–దగ్గుబాటి చౌదరి, సంగీతం – పెండ్యాల, నృత్యాలు – వసుమర్తి, కళ–తోట, కూర్పు–సత్యం, దర్శకుడు – ఎ. కె. శేఖర్, నిర్మాత – దగ్గుపాటి లక్ష్మీనారాయణ చౌదరి.

బాబూ మూవీస్ వారి చిత్రాలు

బాబూమూవీస్ వారు అతిత్వరలో 'కన్నెమనసులు' నిర్మాణం ప్రారంభించనున్నారు. కథసిద్ధమైనది. ఆచిత్ర నిర్మాణం జరుగుతుండగా అతిస్వల్ప వ్యవధిలో 'విశాలనేత్రాలు' (శ్రీ పిలకా గణపతిశాస్త్రి నవల ఆధారం) నిర్మాణము ప్రారంభించి సాగిస్తారు.



జగపతివారి "అంతస్తులు" చిత్రంలో భానుమతి

"అంతస్తులు" నిర్మాణంపూర్తి

జగపతివారి 'అంతస్తులు' చిత్రంలో ఏప్రిల్ మధ్యకు ఐదురోజుల పని మాత్రం మిగిలి వున్నది. ఈ సంచిక వెలువడే తేదీకి ఆర్. ఆర్. కాపీ సిద్ధం కావచ్చు. నాగేశ్వరరావు, జగ్గయ్య, గుమ్మడి, రేలంగి, రమణారెడ్డి, రాజబాబు, కాంతారావు, భానుమతి, కృష్ణకుమారి, జి. వరలక్ష్మి, ఎల్. విజయలక్ష్మి మొదలైనవారు తారాగణంలోకలరు. నిర్మాత– వి. బి. రాజేంద్ర ప్రసాద్, దర్శకుడు– వి. మధుసూదనరావు, సంభాషణలు – ఆత్రేయ. పాటలు – ఆరుద్ర, కొసరాజు, ఆత్రేయ, సంగీతం – కె. వి. మహదేవన్, కళ – టి. వి. సుబ్బారావు, నృత్యాలు – హీరాలాల్, కె. ఎస్. రెడ్డి, ఛాయాగ్రహణం – సి. నాగేశ్వరరావు.

పి. ఏ. పి. తాజా చిత్రం

పి. ఏ. పి. వారి తాజా సాంఘిక చిత్రంలో ఇన్ డోర్ షూటింగ్ దాదాపు పూర్తి అయినట్లే చెప్పవచ్చు. ఆ మధ్య ఏకటాకీగా షూటింగ్ జరిపారు. ఆరు పాటల చిత్రీకరణ జరిగింది. నాగేశ్వరరావు, జగ్గయ్య, సావిత్రి, జయ లలిత, గుమ్మడి, రాజశ్రీ, హేమలత, రమణారెడ్డి, సంధ్య, ప్రభాకరరెడ్డి తారాగణంలో కలరు. సంగీత దర్శకుడు– టి. చలపతిరావు, దర్శకుడు – కె. ప్రత్యగాత్మ, సంభాషణలు ఆత్రేయ, కథ–యద్దనపూడి [illegible].

Edited and Published by V. V. Raghavaiah and Printed by him at Jyothi Press, Congress Office Road, Governorpet, Vijayawada-2.

AY.1965 Reqd.No.H.368

జగపతి పిక్చర్స్

అంతస్తులు

నిర్మాత వి.రాజేంద్రప్రసాద్ * దర్శకుడు వి.మధుసూదనరావు



రచన
ఆచార్య ఆత్రేయ

సంగీతం
కె.వి.మహదేవన్

వాణీ రిలీజ్